ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 19.09.2025 | సంపుటి :12 సంచిక : 61 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## మూసీ రివర్‌ఫ్రంట్‌లో బ్రిటీష్ కంపెనీలు
# భాగస్వామ్యం కండి

### తెలంగాణ విద్యార్థుల కోసం హైదరాబాద్ నుంచే యూకే యూనివర్సిటీలు ఆపరేట్ చేసేలా చూడండి

- బ్రిటీష్ హైకమిషనర్ లిండీను కోరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కొత్త ఎడ్యుకేషన్ పాలసీ డ్రాఫ్ట్ గురించి వివరించిన సీఎం
- తెలంగాణ విద్యార్థులకు సహకారం అందిస్తాం
- ముఖ్యమంత్రికి బ్రిటీష్ హైకమిషనర్ హామీ




హైదరాబాద్(జనంసాక్షి):భారత బ్రిటీష్ హైకమిషనర్ లిండీ కామెరాన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం జూబ్లీహిల్స్ నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యూకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్ షిప్ కో-ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు లిండీ కామెరాన్ అంగీకరించారు. ఎడ్యుకేషన్, టెక్నాలజీ సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు- ముఖ్యమంత్రికి బ్రిటీష్ హైకమిషనర్ వివరించారు. యూకే యూనివర్సిటీలలో చదువుకునే తెలంగాణ విద్యార్థుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి అక్కడి యూనివర్సిటీలు ఆపరేట్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో తీసుకురాబోతున్న కొత్త ఎడ్యుకేషన్ పాలసీ డ్రాఫ్ట్‌ను కూడా బ్రిటీష్ హైకమిషనర్‌కు సీఎం వివరించారు.రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు ట్రైనింగ్ అందించేందుకు బ్రిటీష్ హైకమిషనర్ సుముఖత వ్యక్తం చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో బ్రిటీష్ కంపె నీలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి కోరారు.

మిగతా 2లో..

## గగన్‌యాన్‌లో 'వ్యోమమిత్ర'

### ఇది అంతరిక్షంలోకి పంపే ఏఐ ఆధారిత హాఫ్ హ్యూమనాయిడ్ రోబో
### ఇస్రో ఛైర్మన్ వి నారయణన్ కీలక వ్యాఖ్యలు



శ్రీహరికోట(జనంసాక్షి): భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో ఇస్రో ప్రతిష్ఠాత్మక గగన్ యాన్ మిషన్‌ను చేపట్టింది. అంతకంటే ముందు మనిషిని పోలిన రోబోను అంతరిక్షంలోని పంపనుంది. అందు కోసం తయారు చేసినదే సగం హ్యూమనాయిడ్ రోబో వ్యోమమిత్ర. అయితే ఇది ఆర్టిఫిషియన్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత హాఫ్ హ్యూమనాయిడ్ రోబో అని ఇస్రో ఛైర్మన్ వి నారయణన్ తెలిపారు.గగయాన్ మిషన్‌ను సంబంధించిన పనులు జరగుతున్నాయని నారాయణన్ అన్నారు. ఈ ఏడాది డిసెంబర్ చివర్లో మానవరహిత అంతరిక్ష నౌకను పంపాలనే ప్రణాళిక ఉందని తెలిపారు. మిషన్ విజయవంతం కావడానికి

మిగతా 2లో..

### సాఫ్ట్‌వేర్ సహాయంతో పకడ్బందీగా
# ఓట్ల చోరీ

### ఓట్ల దొంగల్ని ఎన్నికల సంఘమే రక్షిస్తోంది




- ఒక రాష్ట్రం తరవాత మరో రాష్టానికి విస్తరిస్తోంది
- కాంగ్రెస్‌కు పడే ఓట్ల జాబితా గుర్తించి చర్యతీసుకుంటోంది
- ఆన్‌లైన్‌లో ఈ తతంగానికి ఇతర రాష్ట్రాల ఫోన్ల వినయోగం
- ఈసీ ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు

న్యూఢిల్లీ(జనంసాక్షి): కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్ని కల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల నుంచి ఓట్లను తొలగించారని విమర్శించారు. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడీలను తొలగించినట్లు వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కేంద్రీకృత పద్ధతిలో ఈ చర్యలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ మేరకు దిల్లీలో మీడియా సమావేశంలో ఆరోపణలు చేశారు. ఓట్ల తొలగింపు అంతా వ్యక్తులతో గాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి చేస్తున్నారు. అదంతా ఒక పక్రియ ప్రకారం జరుగుతోంది. ప్రతిపక్షాలకు ఓట్లు- వేసే

మిగతా 2లో..

### ఆరోపణలపై విచారణ జరపకుండానే
## ఖండించి ఈసీ
సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు అసాధ్యమని వెల్లడి

2లో..



## గిన్నిస్ బుక్‌లో చోటు దక్కేలా..
# బతుకమ్మ సంబరాలు

### 21న వేయి స్తంభాల ఆలయంలో తొలి బతుకమ్మ
### మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి అని, ప్రకృతిని గౌరవించడం, ప్రకృతిని కాపాడటం మనందరి బాధ్యత అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ పండుగలో పెద్దఎత్తున పాల్గొని ప్రపంచానికి చాటి చెప్పాలని తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు బతుకమ్మ పండుగ సంబరాలు జరుగుతాయని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. ఈ నెల 21వ తేదీన వరంగల్ జిల్లాలోని వెయ్యి స్తంభాల ఆలయం వద్ద బతుకమ్మ సంబరాలు ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. గిన్నిస్ బుక్ రికార్డులో చేరే విధంగా సంబరాలు నిర్వహిస్తామని తెలిపారు.

మిగతా 2లో..



# అభయ్ లేఖ ఎవరి సృష్టి..?

### ఇదో మైండ్‌గేమ్‌గా విశ్లేషణ
### అభయ్ లేఖకు, కేంద్ర కమిటీ ప్రకటనకు పొంతన లేదు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) : ఆయుధాలు వీడుతామని మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట విడుదల్కెన లేఖ ఓ సృష్టేనని తెలుస్తోంది. ఎలాంటి చర్చల్లేకుండా మావోయిస్టు పార్టీ పేరిట లేఖ విడుదల కావడం, శాంతిచర్చలకు వస్తామని ప్రకటించడం అస్పష్టంగా ఉన్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు. ఇది మావోయిస్టులను గందంగోళ పరిచే ఓ మైండ్‌గేమ్ అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పదిరోజుల కింద విప్లవోద్యమ వెనుకంజ స్థితిని అధిగమించే సమర్థతలను పెంచుకోవాలని 21వ పార్టీ స్థాపన వార్షికోత్సవాల సందర్భంగా కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది. కానీ ఆగస్టు 15న అభయ్ పేరు, ఫొటోతో ఆయుధాలు వదిలేసేందుకు సిద్ధమని ప్రకటన మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడం, ఆ లేఖను అభయ్ చదివి వినిపించారని తర్వాత రోజే ఆయన ఆడియో వైరల్ కావడం, దీనిని నిఘా వర్గాలు కూడా నిజమేనని నిర్ధారించడం

మిగతా 2లో..



## బీజాపూర్ అడవుల్లో
# ఎన్‌కౌంటర్

### ఇద్దరు మావోయిస్టులు మృతి
### కొనసాగుతున్న కూంబింగ్



బీజాపూర్ (జనంసాక్షి):బీజాపూర్ జిల్లా నైరుతి ప్రాంతంలోని మంకేలి అడవుల్లో భద్రతా బలగాలు, నక్సల్స్ మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు నక్సల్స్ మృతిచెందారు.వీరిపై రూ.7 లక్షల రివార్డు ఉంది. డీఆర్జీ, ఎస్టీఎఫ్, కోబ్రా-202, 205 బెటాలియన్ సంయుక్త బృందం ఈ సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించినట్లు బీజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో బలగాలు కూంబింగ్‌లో ఉండగా.. నక్సల్స్ తారసపడ్డారని, ఆ వెంటనే కాల్పులు జరిపారని పేర్కొన్నారు. ఆత్మ రక్షణ కోసం బలగాలు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మరణించగా.. మరికొందరు అడవుల్లోకి

మిగతా 2లో..

# తరతరాలు నిలిచేలా మేడారం అభివృద్ధి పనులు

### త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శంకుస్థాపన

- మరింత విశాలంగా ఆలయ ప్రాంగణం భక్తులకు మరింత సౌకర్యవంతంగా దర్శనం
- పూజారుల అభిప్రాయాలకు పెద్దపీట ఆదివాసీ సంస్కృతిని, విశ్వాసాన్ని,
- వారసత్వాన్ని, తల్లుల త్యాగాన్ని మరింత బలంగా ప్రతిబింబించేలా అభివృద్ధి పనులు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరు లక్ష్మణ్ కుమార్



హైదరాబాద్(జనంసాక్షి):ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ఆదివాసి జాతరగా ప్రసిద్ధి చెందిన సమ్మక్క సారలమ్మ ఆలయ ప్రాంగణం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మేడారం ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, పూజారుల అభిప్రాయాలు, ఆలోచనల మేరకు అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రులు అధికారులను ఆదేశించారు.మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో గురువారం సచివాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. సీఎం సెక్రెటరీ శ్రీనివాస రాజు, దేవా దాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యార్, మేడారం సమ్మక్క సారలమ్మ పూజారులు, నిపుణులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. మేడారం జాతర నిర్వహణ, ఆలయ అభివృద్ధికి సంబంధించి పూజారుల అభిప్రాయాలను మం త్రులు తెలుసుకున్నారు. వారి ఆలోచనలు, అబి . ప్రాయాలు, ఆదివాసి సంప్రదాయాలకు అనుగు ణంగానే ఆలయ అభివృద్ధి పనులు జరుగుతాయని మంత్రులు స్పష్టం చేశారు.

మిగతా 2లో..

### అసెంబ్లీ ఎన్నికలు కాదు..
## జూబ్లీహిల్స్ గురించిమాట్లాడు

- పార్లమెంటులో ఎన్ని సీట్లు వచ్చాయో స్థానిక ఎన్నికల్లోనూ అన్నే వస్తాయి
- కేటీఆర్ విమర్శలపై మండిపడ్డ మంత్రి పొంగులేటి

3లో..

## హైదరాబాద్‌లో మరోసారి
# కుంభవృష్టి

- లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వరదనీరు
- వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు
- మూడురోజులపాటు భారీ వర్షాలు
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీచేసింది. సూర్యాపేట, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో

మిగతా 2లో..



## సుంకాలపై ట్రంప్
# యూటర్న్?!



### భారత్‌పై టారీఫ్‌లపై వెనక్కితగ్గిన అమెరికా అధ్యక్షుడు!

- 50% టారిఫ్‌లో 25 % పెనాల్టీ టారిఫ్‌ను రద్దు చేయనున్నట్లు సమాచారం
- కేంద్ర చీఫ్ ఎకనమిక్స్ అడ్వైజర్ (సీఈఏ)వీ అనంత నాగేశ్వరన్ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్‌పై 50శాతం టారిఫ్ విధింపు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. నవంబర్ 30 తర్వాత భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వస్తువులపై అందుబాటులోకి రానున్న 50శాతం టారిఫ్‌లో 25 శాతం పెనాల్టీ టారిఫ్‌ను రద్దు చేయనున్నట్లు సమాచారంరష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తుందని.. ఫలితంగా ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం కొనసాగుతోందంటూ భారత్‌పై ట్రంప్ టారిఫ్‌తో పాటు పెనాల్టీ టారిఫ్ 25శాతం విధించారు. ఆ పెనాల్టీ టారిఫ్ విషయంలో భారత్-అమెరికా మధ్య చర్చలు జరుగుతున్నాయని, ఆ చర్చలు సఫలమై.. పెనాల్టీ టారిఫ్‌ను తొలగించే అవకాశం ఉందంటూ కేంద్ర చీఫ్ ఎకనమిక్స్ అడ్వైజర్ (సీఈఏ)వీ అనంత నాగేశ్వరన్ కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం కోల్‌కతా మర్చంట్స్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎంసీసీఐ) సమావేశంలో వీ. అనంత నాగేశ్వరన్ మాట్లాడారు.

మిగతా 9లో..

## సామాజిక మార్పునకు డిజైన్
# ఆయుధం కావాలి

- యాప్ డిజైన్ లీడర్‌గా హైదరాబాద్
- ఏఐ టెక్నాలజీకి గ్లోబల్‌సెంటర్ కానుంది
- యూఎక్స్ ఇండియా అంతర్జాతీయ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- త్వరలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ డిజైన్: ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్(జనంసాక్షి):యాప్ డిజైన్ లీడర్ గా హైదరాబాద్ ను నిలిపేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. యూఎంవో ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం హైటెక్ సిటీ లోని ట్రైడెంట్ హోటల్లో యూక్స్ ఇండియా 25" పేరిట ఏర్పాటు చేసిన 21వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ యూజర్ ఎక్స్పీరియన్స్ & ప్రోడక్ట్ డిజైన్"ను ఐటీ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి లాంఛనంగా ప్రారంభించిన అనంతరం డిప్యూటీ సీఎం ప్రసంగించారు. హైదరాబాద్ నగరం ఎటువంటి టెక్నాలజీ నైనా అందిపుచ్చుకొని లీడర్ గా ఎదుగుతుంది అన్నారు. ఏఐ టెక్నాలజీకి హైదరాబాద్ మహా నగరాన్ని గ్లోబల్ సెంటర్ గా నిలబెట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి తో పాటు యావత్ క్యాబినెట్ పట్టుదలతో ఉందన్నారు.




ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసిన ప్రతినిధులు హైదరాబాద్ వాతావరణం, సంస్కృతి, కళలు, ఆహారం అన్నిటిని ఆస్వాదించాలని, ప్రతినిధులు ఈ రాష్ట్రంలో ప్రధానంగా టెక్నాలజీ రంగంలో గుర్తించిన అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని

మిగతా 2లో..



### అమెరికా పోలీసుల కాల్పుల్లో మహబూబ్‌నగర్ వాసి
# మృతి

### ఇద్దరి స్నేహితుల మధ్య గొడవలో ప్రమాదవశాత్తు మృతి

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికాలో మహబూబ్‌నగర్ వాసి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఇద్దరు మిత్రుల మధ్య గొడవ చల్లారకపోవడంతో పోలీసులు కాల్పులు జరపారు. ఈ కాల్పుల్లో అక్కడే ఉన్న మహబూబ్‌నగర్ వాసి అమెరుద్దీన్ (29)కు బుల్లెట్ తగిలి ప్రాణాలు వదిలాడు.పూర్తి వివరాల్లోకి వెళ్తే మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన అమెరుద్దీన్ 2016 సంవత్సరంలో అమెరికా వెళ్లాడు. అక్కడి యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడాలో

మిగతా 2లో..



## మూసీ రివర్‌ఫ్రంట్‌లో బ్రిటీష్ కంపెనీలు
# భాగస్వామ్యం కండి

జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్, అకాడమీ విభాగాల్లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం కోరగా.. అందుకు బ్రిటీ-ష్ హైకమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశానికి డిప్యూటీ- హైకమిషనర్ హైదరాబాద్ గారెత్ విన్ ఓవెన్, పొలిటికల్ ఎకానమి అడ్వైజర్ నళిని రఘురామన్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి హాజరయ్యారు. విద్య, సాంకేతిక సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్న ట్లు- బ్రిటిష్ హైకమిషనర్ సీఎంకు వివరించారు. యూకే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్ షిప్‌ను కో ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు అంగీకరించారు.

## అమెరికా పోలీసుల కాల్పుల్లో మహబూబ్‌నగర్ వాసి మృతి

ఎంఎస్ పూర్తి చేశాడు. అనంతరం ఓ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. 6 నెలల క్రితం ఉద్యోగ ఒప్పందం ముగిసింది. దీంతో ఎక్స్‌టెన్షన్ లేక తన మిత్రులతో కలిసి ఓ రూమ్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇద్దరు మిత్రుల మధ్య గొడవ జరిగింది. వారిలో ఒకరు పోలీసులకు సమాచారం తెలియజేశారు.పోలీసులు వచ్చినా గొడవ ఆగలేదు. దీంతో అమెరికా పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ప్రమాదవశాత్తు ఆ తూటా వెళ్లి అమెరుద్దీన్‌కు తగిలింది. దీంతో అతను ప్రాణాలను కోల్పోయాడు. వెంటనే అక్కడి మిత్రులు ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశారు. చికాగోలో ఉంటున్న మృతుడి మామయ్య ఘటనా స్థలికి చెరుకున్నారు. ఎనిమిది రోజుల క్రితం ఊర్లోని తన తల్లిదండ్రులతో అమెరుద్దీన్ మాట్లాడినట్లు స్థానికంగా ఉన్నవారు చెబుతున్నారు. అయితే, ఈ ఘటన ఎప్పుడు జరిగిందన్నదానిపై స్పష్టమైన సమాచారం లేదు.

## అభయ్ లేఖ ఎవరి సృష్టి..?

అనుమానాలకు తావిస్తోంది. సెప్టెంబర్ 9న కేంద్ర కమిటీ పిలుపునిచ్చిన ప్రకటనలో స్పష్టంగా విప్లవోద్యమాన్ని కాపాడుకుందామని, శత్రువుకు అబేధ్యంగా పార్టీని తీర్చిదిద్దుకుందామని పేర్కొంది. ఈ నేపథ్యంలో పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా తిప్పిరి తిరుపతిని నియమించడం, వెంటనే ఉద్యమాన్ని కాపాడుకోవాలని పిలుపునివ్వడం వంటి పరిణామాలను బలహీనం చేయాలనే ఉద్దేశంతో 'అభయ్' లేఖను సృష్టించినట్టు విశ్లేషకులు చెబుతున్నారు. అభయ్ ప్రకటనకు, సెప్టెంబర్ 9న ప్రకటనకు ఏమాత్రం పోలిక లేదు. కాబట్టి కేంద్ర కమిటీ విడుదల చేసిన పది పేజీల ప్రకటన నిజమైనదిగా భావించాల్సినట్టు తెలుస్తోంది.

## బీజాపూర్ అడవుల్లో ఎన్‌కౌంటర్

పారిపోయినట్లు వివరించారు. వారికోసం కూంబింగ్ కొనసాగుతోందని తెలిపారు. మృతిచెందిన నక్సల్స్ వద్ద ఒక 303 రైఫిల్, ఒక బీజీఎల్ లాంచర్, మూడు బీజీఎల్, నాలుగు లైవ్ రౌండ్లు, బ్యాటరీ కార్డెక్స్ వైర్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

## రైతులకు అన్యాయం చేస్తే
# మరో లగచర్ల..
### సీఎం రేవంత్ ట్రిపుల్‌ఆర్
### అలైన్‌మెంట్ ఎందుకు మారుస్తున్నారు?: కేటీఆర్

**వికారాబాద్(జనంసాక్షి):**రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్రంగా స్పందించారు. రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు మారుస్తోందని ప్రశ్నల వర్షం కురిపించారు. అలైన్‌మెంట్‌ను మార్చి రోడ్డు నిర్మాణం చేపడితే మరో లగచర్ల ఘటన రిపీట్ అవుతుందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కేటీఆర్ హెచ్చరించారు . గతంలో ఆమోదించిన రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం అలైన్‌మెంట్‌ని మార్చి సర్వే నెంబర్లను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది.అయితే, గతంలో నిర్మించ తలపెట్టిన మార్గంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు ఉండటంతో అలైన్‌మెంట్‌ను మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వం. అలైన్‌మెంట్ మార్పుతో రైతులు భారీగా భూములు కోల్పోతున్నారు. ఈ విషయంపై వారం రోజులుగా వివిధ పద్ధతుల్లో నిరసన వ్యక్తం చేశారు అన్నదాతలు. అధికారులు తమను పట్టించుకోవడం లేదని కేటీఆర్‌ను కలిశారు. మోమిన్‌పేట మండల గ్రామాల రైతులు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఫోన్‌లో మాట్లాడారు కేటీఆర్. పేద రైతుల భూములను గుంజుకొని వారికి అన్యాయం చేస్తే మరో లగచర్ల ఘటన చోటు చేసుకుంటుందని కలెక్టర్‌ను హెచ్చరించారు. అయితే, కలెక్టర్‌ను హెచ్చరించిన వీడియో వికారాబాద్ జిల్లా వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తోంది.

## దుష్ప్రచారాలు నమ్మొద్దు

- ఏదైనా ఉంటే నేనే మీడియా సమావేశం పెట్టి వెల్లడిస్తా
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వివరణ

**నల్లగొండ(జనంసాక్షి):**తనటే గిట్టని కొందరు వ్యక్తులు తన ప్రతిష్ఠ దెబ్బతీసేందుకు, సామాజిక మాధ్యమాల ద్వారా అవాస్తవాలు వ్యాపింపజేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వదంతులను నమ్మొద్దని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. గుంటూరులో ఓ కార్యక్రమానికి వెళ్తూ.. చిట్యాల మండలం పెద్దకాపర్తిలో కార్యకర్తలతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ప్రచారంపై స్పందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని, పార్టీ పెడుతు న్నానని ఇలా రకరకాల వార్తలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు దృష్ట్యా, పార్టీని బలోపేతం చేసేందుకు కొన్ని సందర్భాల్లో నా అభిప్రాయాన్ని బహిరంగంగా చెప్పాను. అలా చెప్తే తప్పేంటి?ఇవాళ కూడా ఓ ప్రైవేటు-కార్యక్రమానికి గుంటూరు వెళ్తుంటే.. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలవడానికి వెళ్తున్నానని వదంతులు సృష్టిస్తున్నారు. నా రాజకీయ భవిష్యత్ గురించి మీడియా సమావేశం పెట్టి చెబుతా, అప్పటి వరకు ఈ దుష్ప్రచారాలు నమ్మొద్దని తెలంగాణ సమాజాన్ని కోరుతున్నానని రాజగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.తన పదవికి రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని లేదా కొత్త పార్టీ పెడుతున్నానని జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని ఆయన స్పష్టం చేశారు. మా కుటుంబం ఎప్పటినుంచో కాంగ్రెస్ పార్టీ నేపథ్యమే ఉన్న కుటుంబం. నాకు కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అంటే గౌరవం ఉంది. కానీ నాకు, మా కుటుంబానికి గిట్టని కొందరు వ్యక్తులు కావాలనే ఈ రకాల ప్రచారం చేస్తున్నారు. మా ప్రతిష్ఠ దిగజార్చేందుకే ఈ రూమర్లు సృష్టిస్తున్నారని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకే తన వ్యాఖ్యలు ఉంటాయని, తన రాజకీయ భవిష్యత్తుపై తాను చెప్పకపోతే ఇతరుల మాటలను ఎవరు నమ్మొద్దని ఆయన హితవు పలికారు.

## సాఫ్ట్‌వేర్ సహాయంతో పకడ్బందీగా
# ఓట్ల చోరీ



కమ్యూనిటీలను మరీ ముఖ్యంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి సంబంధించి మేం 100 శాతం ఆధారాలను గుర్తించామన్నారు. త్వరలో ఎన్నికల సంఘంపై హైడ్రోజన్ బాంబ్ పేల్చబోతున్నట్లుగా ప్రకటించినట్టుగానే గురువారం రాహుల్‌గాంధీ పేల్చారు. ఓట్ల చోరీపై గతంలో కొన్ని ఆధారాలు బయటపెట్టగా.. ఈరోజు మరిన్ని ఆధారాలను బయటపెట్టారు. మీడియా ముందు వీడియో ప్రజెంటేషన్ ఇస్తూ... ఓట్ల చోరీపై 100 శాతం ఆధారాలతో రుజువులు బయటపెడుతున్నట్లు- ప్రకటించారు. దేశ వ్యాప్తంగా లక్షలాది ఓట్లు- తొలగించాలని కొంత మంది కంకణం కట్టుకున్నారని.. దానికి ఎన్నికల సంఘం వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే ఈసీ కళ్లప్పగించి చూస్తోందని ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రంలో ఎన్నికలు అయిపోతే.. ఇంకొక రాష్ట్రంలో.. ఇలా అన్ని రాష్ట్రాల్లో ఎన్నికల సమయానికి లక్షలాది మంది ఓట్లను తొలగిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఇందుకోసం కేంద్రీకృత సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి.. కాంగ్రెస్ బూత్‌ల నుంచి ఓట్లు- తొలగించారని వివరించారు. ఇందుకు ప్రత్యేక ఉదాహరణగా 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు బలమైన ఓటు- బ్యాంక్ ఉన్న బూత్‌ల నుంచి వేలాది ఓట్లు తొలగించినట్లు- వెల్లడించారు. వేరే రాష్ట్రాల ఫోన్ నెంబర్లు, నకిలీ లాగిన్‌లు ఉపయోగించి ఓటర్ పేర్లు తొలగించారన్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ ఉపయోగించారని స్పష్టం చేశారు. ఒక ఎన్నిక తర్వాత ఒక ఎన్నికలో.. భారతదేశం అంతటా లక్షలాది మంది ఓటర్లను.. వివిధ వర్గాలను, ప్రధానంగా ప్రతిపక్షానికి ఓటు- వేస్తున్న వర్గాలను, తొలగింపు కోసం ఒక సమూహం క్రమపద్ధతిలో లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి మేము 100 శాతం రుజువును కనుగొన్నాము. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. రాజ్యాంగాన్ని ప్రేమిస్తున్నాను. ప్రజాస్వామ్య పక్రియను ప్రేమిస్తున్నాను. నేను ఆ పక్రియను రక్షిస్తున్నాను. మీరు నిర్ణయించగల 100 శాతం రుజువు ఆధారంగా కాకుండా నేను ఇక్కడ ఏమీ చెప్పబోవడం లేదు. తీర్పు మీదేనని రాహుల్ గాంధీ అన్నారు.ర్ణాటకలోని అలంద్ నియోజకవర్గంలో ఎవరో 6,018 ఓట్లను తొలగించడానికి ప్రయత్నించారని.. చివరికి ఎవరో పట్టుబడ్డారన్నారు. ఇది చాలా నేరాల మాదిరిగానే యాదృచ్ఛికంగా పట్టుబడినట్లు- తెలిపారు. ఈ తొలగింపు ప్రయత్నాలు కేవలం కాంగ్రెస్ పార్టీ గెలిచే బూత్‌ల్లోనే జరిగిందని వివరించారు. గోదాబాయి పేరుతో ఎవరో నకిలీ లాగిన్ సృష్టించి 12 మంది ఓటర్ల పేర్లు తొలగించారన్నారు. కానీ ఈ విషయం గోదాబాయికి తెలియదని చెప్పారు. వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ఫోన్ నెంబర్ల ద్వారా ఈ తతాంగం అంతా చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. వారంలోపు ఈసీ డేటా విడుదల చేయాలని.. లేకపోతే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నవారిని రక్షిస్తున్నారని భావించాల్సి ఉంటుందని తెలిపారు. కర్ణాటకలోని అలంద్‌లో ఆరువేల ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. అలాగే ఓట్ల చోరీకి పాల్పడేవారిని ఎన్నికల సంఘం చీఫ్ రక్షిస్తున్నారని, ఈ వ్యవహారంపై విచారణ జరపాలంటూ చేస్తున్న అభ్యర్థనలను విస్మరిస్తున్నారని అన్నారు. ఇది హైడ్రోజన్ బాంబ్ కాదని, దానిని త్వరలో పేలుస్తానని వెల్లడించారు. ఈ విమర్శలను ఎన్నికల సంఘం, భారతీయజనతా పార్టీ ఖండించింది. బాంబ్ తుస్సు అందని భాజపా ఎద్దేవా చేసింది.

## ఆరోపణలపై విచారణ జరపకుండానే ఖండించి ఈసీ
### సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు అసాధ్యమని వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రత్యేక సాఫ్ట్‌వేర్ వాడి ఓట్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన విమర్శలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. అదంతా నిరాధార, అసత్య ప్రచారమని వెల్లడించింది. ఆన్‌లైన్ వేదికగా ఓట్లను తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్కరి ఓటు తొలగించడం లేదు.. ఆన్‌లైన్‌లో మరెవరూ తొలగించలేరని కూడా వివరించింది. 2023లో అలంద్ అసెంబ్లీ నియోజవర్గంలో ఓటర్ల తొలగింపునకు విఫల ప్రయత్నాలు జరిగాయి. ఆ వ్యవహారంపై దర్యాప్తు కోసం ఎన్నికల సంఘమే ఫిర్యాదు చేసింది. రికార్డుల ప్రకారం.. అలంద్ అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో భాజపా అభ్యర్థి విజయం సాధించారు. 2023లో కాంగ్రెస్ నేత బీఆర్ పాటిల్ గెలుపొందారని ఈసీ వెల్లడించింది. ఇలా తొలగంపు అన్నది జరగదని కూడా ఇసి స్పష్టం చేసింది. ఇదిలావుంటే ఓట్ల తొలగింపు అంటూ రాహుల్ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని భాజపా దుయ్యబట్టింది. రాహుల్‌కు రాజ్యాంగం, చట్టం అర్థం కావడం లేదు. 2014 నుంచి మోదీజీ సాధిస్తున్న విజయాలన్నీ నిజం కాదని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు దేశ ప్రజలకు, ఓటర్లకు అవమానం. ఆయన బాంబు గురించి మాట్లాడుతున్నారు. ఈ ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నాను అని మాజీ కేంద్రమంత్రి రవిశంకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. ఆ బాంబ్ ఇలాగే ఉంటుందా..? వాళ్లు ఓటమిని చవిచూస్తున్నారు. ఈ సమయంలో వారు చేయాల్సింది దానిని అంగీకరించడం. కష్టపడి మా స్థాయికి వస్తామనేలా వారి మాటలు ఉండాలి. అంతేకానీ దానికి బదులుగా వారు కోర్టుల జోక్యాన్ని కోరుకుంటున్నారు. లేకపోతే వేరొకరిపై నిందలు వేస్తున్నారని ఢిల్లీ మంత్రి మజీందర్ సింగ్ సిర్సా మండిపడ్డారు. బంగ్లాదేశ్, నేపాల్ తరహా అశాంతి భారత్‌లో సృష్టించాని రాహుల్ భావిస్తున్నారని కమలం పార్టీ నేత అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దాదాపు 90 ఎన్నికల్లో ఓటమి చవిచూసిందని, దాంతో ఆయన అసహనం రోజురోజుకూ పెరుగుతోందని ఎద్దేవా చేశారు. క్షమాపణలు కోరడం, కోర్టు మందలింపులు ఆయనకు పరిపాటిగా మారిపోయాయని అన్నారు.

## డిజైన్ సామాజిక మార్పునకు ఆయుధం కావాలి

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ప్రతినిధులను కోరారు. డిజైన్ అనేది కేవలం అందానికి కాదు అది సామాజిక మార్పునకు ఆయుధం కావాలి అని ఉద్బోధ చేశారు. తెలంగాణ ప్రభుత్వం సమానత్వం, అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని తెలిపారు. హైదరాబాదును ప్రపంచ డిజైన్ క్యాపిటల్ గా మార్చడానికి కలిసి పని చేద్దామని ప్రతినిధులకు డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. ఈ అంతర్జాతీయ సదస్సు హైదరాబాద్ చరిత్రలో ఒక మలుపు రాయి అన్నారు. తెలంగాణ రాష్ట్ర డిజిటల్ భవిష్యత్తును పరిపుష్టం చేయడంలో, మరో అడుగు ముందుకు వేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు. ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్లు మన జీవితాల్లో అనివార్యమైనవి, కానీ ఒక యాప్ యూజర్ ఫ్రెండ్లీగా ఉంటేనే అది విజయవంతం అవుతుంది అన్నారు. తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ ఇంక్లూజన్ను ప్రోత్సహిస్తుంది, పాలసీల ద్వారా స్టార్టప్ లకు చేయూతనిస్తుంది అని తెలిపారు. భారతదేశంలో యూపీఐ వంటి యాప్ లు సరళంగా రూపొందించడంతో పెద్ద విజయం సాధించాయి అన్నారు. ప్రాంతీయ భాషల్లోనూ యాప్ లు రూపొందించడం మూలంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కూడా సులభంగా ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది అన్నారు.

**త్వరలో 'సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఇన్ డిజైన్: మంత్రి శ్రీధర్ బాబు**

హైదరాబాద్ ను గ్లోబల్ డిజైన్ హబ్ గా మార్చాలనే సంకల్పంతో త్వరలోనే "సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఇన్ డిజైన్"ను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. టీ హబ్, టీ వర్క్స్, వీ హబ్ లాంటి సంస్థల ద్వారా తెలంగాణ ను ఇన్నోవేషన్ హబ్ గా మార్చేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయబోతున్న "ఏఐ ఇన్నోవేషన్ హబ్ "లో డిజైనింగ్ కు పెద్దపీట వేస్తున్నామన్నారు. డిజైనింగ్ అంటేనే సృజనాత్మకత అని, కాకపోతే... ఆది యూజర్ ఫ్రెండ్లీ గా ఉండాలన్నారు. అప్పుడే ఆ యాప్ లేదా వెబ్ సైట్ మనుగడ సాధ్యమన్నారు. ఈ ప్రక్రియలో ఏఐ లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ వల్ల ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా చూడాలని సూచించారు. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే అంకుర సంస్థలకు తమ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు.

## గగన్‌యాన్‌లో 'వ్యోమమిత్ర'

ఉష్ణోగ్రత, పీడనం, తేమ, కార్బన్ డయాక్సైడ్ స్థాయిలు వంటి అనేక అంశాలను పర్యవేక్షించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. భద్రతలో భాగంగా తప్పించుకునే వ్యవస్థను కూడా రూపొందించినట్లు చెప్పారు. అంతేకాకుండా తొమ్మిది పారాచూట్లు స్పేస్? క్రాఫ్ట్? స ముద్రంలో సురక్షితంగా దిగడానికి సహాయపడుతుందని తెలిపారు. ఇస్రోతో పాటు భారత వైమానిక దళం, నౌకాదళం, డీఆర్?డీఓ, అనేక ఇతర సంస్థల ఈ ప్రాజెక్టులో పాల్గొన్నాయని నారాయణన్ చెప్పారు. ఇక వ్యోమమిత్ర అనేది అచ్చం మనిషిలాగే పెదవులు కదిలిస్తూ మాట్లాడుతుంది. ప్రస్తుతానికి హిందీ, ఇంగ్లిష్‌లో మాట్లాడేలా వ్యోమమిత్రను ప్రోగ్రామ్ చేశారు. ఇది మనుషులనూ గుర్తిస్తుంది. అంతరిక్షంలో వ్యోమగాములు చేసే పనులన్నింటినీ చేస్తుంది. కబుర్లు చెబుతుంది. అడిగే ప్రశ్నలకు సమాధానాలిస్తుంది. సిరి, అలెక్సా, కోర్టానా వంటి కృత్రిమ మేధ పరిజ్ఞానాలనూ ఈ రోబోను విస్తరించారు. అంతరిక్షంలోకి వెళ్లిన తర్వాత క్రూ మాడ్యూల్‌లో వ్యోమగాముల భద్రత, మనుగడకు ఉద్దేశించిన వ్యవస్థలను పరీక్షిస్తుంది. క్యాబిన్‌లో వాతావరణం మారితే వాటిని గుర్తించి హెచ్చరిస్తుంది. నేల మీది నుంచి శాస్త్రవేత్తలు అందించే సూచనలను గ్రహిస్తుంది. ఆ సూచనలను మేరకు నడచుకోగలదు. లోపల కార్బన్ డయాక్సైడ్ పెట్టెలను మార్చేలా అన్ని పనులు చేయగలదు. టెక్నికల్ పనులు చేయటమే కాకుండా వ్యోమగాములకు విసుగు పుట్టకుండా మానసికంగా దన్నుగానూ నిలవనుంది. కృత్రిమ స్నేహితుడిలా తోడుగా ఉంటుంది. ప్రయోగిస్తున్నప్పుడు, కిందికి దిగుతున్నప్పుడు, కక్ష్యలో ఉన్నప్పుడు వ్యోమనౌక స్థితి ఎలా ఉందో చెబుతుంది. క్రూ మాడ్యూల్ అంతరిక్షం నుంచి తిరిగి వస్తున్నప్పుడు లోపల జరిగిన మార్పులను నివేదిస్తుంది.వ్యోమగాములను దాదాపు 400కిలోమీటర్ల ఎత్తైన కక్ష్యలోకి పంపి, తిరిగి వారిని సురక్షితంగా భూమిపైకి తీసుకురావడమే గగయాన్ మిషన్ లక్ష్యం. ఈ ప్రయోగం మూడు రోజులు పాటు జరగనుంది. భారత అంతరిక్ష కార్యక్రమాల్లో ఇది కీలకం కానుంది. ఇప్పటికే ఈ మిషన్ కోసం చేపడుతున్న అని పరీక్షలు విజయవంతం అవుతున్నాయి. గగన్‌యాన్ యాత్రను ఇస్రో 2027 మొదటి త్రైమాసికంలో చేపట్టనుంది.

## తరతరాలు నిలిచేలా మేడారం అభివృద్ధి పనులు

ఆలయ అభివృద్ధికి సంబంధించి డిజైన్లు దాదాపు ఖరారు చేశారు. సీఎం ఆమోదం తర్వాత పనులు ప్రారంభం కానున్నాయి. సీఎం ఆమోదం తర్వాత ఆలయ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారని శంకుస్థచేస్తారని మంత్రులు ప్రకటించారు. ప్రస్తుతం మేడారం ఆలయ ప్రాంగణంలో ఒకేసారి సుమారు 7,000 మంది భక్తులు తల్లులను దర్శించుకునే సౌకర్యం ఉంది. అయితే విస్తరణ పనులు పూర్తయ్యాక, ఆ సామర్థ్యం 10,000 మందికి పైగా పెరగనుంది. ప్రాంగణం వెడల్పు, పొడవు పెరిగి మరింత విశాలంగా మారుతుంది. దీనివల్ల పెద్ద ఎత్తున వచ్చే భక్తులు సులభంగా, వేగంగా, క్రమపద్ధతిలో దర్శనం చేసుకునే అవకాశం లభిస్తుంది.సమ్మక్క, సారలమ్మలతో పాటు అదే వరుస క్రమంలో పగిడిద రాజు, గోవిందరాజు గద్దెలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మార్పుతో భక్తులు ఇబ్బంది లేకుండా, సమయం వృథా కాకుండా భక్తులు ఒకే దారిలో, సాఫీగా తల్లులను దర్శించుకునే వీలు ఉంటుంది. మేడారం ఆలయ పరిసరాల్లోకి ప్రవేశించగానే ఆదివాసి ఆధ్యాత్మిక భావన కలిగేలా సాంప్రదాయ ఆర్చులు నిర్మిస్తారు. ఆలయ ప్రాంగణం చుట్టూ రాతి పిల్లర్లు, వాటిపై ఆదివాసీ కళాత్మక ఆకృతులతో, ఆదివాసీ సంస్కృతికి అద్దం పట్టేలా తీర్చిదిద్దనున్నారు. తరతరాలు గుర్తుంచుకునేలా ఈ రాతి కట్టడాలు శాశ్వత చిహ్నాలుగా నిలిచిపోతాయి.అలాగే భక్తుల భద్రత దృష్ట్యా, మేడారం ప్రాంగణం చుట్టూ నాలుగు వాచ్ టవర్లు నిర్మించాలని భావిస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే జాతర కాలంలో ఈ వాచ్ టవర్లు విజిలెన్స్, సెక్యూరిటీ, కంట్రోల్‌లో కీలకపాత్ర పోషించనున్నాయి. మేడారం గుడి అభివృద్ధి పనులకు సంబంధించి సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి, త్వరలో సీఎం ఆమోదంతో పనులు ప్రారంభమవుతాయని మంత్రులు తెలిపారు.మేడారం అభివృద్ధి కేవలం సదుపాయాలు పెంపునకే పరిమితం కాకుండా, ఆదివాసీ సంస్కృతిని, విశ్వాసాన్ని, వారసత్వాన్ని మరింత బలంగా ప్రతిబింబించేలా రూపకల్పన జరుగుతోందని మంత్రులు స్పష్టం చేశారు.ప్రతిపాది త అభివృద్ధి పనుల పట్ల సమ్మక్క సారలమ్మ పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు, ఇతర పూజారులు సంతృప్తి వ్యక్తం చేశారు. డిసెంబర్ లోపు పనులను పూర్తి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## గిన్నిస్ బుక్‌లో చోటు దక్కేలా
# బతుకమ్మ సంబరాలు


గురువారం గాంధీభవన్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడారు. బతుకమ్మ పండుగ బాధల నుంచి పుట్టిందని చరిత్రలో ఉందని వివరించారు. కొత్తగా కవులను, రచయితలను పిలిచి వారితో చర్చించి బతుకమ్మ పాటలు పాడేలా ప్లాన్ చేస్తామని పేర్కొన్నారు. బతుకమ్మ జరిగే ప్రాంతంలో ఘనంగా ఏర్పాట్లు- చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో కూడా మన సంసృతి తెలిసేలా ఏర్పాట్లు- చేస్తున్నామని చెప్పుకొచ్చారు. బతుకమ్మ పండుగలో ప్రజలు అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. బతుకమ్మ పండుగ చేసుకున్న తర్వాత చెరువులో వదలాలని...అందుకు తగిన ఏర్పాట్లు- చేస్తున్నామని వివరించారు. బతుకమ్మ పండుగపై అవగాహన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. బతుకమ్మ పండుగ ముఖ్య ఉద్దేశం అందరూ కలిసి ఆత్మీయంగా చేసుకోవాలని. ఇది వ్యక్తుల కార్యక్రమం కాదు అందరి పండుగ అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కొందరు బతుకమ్మ పండుగను రాజకీయం చేశారని టీ-పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. వివిధ రకాల పాటలతో బతుకమ్మను రాజకీయం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. తెలంగాణ సంప్రదాయం బతుకమ్మ పండుగ అని ఉద్ఘాటించారు. చివరి సద్దుల బతుకమ్మ వరకు ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకొని కాంగ్రెస్ శ్రేణులు ముందుకు వెళ్లాలని బతుకమ్మ పండుగపై కొన్ని అపోహలు ఉన్నాయని బతుకమ్మ పండుగ తెలంగాణ పండుగ.. తెలంగాణ సంప్రదాయమని చెప్పుకొచ్చారు. బతుకమ్మ పండుగలో ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో బతుకమ్మ కుంట బతుకమ్మ కోసం మళ్లీ వచ్చిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## నేపాల్ శాంతిస్థాపనకు మద్దతిస్తాం
### నేపాల్ ప్రధాని సుశీలా కార్కీకు మోడీ ఫోన్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**నేపాల్‌లో శాంతి స్థాపనకు తమ సంపూర్ణమద్దతు ఉంటుందని ప్రధాని మోడీ ప్రకటించారు. ఈ మేరకు ప్రధాని సుశీల కార్కీకు సందేశం పంపారు. సోషల్ మీడియాపై నిషేధం, అవినీతి వ్యతిరేక నిరసనలతో కొన్ని రోజుల క్రితం అట్టు-డికిన నేపాల్ లో పరిస్థితులు కుదుటపడ్డాయి. ఈ క్రమంలో ఆ దేశంలో శాంతి స్థాపనకు భారత్ అండగా ఉంటుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.తాత్కాలిక ప్రభుత్వ ప్రధానిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీలా కార్కీ తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన విషయాలను మోదీ ఎక్స్‌లో పంచుకున్నారు. సుశీలా కార్కీతో అద్భుతమైన సంభాషణ జరిగిందని పేర్కొన్నారు. నిరసనల్లో ప్రాణాలు కోల్పోయినవారికి సంతాపం వ్యక్తం చేసినట్లు తెలిపారు. శాంతి, స్థిరత్వం పునరుద్ధరణకు ఆమె చేసే ప్రయత్నాలకు భారత మద్దతును పునరుద్ఘాటించినట్లు- మోదీ వెల్లడించారు.

## హైదరాబాద్‌లో మరోసారి కుంభవృష్టి

అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడుతాయని.. అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది. శుక్ర, శనివారాల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలుపడుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది.దక్షిణ ఇంటీరియర్ కర్నాటక నుంచి తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు సగటున సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించిందని ఉందని తెలిపింది. మధ్యప్రదేశ్ మధ్య ప్రాంతాల నుంచి పశ్చిమ-మధ్య ఆనుకొని ఉన్న నైరుతి బంగాళాఖాతం వరకు తూర్పు విదర్భ, తెలంగాణ, దక్షిణ తెలంగాణ, దక్షిణ కోస్తాంధ్ర మీదుగా సగటు- సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి కొనసాగుతుందని వాతావరణశాఖ వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు దంచికొట్టాయి. మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, సంగారెడ్డి, సిద్దిపేట,



హైదరాబాద్, పలు పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ముషిరాబాద్ పరిధిలోని భోలక్‌పూర్‌లో 15.5 సెంటీ-మీటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

**హైదరాబాద్‌లో నగరంలో భారీ వర్షం**

నగరంలో మరోసారి భారీ వర్షం అతలాకుతలం చేసింది. బుధవారం రాత్రికురిసిన వర్షం నుంచి తేరుకోక ముందే గురువారం సాయంత్రం ఉన్నట్టుండి ఒక్కసారిగా వర్షం దంచికొట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యార్థులు, ఉద్యోగులు ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట్, పంజాగుట్ట, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఐటీ- కారిడార్‌తో పాటు- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మరికొన్ని గంటలపాటు- వర్షం కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షపు నీరు ఇళ్లలోకి వచ్చేందుకు అవకాశముండడంతో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, ఫిల్మ్‌నగర్, ఎర్రగడ్డ, యూసఫ్‌గూడ, అమీర్‌పేట, బోరబండ, చార్మినార్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో మూడు రోజుల పాటు- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, సూర్యాపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు- తెలిపింది.

# బతుకమ్మ, దసరాకు టీజీఎస్ఆర్టీసీ 7754 ప్రత్యేక బస్సులు

- ఈ నెల 20 నుంచి అక్టోబర్ 2 వరకు స్పెషల్ సర్వీసులు
- ప్రజలను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేలా ఏర్పాట్లు



హైదరాబాద్ (జనంసాక్షి) : బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రజలకు రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ పండుగలకు రాష్ట్రవ్యాప్తంగా 7754 స్పెషల్ బస్సులను బస్సులను నడపడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. అందులో 377 స్పెషల్ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించింది. ఈ నెల 20 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక బస్సులను నడపనుంది. సద్దుల బతుకమ్మ ఈ నెల 30న, దసరా అక్టోబర్ 2న ఉన్నందున.. ఈ నెల 27 నుంచే సొంతూళ్లకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశ ముండటంతో ఆ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనుంది. అలాగే, తిరుగు ప్రయాణానికి సంబంధించి అక్టోబర్ 5, 6వ తేదిల్లోనూ రద్దీకి అనుగుణంగా బస్సులను సంస్థ ఏర్పాటు చేయనుంది.

హైదరాబాద్ లో ప్రధాన బస్టాండ్లైన ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్ తో పాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కేపీహెచ్ బీ కాలనీ, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఉప్పల్ బస్టాండ్, దిల్ సుఖ్ నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడిపించనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూల లతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు ఈ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. దసరా స్పెషల్ బస్సుల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 16 ప్రకారం తిరుగు ప్రయాణంలో ఖాళీగా వచ్చే బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరలను సంస్థ సవరించనుంది. ఈ నెల 20తో పాటు 27 నుంచి 30 తేదివరకు వరకు, అలాగే అక్టోబర్ 1, 5, 6 వ తేదిల్లో నడిచే స్పెషల్ బస్సుల్లోనే సవరణ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఆయా రోజుల్లో తిరిగే రెగ్యూలర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. అవి యధావిధిగా ఉంటాయి.

"బతుకమ్మ, దసరా పండుగల దృష్ట్యా ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి సంస్థ సంసిద్ధంగా ఉంది. గత దసరా కంటే ఈ సారి అదనంగా 617 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం. రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంప్ లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. ముఖ్యంగా ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, కేపీహెచ్బీ, సంతోష్ నగర్, తదితర ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం షామియానాలు, కూర్చీలు, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. ప్రతి రద్దీ ప్రాంతం వద్ద పర్యవేక్షణ అధికారులను నియమిస్తున్నాం. ప్రయాణికుల రద్దీని బట్టి వారు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచుతారు. పోలీస్, రవాణా, మున్సిపల్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా సంస్థ అన్ని చర్యలు తీసుకుంటోంది." అని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అన్నారు. పండుగలకు రద్దీ ఎక్కువగా ఉందని వైట్ నంబర్ ప్లేట్ గల ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి.. ఇబ్బందులు పడొద్దని ఆయన సూచించారు. టీజీఎస్ఆర్టీసీలో ఎంతో అనుభవం గల డ్రైవర్లు ఉన్నారని, వారు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తారని చెప్పారు. బతుకమ్మ, దసరా ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్ ను సంస్థ అధికారిక వెబ్ సైట్ **tgsrtcbus.in** లో చేసుకోవాలని కోరారు. దసరా స్పెషల్ సర్వీసులకు సంబంధించి పూర్తి సమాచారం కోసం టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు.



# పిల్లలకు సురక్షిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతాం

**యూనిసెఫ్ తో కలిసి కార్యాచరణ ప్రకటించిన మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) : పిల్లలకు హైదరాబాద్ ను సురక్షిత నగరంగా మార్చుతామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క, రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. క్లాప్ ఫర్ చిల్డ్రన్ పోస్టర్ను సచివాలయంలో గురువారం నాడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, హైదరాబాద్‌ను 'పిల్లలకి సురక్షిత నగరం"గా తీర్చి దిద్దడానికి కృషి చేస్తుందని.. ఇతర నగరాలు, రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా హైదరాబాద్ ను తీర్చిదిద్దామన్నారు. ఈ ప్రయత్నంలో యూనిసెఫ్ సంస్థకు పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. ఈ ప్రణాళిక ద్వారా ప్రభుత్వ విభాగాలు, చట్టపరమైన సంస్థలు, సమాజం కలిసి పిల్లలు సురక్షితంగా, ఆరోగ్యంగా ఎదగడానికి కృషి చేయనున్నారు. చట్టపరమైన సంస్థలు, ఫ్రంట్‌లైన్ సేవలను బలోపేతం చేసి, మహిళా, శిశు సంక్షేమ, పోలీసు, ఆరోగ్యం, విద్య, కార్మిక, జీహెచ్ఎంసీ వంటి విభాగాల సమన్వయంతో బుల్లీయింగ్, ఈవ్-టీజింగ్, అసురక్షిత రవాణా, మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించడానికి చర్యలు చేపడతారు. బాలల రక్షణ సెల్‌లు, విజిలెన్స్ కమిటీల ద్వారా డేటా ఆధారిత మానిటరింగ్ జరుగుతుంది. అలాగే ఫ్రంట్‌లైన్ వర్కర్లకు, పిల్లలకు అనుకూలమైన, శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, యూనిసెఫ్ చీఫ్ ఆఫ్ ఫీల్డ్ ఆఫీస్ డా. జెలాలెం బిర్హాను టాఫెస్సే తదితరులు పాల్గొన్నారు.

# కంటికి రెప్పలా కాపాడుకుంటాం

- మీ ధైర్యం, త్యాగం భారత్ హృదయాలలో ఎప్పటికీ సజీవం
- హర్యానాలో ఐటీబీపీ జవాన్లను ఉద్దేశించి కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



ఛండీఘర్ (జనంసాక్షి) : మంచు పాతాల ముప్పు, ఎముకలు కొరికే చలి, కనీస సౌకర్యాలు లేని చోట ఇతరులు వెళ్లడానికి కూడా భయపడే ప్రాంతాల్లో నిత్యం దేశ సేవ చేస్తున్న ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) జవాన్ల ధైర్య సాహసాలు మరువలేమని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. దేశం కోసం ఐటీబీపీ జవానుల ధైర్యం, చేస్తున్న త్యాగాలు భారతీయుల హృదయాలలో ఎప్పటికీ సజీవంగా నిలిచిపోతాయని చెప్పారు. దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుకునే జవాన్లకు గౌరవ మర్యాదలతోపాటు సౌకర్యాలతో జీవించేలా చేసేందుకు కేంద్రం క్రుషి చేస్తుందని పేర్కొన్నారు. ఈరోజు హర్యానా విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ భానులోని ఐటీబీపీ బేసిక్ ట్రైనింగ్ సెంటర్ లో 9 నివాస భవన సముదాయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి ప్రసంగించారు. "ఈ రోజు భారతదేశ భద్రతా వ్యవస్థకు ఆత్మగా నిలిచిన ఐటీబీపీ హిమవీరుల మధ్య, (హర్యానా)లోని భాను బేసిక్ ట్రైనింగ్ సెంటర్ వద్ద నిలబడి మాట్లాడడం నాకు గొప్ప గర్వంగా, గౌరవంగా ఉంది. ఈ కేంద్రం ఐటీబీపీకి ముఖ్యమైన శిక్షణా కేంద్రం. ముందుగా ఈ మహా దళానికి చెందిన అమర వీరులకు నేను తల వంచి నివాళులర్పిస్తున్నాను. ఎందుకంటే వీరంతా తమ జీవితాన్ని రేపటి దేశ ప్రజల భవిష్యత్తుకోసం అర్పిస్తున్నారు. మీ పేర్లు ప్రతి పౌరునికి తెలియకపోయినా మీ త్యాగం భారత హృదయంలో శాశ్వతంగా నిలిచిపోతుంది."అని పేర్కొన్నారు.

# హైదరాబాద్ బ్రాండ్‌ను కాపాడుకోవాలి

- దిశ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




హైదరాబాద్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) : నగరంలో నిధుల కొరత ఉన్నప్పటికీ.. లభ్యమవుతున్న నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ, కేంద్ర సహాయ పథకాలు, ప్రాజెక్టుల అమలు స్థితిపై గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ అంటే కేవలం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ- మాత్రమే కాదు.. నిజమైన హైదరాబాద్ బస్తీల్లో ఉంది. నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా రహదారులు జలమయమై ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీ-వల వర్షాల కారణంగా నాంపల్లిలో ఇద్దరు, సంతోష్‌నగర్‌లో ఒకరు నాలాలో కొట్టు-కుపోవడం దురదృష్టకరం. ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు- అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేసి.. నగర ప్రాధాన్యతను గుర్తుంచుకొని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకోవాలని సూచించారు. ఏ బస్తీకి వెళ్లినా వర్షపు నీరు, వరదలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ సిస్టం దెబ్బతిని.. తాగునీటిలో కలిసిపోతోంది. అన్నీ రిస్టోర్ చేసి శుభ్రం చేయాలి. స్కూల్స్, కమ్యూనిటీ- హాళ్లు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించుకోవాలని కిషన్‌రెడ్డి అన్నారు. దిశ సమావేశంలో ఎంపి ఈటెల రాజేందర్ సహా పలువురు నేతలు, కలెక్టర్ హరిచందన తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ప్రమాదంలో ఇద్దరు కార్మికులు అస్వస్థత

**జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్18 (జనంసాక్షి) :** సింగరేణి భూగర్భ గనిలో ప్రమాదం చోటుచేసుకుంది. కేటీకే 5 ఇంక్లైన్ రెండో లెవెల్ వద్ద వెల్డింగ్ చేస్తున్న క్రమంలో నిప్పు అంటుకుని విషవాయువులు వెలువడ్డాయి. ఈ ప్రమాదంలో అన్వేశ్, ప్రదీప్ అనే ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన తోటి కార్మికులు బాధితులను చికిత్స నిమిత్తం సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మొదటి షిఫ్ట్ ముగిసే సమయానికి ఈ దుర్ఘటన జరిగినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న రెస్క్యూ, ఫైర్, సేఫ్టీ సిబ్బంది ముమ్మర సహాయక చర్యలు చేపట్టారు. గని లోపల పంప్ ఆపరేటర్ చిక్కుకున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను ప్రారంభించిన ఉప్పల




హైదరాబాద్ (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విక్రమ్ బ్యాడ్మింటన్ అకాడమీ ఉప్పల్ బాగాయత్‌లో యోనెక్స్ - సైన్‌రైస్ 4వ తెలంగాణ రాష్ట్ర మినీ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025ను మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాడ్మింటన్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి శ్రీధర్ బాబు క్రీడాకారులను అన్ని విధాలా అండగా ఉంటున్నారని, పుల్లెల గోపీచంద్ ఎంతో మంది క్రీడాకారులను తయారుచేస్తున్నారు అని ఆయన అన్నారు. ఇలాంటి టోర్నమెంట్ లు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ రోజు నుండి 21 వ తేది వరకు ఈ టోర్నమెంట్ జగుగుతుంది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాట్ అబ్జర్వర్ టి.రంగా రావు, బ్యాట్ జాయింట్ సెక్రెటరీ యూవీఎన్ బాబు, ఆర్ ఆర్ డీబీఏ వైస్ ప్రెసిడెంట్ పి.ఆనంద్‌బాబు విక్రాంత్ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మెన్ కె.విక్రాంత్ కుమార్, ఆర్ ఆర్ డీబీఏ జాయింట్ సెక్రెటరీ బి. సాయిరెడ్డి, బ్యాట్ మెంబర్ ఏఎన్ సూరి, ఆనంద్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# యూరియా వైఫల్యం కేంద్రానిది

- ప్రభుత్వంపై బురదజల్లుతున్న బిఆర్ఎస్
- మండిపడ్డట్ట మంత్రి సీతక్క

**ఖమ్మం, సెప్టెంబర్18 (జనంసాక్షి) :** ప్రజల సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా, వైరా మున్సిపాలిటీలో పర్యటించిన మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ విమర్శలు చేసి బదనాం చేస్తోందని ఆరోపించారు. యూరియా సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని, రైతులను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ నిందలు వేస్తోందని ఆమె అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులమయం చేసిందని విమర్శించిన మంత్రి సీతక్క, తాము భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను, మహిళలకు వివిధ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరిన ఆమె, స్థానిక ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు.

# మొక్కలు నాటి ప్రాంతాలకు జియో ట్యాగింగ్

- 18.03 కోట్ల మొక్కలు టార్గెట్.. 13.84 కోట్ల మొక్కలు ప్లాంటేషన్ పూర్తి
- జిల్లాల వారీగా టార్గెట్లపై ప్రిన్స్ పల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ రివ్యూ
- సామాజిక ఉద్యమంగా సాగుతున్న వనమహెూత్సవం



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు 2025-సంవత్సర వన మహెూత్సవం కార్యక్రమాన్ని సామాజిక ఉద్యమంగా సాగుతుంది. జిల్లాలు, డిపార్టుమెంటుల వారీగా మొక్కలు నాటడంపై గురువారం తెలంగాణ సచివాలయం, ఫారెస్టు మినిస్టర్ ఛాంబర్‌లో ఉన్నతాధికారులు రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని అటవీ, పర్యావరణ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ నిర్వహించగా, అన్ని విభాగ అధికారులు పాల్గొన్నారు. ఇప్పటివరకు మొక్కలు నాటిన ప్రాంతాలకు జియో టాగింగు పూర్తనట్టు గుర్తించారు. ఈ సంవత్సరం 18.03 కోట్ల మొక్కలు టార్గెట్ పెట్టుకోగా... 13.84 కోట్ల మొక్కలు ప్లాంటేషన్ పూర్తి చేసినట్టు వివరించారు. 77 శాతం టార్గెట్ పూర్తి చేసినట్టు స్పష్టం చేశారు. అయితే, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని మరింత విస్తరింప చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది మొక్కలు పెంచే కార్యక్రమాన్ని వన మహెూత్సవం పేరిట చేపడుతున్న విషయం తెలిసిందే. అటవీ అధికారులు సిద్ధం చేసిన పీపీటీని ప్రిన్స్ పల్ సెక్రటరీ, పీసీసీఎఫ్ వీక్షించారు. సమగ్రంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని డిపార్టుమెంట్లలో ఈ మొక్కలు నాటుతున్నప్పుడు ఎదరవుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టి వచ్చింది. అయితే, గత ఏడాది అనుభవాల ఆధారంగా మరింత పక్కాగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు వన మహెూత్సవం కింద పకడ్బందీ కార్యచరణ రూపొందించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో.... అన్ని మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు సన్నద్ధం అవ్వాలని ఆదేశించారు. ఈ సారి 100 శాతం మనం పెట్టుకున్న టార్గెట్ రీచ్ కావాలని మంత్రి సురేఖ ఆదేశించిన విషయాన్ని అధికారులు గుర్తు చేశారు.

# అసెంబ్లీ ఎన్నికలు కాదు..జూబ్లీహిల్స్ గురించిమాట్లాడు

- పార్లమెంటులో ఎన్ని సీట్లు వచ్చాయో లోకల్ బాడీలోనూ అంతే
- కెటిఆర్ విమర్శలపై భగ్గుమన్న మంత్రి పొంగులేటి

**ఖమ్మం, సెప్టెంబర్18 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇష్టం వచ్చినట్టుగా కాంగ్రెస్ పార్టీపై మాట్లాడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. ఎప్పటికో మూడున్నర సంవత్సరాల తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల గురించి కాకుండా.. త్వరలో వచ్చే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల గురించి కేటీఆర్ ఆలోచించాలని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో బచ్చాగాడిని పెట్టి గెలిపిస్తా అంటూ కేటీఆర్‌కి పొంగలేటి సవాల్ విసిరారు. మూడున్నర సంవత్సరాల తర్వాత నువ్వు ఇండియాలో ఉంటావా? లేదా ఫారిన్‌లో ఉంటావా? అంటూ విమర్శలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో విరీకు ఎన్ని సీట్లు- వచ్చాయో.. స్థానిక ఎన్నికల్లో కూడా అంతే సీట్లు- వస్తాయని పొంగులేటి వ్యాఖ్యానించారు. ఖమ్మం రూరల్ సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గంలో పొంగులేటి మళ్లీ ఎలా గెలుస్తారో చూద్దాం అని అన్న కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించారు. 'సీఎం రేవంత్ రెడ్డి ఎంత కష్టపడుతున్నారో అందరికీ తెలుసు. అధికారంలో ఉన్నప్పుడు వాళ్లకు కనిపించనిది, వినిపించనిది.. ప్రతిపక్షంలో కనిపిస్తుంది అంటే విడ్డూరం, హాస్యాస్పదంగా ఉంది. విభజన సమయంలో రాష్ట్రాన్ని ఇచ్చిన ప్రధాన పార్టీ కాంగ్రెస్. నాడు మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల పాలు చేసింది. మా ప్రభుత్వం పేదోళ్లకు సంక్షేమ పథకాలు ఇస్తుంటే కొంతమంది విషం కక్కుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే విరీకు కడుపు మంట ఎందుకని పొంగులేటి అన్నారు. కమిషన్‌లు వచ్చే కాళేశ్వరం కట్టాలను కున్నారు కానీ.. పేదోడికి డబుల్ బెడ్ రూమ్, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఎందుకు అనుకోలేదు. పేదోడికి ఇల్లు కట్టించి ఉంటే విరీకు నేడు ఈ పరిస్థితి ఉండేది కాదు. పాముకు కోరల్లో మాత్రమే విషం ఉంటే.. విరీకు ఒళ్ళంతా విషం ఉంటుంది. రెండు పర్యాయాలు విరీకు బుద్ధి చెప్పారు, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా విరీకు బుద్ధి చెప్పాలని పొంగులేటి ఫైర్ అయ్యారు. విరీ కుటుంబ సమస్యను రాష్ట్ర సమస్యగా చిత్రీకరించే యత్నం చేస్తున్నారు. విరీ సోదరిమణి సమస్య, విరీ బిడ్డ సమస్య ను మా సీఎం రేవంత్ రెడ్డికి అంటగట్టే యత్నం చేస్తున్నారు. మొన్న ట్విట్టర్ టిల్లు ఏదో మాట్లాడుతున్నాడు. మూడున్నర సంవత్సరాల తర్వాత ఎన్నికల గురించి కాదు మాట్లాడేది.. ప్రస్తుతం ఏం జరుగుతుందో తెలుసుకో. విరీ పార్టీ శాసన సభ్యులు ఆరోగ్యం బాగాలేక చనిపోయారు, దానికి 15 రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తుంది. విరీకు ఉన్న పరిజ్ఞానం, గురించి నేను మాట్లాడను. కేటీఆర్.. ముందుగా జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలిచి చూడు. బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తా. మూడున్నర సంవత్సరాల తర్వాత నువ్వు ఇండియాలో ఉంటావా, ఫారిన్ వెళ్తావా చూడాలి. జూబ్లీహిల్స్ ఎన్నిక తర్వాత విరీ పార్టీ స్థానం ఏంటో చూడు నాయన ట్విట్టర్ టిల్లు. విరీ దయ దాక్షిణ్యాలతో ఎవరు బిఫామ్ తీసుకోలేదు. విరీ నాయన మూడు సార్లు వచ్చి ముక్కు నేలకు రాసినా ఏమి చేయలేకపోయాడు, నువ్వెంత బచ్చాగాడివి. కాంగ్రెస్ పార్టీ అంటే ఆషామాషీ పార్టీ కాదు, ఇచ్చిన మాట కోసం నిలబడి నెరవేర్చే పార్టీ. ఈ పార్టీలో ఏ ఒక్కరు తప్పు చేయరు. తల కిందులూ పెట్టిన పార్లమెంట్ ఎన్నికల్లో విరీకు ఎన్ని సీట్లు- వచ్చాయో.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అదే సీట్లు వస్తాయని పొంగులేటి అన్నారు.

# ప్రోటోకాల్ విస్మరించిన సిరిసిల్ల కలెక్టర్

- ఆది శ్రీనివాస్ ఫిర్యాదుతో వివరణ కోరిన ప్రభుత్వం

**హైదరాబాద్, సెప్టెంబర్18 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పై తెలంగాణ ప్రభుత్వం సీరియస్ అయింది. బుధవారం ప్రజా పరిపాలన దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ప్రోటోకాల్ పాటించకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. జెండా ఆవిష్కరణ సమయానికి హాజరు కాకపోవడంతోపాటు- కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలకడంలో కలెక్టర్ నిర్లక్ష్యం వహించారు. ఈ విషయంపై బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీఎంవోకు ఆది శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. దీంతో ఈ సంఘటనకు సంబంధించి రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని కలెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది. అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిబంధనలు పాటించకుండా వ్యవహారించిన తీరును సర్కార్ తప్పుబట్టింది. రోజురోజుకూ వివాదా స్పదంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మారుతున్నారని సర్కార్ సీరియస్ అయింది.ఓ భూ నిర్వాసితుడి విషయంలోనూ నిన్న కోర్టు ఆయనకు వారెంట్ జారీ చేసింది. ఈ క్రమంలో గురువారం జిల్లావ్యాప్తంగా ఆది శ్రీనివాస్‌కు మద్దతుగా నిరసన తెలిపారు బీసీ సంఘాల నేతలు. ఈ మేరకు కలెక్టర్ సంజయ్ ఝాకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల్లోపు వివరణ ఇవ్వాలని సీఎస్ ఆదేశించారు. కలెక్టర్ ఇచ్చే వివరణను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

# యూరోపియన్ దేశాల్లో వలసదారులపై దాడులు



## సామాజిక-ఆర్థిక సంక్షోభం

యూరోపియన్ దేశాల్లో వలసదారులపై దాడులు పెరుగుతున్నాయి! ప్రపంచవ్యాప్త సామాజిక, ఆర్థిక మార్పులు యూరోపియన్ దేశాల్లో ఆందోళనలను రెచ్చగొడుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న దాడులను పరిశీలిస్తే, అమెరికాలో భారతీయులు ఎక్కువగా స్థిరపడిన వాస్తవం బయటపడుతుంది. స్థానికుల మనోభావాలు, సంస్కృతి సంప్రదాయాలపై వలసదారుల ప్రభావం తీవ్రమవుతోంది. స్థానికులలో నిరుద్యోగ సమస్య పెరిగిపోవడంతో వలసదారులపై తిరుగుబాటు చేసి దాడులు, హత్యలు కూడా జరుగుతున్నాయి. అమెరికాలో భారతీయుల పరిస్థితి మిశ్రమంగా ఉంది. వారు ఆర్థికంగా, విద్యాపరంగా బలమైన స్థితిలో ఉన్నప్పటికీ, ఉద్యోగాల కొరత, అక్రమ వలసదారుల బహిష్కరణ, రాజకీయ ఉద్రిక్తతలు వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నారు. 5.2 మిలియన్లకు పైగా భారత సంతతి ప్రజలు నివసిస్తున్న అమెరికాలో, వారు అత్యధిక సగటు ఆదాయం కలిగి ఉన్నారు. కానీ స్టెమ్ వీసాలపై ఆధారపడి ఉద్యోగాల కోసం చాలా మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అమెరికాలో భారతీయ అమెరికన్లు అత్యధిక సగటు గృహ ఆదాయం, తలసరి ఆదాయం కలిగి ఉన్నారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్య అందించే అమెరికా, అంతర్జాతీయ ప్రతిభకు డిమాండ్ పెరగడంతో భారతీయులు ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడానికి అవకాశాలు కల్పిస్తోంది. 2010-2020 మధ్య భారతీయ అమెరికన్ జనాభా 55% పెరిగి, అతిపెద్ద ఆసియా జాతి సమూహంగా మారింది. మంచి విద్య అభ్యసించినా, అగ్రరాజ్యంలో ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారింది. దీంతో వీసా గడువు పొడిగించుకోవాల్సి వస్తుంది. అక్రమ వలసదారుల బహిష్కరణ సరైన పత్రాలు లేకుండా అక్రమంగా ఉంటున్న భారతీయులను స్వదేశాలకు పంపే నిర్ణయాలను అమెరికా కఠినంగా అమలు చేస్తోంది. రాజకీయ ఉద్రిక్తతలు ట్రంప్ పరిపాలనలో వాణిజ్య, ఇంధన వివాదాల కారణంగా భారత-అమెరికా సంబంధాలు సంక్లిష్టమయ్యాయి. మొత్తానికి అమెరికాలో భారతీయుల పరిస్థితి వారి నైపుణ్యం, విద్య, వలస స్థితిపై ఆధారపడి ఉంటుంది. అమెరికా అక్రమంగా ఉంటున్న 18వేల మంది భారతీయులను గుర్తించింది. అమెరికా పర్యటనలో ప్రధాని మోదీ వారిని తీసుకుంటామని స్పష్టం చేశారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడుతు న్నవారిని...

భారత అమెరికా సంబంధాలు స్వాతంత్ర్యానంతరం మొదలైన ఈ సంబంధా లు అనేక మార్పులు చూశాయి. నిక్సన్, ఇందిరా కాలంలో క్షీణత, బుష్, మన్మోహన్ కాలంలో స్నేహ పూర్వక దశ చూసాయి. ద్వైపాక్షిక విషయాల నుంచి అంతర్జాతీయ అంశాల చర్చకు ఎదిగాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఉత్తర అమెరికాలో అట్లాంటిక్ నుంచి పసిఫిక్ వరకు విస్తరించిన దేశం. ఉత్తరాన కెనడా, దక్షిణాన మెక్సికో, అలాస్కా వద్ద రష్యాతో సరిహద్దులు. 1954లో అమెరికా పాకిస్తాన్‌ను సెంటోలో చేర్చడంతో భారత్ సోవియట్‌తో సంబంధాలు పెంచుకుంది. 1961లో అలీనోద్యమ వ్యవస్థాపక సభ్యుడైంది. 1971 ఇండో-పాక్ యుద్ధంలో నిక్సన్ పాక్‌కు మద్దతివ్వడంతో సంబంధాలు క్షీణించాయి. 1991లో సోవియట్ రద్దుతో మార్పులు వచ్చాయి. 1990లలో అమెరికాతో సన్నిహిత సంబంధాలు పెంచుకుంది. ఇరవై ఒకటవ శతాబ్దంలో భారత్ స్వయంప్రతిపత్తి వినియోగించి జాతీయ ప్రయోజనాలు పెంపొందించుకుంది. బుష్, ఒబామా పరిపాలనలో అమెరికా భారత ప్రయోజనాలను గుర్తించింది. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడుల పెరుగుదల, ప్రపంచ భద్రతా సహకారం, గ్లోబల్ గవర్నెన్స్‌లో భారత్ చేరిక, అణు సరఫరా దారుల సమూహంలో ప్రవేశం, సాంకేతిక భాగస్వామ్యం మైలు రాళ్లు. 2016లో లాజిస్టిక్స్ ఎక్స్ఛేంజ్ మెమోరాండం సంతకం చేసి, భారత్‌ను ప్రధాన రక్షణ భాగస్వామిగా ప్రకటించారు. గాలప్ సర్వే ప్రకారం అమెరికన్లు భారత్‌ను ఇష్టమైన దేశాల్లో ఆరో స్థానంలో ఉంచారు. 2015లో 71%, 2017లో 74%, 2019లో 72% అనుకూలంగా ఉన్నారు. 2017లో ద్వైపాక్షిక వాణిజ్యం 9.8% పెరిగి 126.1 బిలియన్ డాలర్లకు చేరింది. అమెరికాకు భారత ఎగుమతులు 76.7 బిలియన్, అమెరికా ఎగుమతులు 49.4 బిలియన్.

యూరోపాలో ఆందోళనలకు ప్రపంచీకరణ పలితాలు ఉదాహరణ. ఎల్‌పీజీ సంస్కరణలు 1983-84ల నుంచి మన దేశంలో ప్రారంభమయ్యాయి.

2001 నాటికి సరళీకరణ ప్రభావం కనిపించింది. 2008 తర్వాత వర్ధమాన దేశాల నుంచి అభివృద్ధి దేశాలకు ఐటీ నిపుణుల వలసలు పెరిగాయి. 1980లలో ఇంగ్లాండ్, అమెరికా, ఆస్ట్రేలియా, స్పెయిన్, ఫ్రాన్స్‌కు ఆసియా దేశాల నుంచి వలసలు విపరీతంగా పెరిగాయి. ఆయా దేశాల ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపాయి. సెప్టెంబర్ మూడవ వారం నుంచి ఇంగ్లాండ్‌లో ఆందోళనలు చర్చకు కేంద్రమయ్యాయి. అభివృద్ధి దేశాలకు వలసలు పెరగడంతో స్థానికుల నిరసనలు వ్యక్తమవుతున్నాయి. నిరసనలకు సంస్కృతి-సంప్రదాయాలు దెబ్బతినడం ప్రధాన కారణం. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత మేధో వలసలను అమెరికా ప్రోత్సహించింది. యూరప్ దేశాలు అనుసరించాయి. మేధావులు వలస వెళ్లారు. ఇప్పుడు నిరసనలు వస్తున్నాయి. 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' ట్రంప్ నినాదం, 'మార్చ్ ఫర్ ఆస్ట్రేలియా' ఆస్ట్రేలియాలో, 'మేక్ యూరప్ గ్రేట్ ఎగైన్' యూరప్‌లో వినిపిస్తున్నాయి. ప్రపంచీకరణతో అభివృద్ధి దేశాలకు ప్రయోజనం కలిగినా, భిన్న సాంస్కృతిక వలసలు మార్పులు తెచ్చాయి. స్థానికులకు ఆర్థిక భారాలు, ఉద్యోగ అవకాశాలు తగ్గడం వంటివి. జాత్యాంహకరంగా స్థానికులు వ్యవహరిస్తున్నారని కొందరు, సంస్కృతి మారుతుందని ఆందోళనకారులు ఆరోపిస్తున్నారు. వార్సో, డుబ్లిన్, బెర్లిన్, యూకేలో టామీ రాబిన్సన్ ఆందోళనలు ఈ విషయాలను చర్చకు తెచ్చాయి. ప్రపంచీకరణతో అభివృద్ధి దేశాల ఆర్థిక వృద్ధి, సాంకేతికత పెరిగినా, ఇప్పుడు వ్యతిరేక ప్రభావం చూపుతోంది. యుద్ధ వాతావరణం, సుంకాలు, ఆంక్షలు ఇందుకు కారణాలు. వలసదారులు స్థానిక మనోభావాలకు అనుగుణంగా మెలగకపోతే తిరుగుబాటు చవిచూడాలి.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

### అలనాటి డెక్కన్ హైదరాబాద్

# గత సౌరభం, నేటి సవాళ్లు



హైదరాబాద్... ఈ పేరు వినగానే మనసులో ఒక అద్భుత చిత్రం ఆవిష్కృతమవుతుంది. చారిత్రక కట్టడాల సౌందర్యం, సాంస్కృతిక వైవిధ్యం, హిందీ-ఉర్దూ మిళిత భాషల సమ్మోహనం, కల్లాకపటం లేని మానవ సంబంధాలు... ఇవన్నీ ఒకప్పటి భాగ్యనగరం సొగసులు. వందేళ్ల క్రితం ఈ నగరం ఒక సజీవ చిత్రపటంలా ఉండేది. ఎడ్లబండ్లు, రిక్షాలు తోలే బక్కపలుచని మూగమనుసులు, ప్రభుత్వం నడిపే డబుల్ డెక్కర్ బస్సులు, నీటిలో పశువుల సంచారంతో మూసీ నది, గొల్లకొండ కోట బురుజుల నీడలో హుస్సేన్ సాగర్‌లో పడవలు, పబ్లిక్ గార్డెన్‌లో జడలు విరబోసుకున్న మర్రిచెట్టు, చార్మినార్ చుట్టూ నలుగురు సైనికుల్లా నిలబడిన నాలుగు కమానులు, రాతి కట్టడంతో నిర్మితమైన మక్కా మసీదు, శ్రీరామ మందిరం భక్తులను ఆశీర్వదిస్తూ... ఇవన్నీ ఆనాటి హైదరాబాద్‌ను ఒక అద్భుత కలగా మలిచాయి.

ఆ రోజుల్లో జీవనం ఒక సామాజిక బాంధవ్యంతో నిండి ఉండేది. లాడ్ బజార్‌లో రంగురంగుల గాజుల గలగలలు, తెల్లని పైజామాలు, షేర్వానీలు ధరించిన కాలేజీ పిల్లలు, ఎర్రటి టోపీలతో వెదురు కర్రలు పట్టుకున్న పోలీసులు... ఈ దృశ్యాలన్నీ ఒక సినిమాటిక్ అనుభవంలా అనిపించేవి. మూసీ వరదల సమయంలో వందలాది మంది ప్రాణాలను కాపాడిన చింతచెట్టు, ఫలక్‌నామా ప్యాలస్, రామ్ కోఠీ, పురాణాపూల్, గరీబ్‌ఖానా ఉస్మానియా వంటి స్థలాలు ఈ నగరానికి ప్రత్యేక గుర్తింపునిచ్చాయి. ఆనాటి జనజీవనం కల్లాకపటం లేని సరళత్వంతో, కాలుష్యానికి తావులేని నిర్మలమైన మైత్రీ భావనతో నిండి ఉండేది. హిందీ, ఉర్దూ భాషల మధురిమలో పాటలు, చప్పట్ల మధ్య ప్రజల సంచారం... ఇవన్నీ ఆనాటి భాగ్యనగరం సౌందర్యానికి అద్దం పట్టాయి.

అలాంటి ఆ రోజుల్లో మానవ సంబంధాలు అరమరికలు లేనివిగా ఉండేవి. ఒకరికొకరు సహాయం చేసుకునే ఔన్నత్యం, సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం ఉట్టిపడేవి. మానసిక ఒత్తిడి అనే మాటకు అప్పట్లో అర్థమే లేదు. జీవనం సరళంగా, సంతోషంగా సాగేది. ప్రజల మధ్య సంబంధాలు నీటిలా స్వచ్ఛంగా, గాలిలా స్వేచ్ఛగా ఉండేవి. ఆనాటి హైదరాబాద్‌లో జీవనం ఒక కళాత్మక చిత్రంలా ఉండేది, దాని ప్రతి రంగు, ప్రతి దృశ్యం ఒక కథను చెప్పేది.

కానీ, ఇప్పుడు ఈ విశ్వనగరం ఎలా మారిపోయింది? ఒకప్పటి ఆ సౌరభం, ఆ సరళత్వం ఎక్కడికి పోయాయి? నీడలాంటి రాజకీయ లెక్కలు, రాబందు రాజకీయాలు, ఉరుకులపరుగుల జీవనం ఈ నగరాన్ని మార్చేసాయి. ఒకప్పటి సహనం, సౌజన్యం స్థానంలో ఇప్పుడు అనుమానపు చూపులు, అపనమ్మకం నిండిన బ్రతుకులు నీడలా వెంటాడుతున్నాయి. ఆధునికత పేరుతో వచ్చిన ఈ గందరగోళం మనిషి ఆయుష్షును సగానికి తగ్గిస్తోంది. ఒకరినొకరు చూసుకోవడానికి సమయం లేని ఈ జీవనంలో, ఆనాటి మైత్రీ భావన ఒక కలలా మిగిలిపోయింది.

ఈ నగరం ఇప్పుడు ఒక విశ్వనగరంగా మారినా, దాని గత సౌందర్యాన్ని కోల్పోయింది. ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం, ఒత్తిడి నిండిన జీవనం... ఇవన్నీ ఈ నగరాన్ని ఒక యాంత్రిక సమాజంగా మార్చేశాయి. ఒకప్పటి చార్మినార్ చుట్టూ ఉన్న సామాజిక జీవనం ఇప్పుడు కేవలం ఫొటోల్లో, కథల్లో మాత్రమే కనిపిస్తుంది. ఆనాటి హైదరాబాద్‌ను గుర్తు చేసే కొన్ని కట్టడాలు, కొన్ని చెట్లు, కొన్ని జ్ఞాపకాలు మాత్రమే మిగిలాయి.

ఈ మార్పు ఒక్క హైదరాబాద్‌కే పరిమితం కాదు. ఆధునికత, పాశ్చాత్య ప్రభావం, సాంకేతిక పురోగతి పేరుతో మన సాంస్కృతిక వారసత్వం క్రమంగా కనుమరుగవుతోంది. ఒకప్పటి సామాజిక బాంధవ్యాలు, మానవ సంబంధాలు ఇప్పుడు డిజిటల్ పరిధుల్లో బంధించబడ్డాయి. సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్‌లు మనిషిని మరింత ఒంటరిగా మార్చాయి. ఆనాటి సరళమైన జీవనం ఇప్పుడు ఒక గత కాలపు కథలా మారిపోయింది.

అయినా, ఈ నగరం ఇంకా తన గత వైభవాన్ని కొంతైనా నిలుపుకుంది. చార్మినార్, గొల్లకొండ, హుస్సేన్ సాగర్ వంటి చిహ్నాలు ఇప్పటికీ ఈ నగరానికి గుర్తింపునిస్తున్నాయి. కానీ, ఆనాటి సామాజిక సౌహార్దం, మానవ సంబంధాల స్వచ్ఛతను తిరిగి తెచ్చేందుకు మనం ఏం చేయాలి? మన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడం ఒక్కటే సమాధానం కాదుబీ మనిషి మనసులోని సరళతను, సహనాన్ని, సౌజన్యాన్ని తిరిగి పెంచుకోవాలి.

హైదరాబాద్ ఒక విశ్వనగరంగా ఎదగడం మనకు గర్వకారణమే. కానీ, ఈ ఆధునికతలో మనం మన గతాన్ని మరచిపోకూడదు. ఆనాటి భాగ్యనగరం సౌరభాన్ని, సామాజిక బాంధవ్యాన్ని తిరిగి ఆవిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ఒకరికొకరు సహాయం చేసుకునే సంస్కృతిని, కల్లాకపటం లేని సంబంధాలను మళ్లీ నిర్మించుకోవాలి. అప్పుడే ఈ విశ్వనగరం తన గత వైభవాన్ని తిరిగి పొందగలదు. అదీ మనం ప్రేమించే డెక్కన్ హైదరాబాద్ సౌందర్యం, ఆత్మ!

**ఏముల సుధాకర్,**
కవి సాహితీ విశ్లేషకులు, హైదరాబాద్

## నేటి కవిత్వం!

సొట్టబుగ్గల సింగారి!
నీలిముంగురుల పొన్నారి!
అంటూ ఎన్నాళ్ళు రాస్తావ్?
అణచివేతలే ప్రధానమై
అవకాశాలే మృగ్యమైనపుడు
సొట్టబుగ్గల కవిత్వాన్ని ఆపు!
పోరాట కవిత్వాన్ని చూపు!

ఆ రాణీ ప్రేమపురాణం
అది కాదు కవిత్వ సారం!
ఎన్నికల్లో డబ్బు పంచటం
ఓటర్ని మత్తులో ముంచటం
ఇదికాదు ప్రజాస్వామ్యం!
చెప్పాలీ సంగతులన్నీ
అదికదా నేటి కవిత్వం!

జరిగేది అన్యాయమైతే
అన్యాయాల్నిఆక్రందనల్నీ
పట్టించుకోకుండా నీ
పిల్లగాలులు వెన్నెలక్రీడలు
వల్లించే కవితా గానం
ఎవడికి కావాలి చెప్పు!

దేశాలన్నీ ఆర్థికమాంద్యం
వ్యవస్థలన్నీ సంక్షుభితం
పాలనలో అసమానత్వం
ఒడిదుడుకుల జీవన సారం
యుద్ధాలే పరిష్కారంగా
చూపించే ప్రభుతల వైనం
కనిపించదా నీ కలానికి!

అందరికీ సమాన న్యాయం
అందించే పాలన కోసం
పోరాడే కవితా కోణం
కావాలోయ్ కవి సందేశం!
సాధిస్తే సమానత్వము
ఆ పై చూద్దాం ప్రేయసి తత్వం!
సమతే నీ అంతిమ లక్ష్యం,!

దేశమంతా కాలిపోతుంటే
ఫిడేలు వాయించటం కాదు!
మంటలనార్పే గీతం రాయి!
గ్రీష్మ తాపాన్ని ఒదిలించు!
ఆపై వచ్చే వసంతకాలం
కోయిలజంటల కుహూరవం
వింటూ కాలం గడిపేద్దాం!!

**తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

## వాన వచ్చేస్తుందో

నత్తనడకలు వద్దు
పెళ్లినడకలు వద్దు
మొన్నటి మురికినీళ్లు
నిన్నటి బురదనీళ్లు పోవాలి
టౌన్ వీడాలి
మోరీలు పొంగి నాళాలు ఉప్పొంగి
పాదచారులు సైకిల్ మోటార్ల
యజమానులు కృంగి బి
ఇక్కడే
చక్కర్లు కొట్టొద్దు అన్నా
వంకర్లు పోవద్దు అన్నా
వినదు
సలహాలు సూచనలు లెక్కించదు
జాగ్రత్తలు హెచ్చరికలు పట్టించుకోదు
మంచి జరగాలన్న తపనతో
సత్ప్రవర్తనతో కదిలి సరైన మార్గంలో
బయటకెళ్ళి అచ్చమైన గ్రామీణ
భారతాన్ని చేరాలి కదా

నీరుకి
నిర్దిష్టమైన ఎజెండా లేదు
మళ్లీ
ఎవరి కన్సన్నుల్లో మెలగదు
ఎవరి అదుపులో చేరదు
తీవ్రంగా దుర్మార్గమైందిగా
అనిపిస్తుంది కూడా

కొండ ప్రాంతాల్లోనూ
మైదాన ప్రాంతాల్లోనూ
మకాం వేయాల్సింది కానీ
నగరాన్ని పట్టుకుంది
నీరే హింసై ప్రజ్వరిల్లుతోంది
దావానంలా శివార్లను సైతం
వ్యాపిస్తుంది
కురవడమే నా వంతు అన్నట్టు

తంబుర మోగినట్టు
తుంపర మొదలెట్టి దబాయిస్తోంది
నీరుతో దిగ్బంధం చేసి యుద్ధక్షేత్రంగా
మలుస్తోంది
వానా
సయ్యాటలు ఆపవా
ప్రదర్శనలు అపవా
ము(నీ)ళ్ళను దాటుకొని అంబలాల్లకు
ఇంటికి చేరుకుంటారని
ఎదురుచూపుల్లో
కన్నతల్లులు కట్టుకున్న భార్యలు
వాన గాయపరుస్తుంది
వాన కలవరపరుస్తుంది
పట్నం చెట్టుమీద నీటి పక్షులు
టపటపా రెక్కలార్చితే భయం
వెంటాడుతోంది
భూమికి
రూపురేఖలు ఇచ్చే వాన
చెట్టు చేమతో మెరుగులు దిద్దే వాన
పద్ధతికి ప్రగతికి పట్టం కట్టే వాన
మానవ జీవనానికి ముదమును గూర్చే
వాన
ఇదేం జరిమానా

అడవుల్ని నరికి కాలుష్యాన్ని పెంచేస్తే
తన మూలాలైన హరితవనాల్ని
కబళిస్తే
అణువణువు కాంక్రీటు సౌధాలు నిర్మిస్తే
సముద్రం చెలియలికట్ట దాటినట్టు
వాన

**కోటం చంద్రశేఖర్**
9492043348

# తెలుగు విమర్శకు వెలుగునిచ్చిన మేధావి ఆచార్య ఎస్.వి. రామారావు

తెలుగు సాహిత్య విమర్శలో సమన్వయ దృష్టి, తార్కిక విశ్లేషణతో కొత్త వెలుగులు చిమ్మిన మేధావి ఆచార్య ఎస్.వి. రామారావు. విమర్శను సత్యాన్వేషణగా, సాహిత్యాన్ని సాంస్కృతిక చరిత్రతో అనుసంధానం చేసిన ఆయన రచనలు ఆధునిక విమర్శకు మార్గదర్శకాలు. సాంప్రదాయ-ఆధునిక సమన్వయకర్తగా, పరిశోధనాత్మక సమీక్షకుడిగా పేరొందిన ఆయన జీవితం, సాహిత్య సేవలు తెలుగు సాహితీ ప్రపంచానికి స్ఫూర్తిదాయకం. విమర్శ అనేది కేవలం సాహిత్యంలో మూల్యాంకనం మాత్రమే కాదు, నిష్పాక్షిక తీర్పును అందించే సృజనాత్మక ప్రక్రియ. ఇది స్తుతి లేదా నిందకు పరిమితం కాక, సాహిత్య కృతులను సమగ్రంగా, సమతుల్యంగా పరిశీలించే కళ. ఈ దృష్టితో తెలుగు సాహిత్యాన్ని విశ్లేషించిన వారిలో ఆచార్య ఎస్.వి. రామారావు ప్రముఖుడు. ఆయన రచనలు తార్కికత, సౌందర్యాన్వేషణ, సాంస్కృతిక చైతన్యాన్ని ప్రతిబింబిస్తాయి. వ్యక్తిగత దురభిప్రాయాలకు తావు లేకుండా, సాహిత్యాన్ని సాంస్కృతిక చరిత్రతో అనుసంధానించి పరిశీలించారు. డాక్టర్ పింగళి సూర్యనారాయణ తన 'ఆధునిక తెలుగు విమర్శ' (1995) వ్యాసంలో ఆయనను సాంప్రదాయ-ఆధునిక సమన్వయకర్తగా అభివర్ణించగా, ఆచార్య కోటా శేషగిరిరావు 'తెలుగు విమర్శా దృక్కోణాలు' (2001) గ్రంథంలో ఆయన దృష్టిని పరిశోధనాత్మక సమీక్షగా పేర్కొన్నారు.

1941 జూన్ 5న (విష్ణునామ సంవత్సరం, జ్యేష్ఠ శుద్ధ దశమి) వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలో జన్మించిన ఎస్.వి. రామారావు తండ్రి సూగూరు వాసుదేవరావు, తల్లి రామచూడమ్మ. శ్రీరంగాపురం గ్రామం ప్రాచీన సాంస్కృతిక సంప్రదాయాలకు నిలయంగా పేరొందింది. రంగనాయకస్వామి ఆలయం, 300 సంవత్సరాల క్రితం వనపర్తి సంస్థాన రాజులచే నిర్మితమై, అష్టభాషా కోవిదుడైన బహిరి గోపాలరావు ప్రధాన పాత్రతో నిర్మాణమైంది. గోపాలరావు ఆలయ నిర్మాణకర్తగా మాత్రమే కాక, సంస్కృతంలో రంగనాయకస్వామిపై నాటకాలు రచించిన పండితుడు. ఈ నాటకాలు ఆ కాలపు భక్తి-సాంస్కృతిక పరంపరలను వెలుగులోకి తెచ్చాయి. ఈ ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా మాత్రమే కాక, తెలుగు-సంస్కృత నాటకరంగ వికాసానికి పునాదిగా నిలిచింది. ఈ సాంస్కృతిక వాతావరణం చిన్ననాటి నుంచే రామారావు ఆలోచనలపై గాఢమైన ముద్ర వేసింది.

రామారావు విద్యాభ్యాసం శ్రీరంగాపురం ప్రాథమిక పాఠశాలలో ప్రారంభమై, వనపర్తి ఉన్నత పాఠశాలలో ఆకారం సంతరించుకుంది. 1958లో హైదరాబాద్ నిజాం కళాశాలలో పి.యు.సి., బి.ఏ. పూర్తి చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగులో ఎం.ఏ. చేశారు. సాహిత్య విమర్శపై లోతైన ఆసక్తి, పరిశోధనా తపన ఆయనను ఉన్నత విద్యావంతునిగా తీర్చిదిద్దాయి. డాక్టర్ సి. నారాయణరెడ్డి పర్యవేక్షణలో 'తెలుగు సాహిత్య విమర్శ - అవతరణ, వికాసాలు' అనే అంశంపై 1973లో పి.హెచ్.డి. సాధించారు. అదే సంవత్సరం భారతీయ విద్యాభవన్ నుంచి జర్నలిజంలో డిప్లొమా పొందారు. ఈ విద్యాభ్యాస దశలో సంపాదించిన సాహిత్య అవగాహన, విమర్శాత్మక దృష్టి ఆయన రచనలకు పునాది వేశాయి. నారాయణరెడ్డి శైలి, పరిశోధనా పద్ధతి ఆయనపై స్పష్టంగా ప్రతిఫలించాయి.

ఆయన ఉద్యోగ జీవితం సాహిత్య, శాస్త్రీయ ప్రస్థానాన్ని మరింత విస్తరించింది. 1966లో లెక్చరర్‌గా బోధన ప్రారంభించి, 1976లో రీడర్‌గా, 1987లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. తెలుగు శాఖ అధ్యక్షుడు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ డైరెక్టర్, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ వంటి కీలక పదవులు నిర్వహించారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, బెనారస్ హిందూ యూనివర్సిటీ, బెంగళూరు యూనివర్సిటీలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. జాతీయ, అంతర్జాతీయ సాహిత్య సదస్సుల్లో పత్రాలు సమర్పించారు. పాఠ్యగ్రంథాల రచన, సంపాదకత్వంలో కీలక పాత్ర పోషించారు. 2001లో విశ్వవిద్యాలయ సేవలను ముగించి పదవీ విరమణ చేశారు.

రామారావు కుటుంబంలో సాహిత్య వాతావరణం లేకపోయినా, ఆయనలో సాహిత్యాభిలాష హఠాత్తుగా ప్రవేశించింది. శ్రీరంగాపురం యొక్క భౌగోళిక, చారిత్రక, సామాజిక నేపథ్యం ఈ అభిరుచికి కారణమైంది. వనపర్తి, జటప్రోలు, ఆత్మకూరు, గద్వాల వంటి ప్రాంతాలు సాహిత్య-సాంస్కృతిక వికాసానికి నిలయాలుగా ఉండటం ఆయన సాహిత్యాసక్తికి పునాది వేసింది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో, స్వాతంత్ర్యానికి ముందు జన్మించిన ఆయన, చిన్న వయసులోనే జాతీయోద్యమ ప్రభావాన్ని అనుభవించారు. స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంలో త్రివర్ణ పతాక బ్యాడ్జీలు ధరించి ర్యాలీల్లో పాల్గొన్న అనుభవం ఆయనలో దేశభక్తిని పెంచింది. చందమామ, బాలపత్రికల ద్వారా కథలోకంలో ప్రవేశించి, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభలను చదివి సమకాలీన చింతనతో మమేకమయ్యారు. సినిమాలు కూడా ఆయన అభిరుచిలో ముఖ్యమైన అంశం. గుణసుందరి కథ, సంసారం, షావుకారు వంటి సినిమాలను విమర్శనాత్మక దృష్టితో చూడటం ఆయనకు అలవాటైంది. 14-15 ఏళ్ల వయసులోనే సినిమా సమీక్షలు రాసి మద్రాస్ పత్రికలకు పంపడం ప్రారంభించారు. ఆశ్చర్యకరంగా, ధనికొండ హనుమంతరావు సంపాదకత్వంలోని చిత్రసీమ, సినిమా రంగం పత్రికలు వీటిని ప్రచురించాయి. ఈ సమీక్షలు ఆయన సాహిత్య రచనా ప్రస్థానానికి ప్రారంభం అయ్యాయి.

విద్యార్థి దశలోనే సాహిత్య పఠనం ఆయనలో రచనా చైతన్యాన్ని మేల్కొల్పింది. వనపర్తి హైస్కూల్ లైబ్రరీ ఆయన అభిరుచికి కేంద్రంగా నిలిచింది. 15 ఏళ్ల వయసులో విశ్వనాథ సత్యనారాయణ యొక్క 'ఏకవీర', బుచ్చిబాబు యొక్క 'చివరకు మిగిలేది', గోపిచంద్ యొక్క 'అసమర్థుని జీవయాత్ర' వంటి నవలలను చదివేశారు. ఈ రచనలు ఆయన మనసులో చెరగని ముద్ర వేశాయి. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ బోధించిన గురువుల ప్రభావం ఆయనపై గణనీయంగా ఉంది. నిజాం కళాశాలలో ఇంగ్లీష్ మాధ్యమంలో పి.యు.సి. చదివి అత్యధిక మార్కులు సాధించారు. డాక్టర్ సి. నారాయణరెడ్డి ఆయనపై



ప్రత్యేక మమకారం చూపారు. నారాయణరెడ్డి యొక్క 'నాగార్జునసాగరం', 'కర్పూర వసంతరాయలు' కావ్యాలను కంఠస్థం చేసుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డాక్టర్ బి. రామరాజు, ఖండవల్లి లక్ష్మీరంజనం, పల్లా దుర్గయ్య వంటి పండితుల శిష్యరికం పొందారు. నిజాం కళాశాల పత్రికకు సంపాదకత్వం, వ్యాస రచన పోటీల్లో పాల్గొనడం ఆయనను విమర్శకుడిగా తీర్చిదిద్దాయి.

పరిశోధనా ప్రస్థానంలో రామారావు నిజాం కళాశాలలో రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, విశ్వనాథ సత్యనారాయణ వ్యాసాలను అధ్యయనం చేశారు. ఈ పఠనం ప్రభావంతో పి.యు.సి. దశలోనే సాహిత్య విమర్శపై పి.హెచ్.డి. చేయాలనే కోరిక మేల్కొంది. నారాయణరెడ్డి వద్ద మొదటి పి.హెచ్.డి. విద్యార్థిగా, 'తెలుగులో సాహిత్య విమర్శ - అవతరణ, వికాసాలు' అనే కఠినమైన అంశంపై పరిశోధన చేశారు. వేటపాలెం, గౌతమి, మద్రాసు యూనివర్సిటీ, తంజావూరు సారస్వతీ మహల్ గ్రంథాలయాలను పరిశీలించి విమర్శా గ్రంథాలను సేకరించారు. ఈ సుదీర్ఘ పరిశోధన ఫలితంగా 'తెలుగులో సాహిత్య విమర్శ' (1973) గ్రంథం వెలువడింది. ఇది తెలుగు విమర్శ చరిత్రలో మొట్టమొదటి ఏకైక గ్రంథం. 19వ శతాబ్దపు తొలి విమర్శా గ్రంథాలు, నాటక-నవలా విమర్శలు, విశ్వనాథ, రాళ్లపల్లి వంటి ఆధునిక విమర్శకుల కృషిని సమగ్రంగా పరిచయం చేసింది. ఈ గ్రంథం విశ్వవిద్యాలయాల్లో పాఠ్యగ్రంథంగా స్థిరపడింది.

తెలంగాణ సాహిత్య చైతన్యంపై రామారావు కృషి అమోఘం. తెలంగాణలో సాహిత్యం లేదనే అపోహలను తొలగించడానికి సురవరం ప్రతాపరెడ్డి 'గోల్కొండ కవుల సంచిక' ద్వారా చేసిన కృషి ఆయనపై ప్రభావం చూపింది. 'పాలమూరు జిల్లా సాహిత్య చరిత్ర' (2010), 'పాలమూరు ఆధునిక కవులు', 'తెలంగాణ సాహిత్య చరిత్ర', 'తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం' గ్రంథాలు రచించారు. 'నవచేతన' ద్వారా తెలంగాణ ఆలయాలు, శిల్పాల సాంస్కృతిక వారసత్వాన్ని వెలుగులోకి తెచ్చారు. ఆయన రచనలు ప్రాంతీయ పరిమితులకు అతీతంగా, వాస్తవ దృష్టితో సాగాయి. నన్నయ ఆయన అభిమాన కవి, విశ్వనాథ సత్యనారాయణ ప్రియ రచయిత. 'సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర - 19వ శతాబ్దం వరకు' గ్రంథం ఆయన మహత్తర కృషి.

సంపాదకత్వంలో రామారావు 1966లో 'జ్యోతిర్మయి' సాహిత్య వేదికను స్థాపించి, పాలమూరు కవుల కవితా సంకలనం 'జ్యోతిర్మయి' వెలువరించారు. 'సమర్పణ' కథా సంకలనం, గడియారం రామకృష్ణశర్మ, బూర్గుల రామకృష్ణారావు, సురవరం ప్రతాపరెడ్డి సంచికలను సంపాదించారు. 'వివేచన' పత్రికకు సంపాదకత్వం వహించారు. అపరిచిత సాహిత్యవేత్తలను వెలుగులోకి తెచ్చారు. 'రంగనాథరావు సాహిత్యం', 'కవిజనాశ్రయం' వంటి సంకలనాలు ఆయన సంపాదకీయ నైపుణ్యానికి నిదర్శనం.

రామారావు రచనలు విమర్శ, చరిత్ర, వ్యాసాలు, వ్యాఖ్యానాలు, సంపాదకత్వంగా విభజించవచ్చు. 'తెలుగులో సాహిత్య విమర్శ' (1974) ఆయన జీవిత సాఫల్య గ్రంథం. 'అన్వీక్షణం' (1984), 'సమవీక్షణం' (1992), 'అభివీక్షణం' (1998), 'కావ్యామృతం' (2004), 'గ్రంథావలోకనం' (2014) వ్యాస సంకలనాలు. 'నన్నయ దర్శనం' (1998), 'కర్ణపర్వం' (2005), 'భీమేశ్వర శతకం' (2006) వ్యాఖ్యాన గ్రంథాలు. 'పాలమూరు సాహితీ వైభవం' (2010), 'తెలుగు సాహిత్య చరిత్ర' (2012) చరిత్ర గ్రంథాలు. 'శతజయంతి సాహితీమూర్తులు' ద్వారా 19వ, 20వ శతాబ్దాల కవులను పరిచయం చేశారు.

ఆయన పర్యవేక్షణలో 19 పి.హెచ్.డి., 15 ఎం.ఫిల్ పరిశోధనలు పూర్తయ్యాయి. ఆయనపై 'మనస్వి', 'యశస్వి ఆచార్య ఎస్.వి. రామారావు', 'ఆచార్య ఎస్.వి. రామారావు సాహిత్యం - సమకాలీన విమర్శనములు' వంటి పరిశోధనలు వెలువడ్డాయి. ఆయన సాహిత్య సేవలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఉత్తమ విమర్శ పురస్కారం (1994), సహృదయ సాహితీ పురస్కారం వంటివి లభించాయి. ఆచార్య ఎస్.వి. రామారావు తెలుగు సాహిత్య విమర్శకు వెలుగు నిచ్చిన మహామేధావి, శాశ్వత స్ఫూర్తి.

**డా. ఐ. చిదానందం**
తెలుగు ఉపన్యాసకులు
వెల్దండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ
నాగర్ కర్నూల్ జిల్లా
చరవాణి - 8801444335

# దరిచేరని భూమాత భూములు..

- అధికారుల పాపం రైతులకు శాపం
- భూమి ఉన్న పంట రుణాలు రైతు బీమా రైతు భరోసా పొందలేని రైతులు
- ఏడు ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ప్రయోజనం శూన్యం



**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** ఎవరో చేసిన తప్పుకు ఆ రైతులంతా నరకయాతన పడుతున్నారు. పొలాలు వాళ్లవైన వాటిపై హక్కు మాత్రం వారికి లేదు. అధికారుల చేతి వాటం ధరణి పుణ్యం వల్ల ఆన్‌లైన్ ఉండవలసిన వాళ్ల పేర్లు గల్లంతయ్యాయి. ఫలితంగా పంట రుణాలు రైతు బీమా రైతు భరోసా లాంటి పథకాలకు దూరమయ్యారు. తమ పొలాలను సరి చేయండి మొర్రో అంటూ ఏడు ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగిన ప్రయోజనం శూన్యం వివరాల్లోకి వెళితే. వికారాబాద్ జిల్లా బొం రాస్ పేట్ మండలం గట్టేగాని తాండ గ్రామంలో120 రైతులు సర్వే నంబర్ 128లో దాదాపు 105 భూమిని సాగు చేసుకుని జీవనోపాధి గడుపుతున్నారు. 2018 సంవత్సరంలో ధరణి అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతులకు సంబంధించిన భూములు రికార్డు నుంచి మాయమయ్యాయి. రైతులందరివి పట్టా భూములైనప్పటికీ ప్రభుత్వ భూమిగా అధికారులు నమోదుచేసి పట్టాకాలంలో ఉన్న 120 మంది రైతుల పేర్లను తొలగించారు. అప్పటినుంచి రైతులు తమ పట్టా భూములను తిరిగి ధరణి పోర్టబుల్ లో నమోదు చేయాలని కార్యాలయాలు చుట్టూ చెప్పులు అడిగేలో తిరుగుతున్నారు. దాదాపు 7 ఏళ గడుస్తున్న ఇప్పటివరకు వారి భూమి సమస్య పరిష్కారం కాలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి స్థానంలో భూమాతను తెచ్చి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం చెప్పుకొస్తున్న రైతులు జిల్లా కార్యాలయం ఆర్డిఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న వారి సమస్య పరిష్కారం కాలేదు. ఈ విషయమై పలు దఫాలుగా జిల్లా కలెక్టర్ కు వికారాబాద్ ఆర్డీవో క ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేకపోయింది. 2018 సంవత్సరం నుంచి ధరణి పుణ్యమా అంటూ ఈ గ్రామ రైతుల పేర్లు రికార్డు నుంచి మాయమైనందున ఇప్పటివరకు వంట రుణాలు రైతు బీమా అప్పుడు రైతు బందు. ఇప్పుడు రైతు భరోసా. సబ్సిడీ యూరియాకు నోచుకోలేదు. ప్రైవేట్ పట్టా భూములను ప్రభుత్వ భూములుగా మార్చి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు జిల్లా కలెక్టర్‌కు మరోసారి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై రైతులు మాట్లాడుతూ ఏడేళ్లుగా ప్రైవేట్ భూమిని ప్రభుత్వ భూమిగా మార్చారని పట్టా భూమి లేక ప్రభుత్వ భూమ్యా అధికారులు తేల్చలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఈ సర్వే నంబరు భూమి గురించి అంత చిక్కడం లేదని అధికారులు దాటవేస్తున్నారని వారు ఆరోపించారు. బ్యాంకుల్లో పంట రుణాలు పొందలేక ప్రైవేట్ అప్పులతో సతమతమవుతున్నామని అన్నారు. రైతుబంధు ఇప్పటి రైతు భరోసా పథకం తమకు వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు భూమి ఉన్న ఎవరైనా రైతులు మరణిస్తే ప్రభుత్వపరంగా ఇచ్చే రైతు బీమా పథకానికి నోచుకోలేకపోతున్నామని ఫలితంగా తాము తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. భూములున్న సాగు చేసుకోవడం మినహా ఎలాంటి లబ్ధి పొందలేకపోతున్నామని అన్నారు. ప్రతి కుటుంబానికి అర్ధ ఎకరం పైబడి ఎకరం లోపు పంట పొలాలు ఉన్నాయని ఎదిగిన పిల్లలు పెండ్లిలకు వచ్చిన ప్రైవేట్ అప్పు పుట్టక భూమిపై రుణాలు పొందలేక అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. సర్వే నంబర్ 128 భూములు తప్ప తమకు ఎలాంటి భూములు లేవని తమ జీవనోపాధి ఈ భూముల పై ఆధారపడి ఉందని అన్నారు. ఈ విషయమై అధికారులు వెంటనే చర్యలు తీసుకొని తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

## దసరాలోపు ప్రజలకు తాగునీళ్ళు అందించి దాహం తీర్చండి



**బోడుప్పల్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** పీర్జాదిగూడ నగర ప్రజలకు దసరాలోపు మంచినీళ్ళు అందించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని పీర్జాదిగూడ కమిషనర్ త్రిలేశ్వర్ రావుకు మాజీ మంత్రి,మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లా రెడ్డి, మాజీమేయర్ జక్క వెంకట్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ నగరంలోని పలు కాలనీలలో ప్రజలు ఏదురుకుంటున్న సమస్యలపై మాజీ కార్పొరేటర్లు, ప్రజలు, స్థానిక నాయకులతో కలిసి కమిషనర్ త్రిలేశ్వర్ రావుకి కలిసి వినతిపత్రం అందజేసారు. ఆయన మాట్లాడుతూ దసరా పండుగ లోగ ప్రజలకు మంచినీళ్లు అందించాలని అవసరమైన చోట నూతన పైప్ లైన్ ఏర్పాటు చేయాలని,సిసి రోడ్డు, డ్రైనేజి వంటి మౌలిక సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన పనులు ప్రారంభించాలని కోరినట్లు తెలిపారు. కమీషనర్ సానుకూలంగా స్పందంచారని అన్ని పనులకు టెండర్ వేశారని, మన సమస్యలు అన్ని ముందే అంచనా వేశారని దసరాలోపు అన్ని పనులు పూర్తిచేస్తారని తనదైన శైలిలో అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతురి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, జావీద్ ఖాన్,జిలాని పాషా, కోనేటి వెంకట్, యాసారంశ్రీనివాస్, అమర్ పటేల్, బత్తుల కిరణ్ వివిధ కాలనీల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్‌లో ఈవీఎంల గోడౌన్ తనిఖీ

- ఈవీఎంల భద్రతలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లాలో ఈవీఎం గోడౌన్ ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తనిఖీ చేసి పరిశీలించారు. గురువారము రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నందున పూల మొక్క అందజేసి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్. ముందుగా పోలీస్ వారి చే గౌరవ వందనం స్వీకరించారు .అనంతరము జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ ప్రతీక్ జైన్ , జిల్లా ఎస్పి నారాయణ రెడ్డి , అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ల తో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అయన సూచించారు. సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల వారితో మాట్లాడారు. బిఎల్ఓల పేర్లు ఇచ్చారా..?, ఓటరు జాబితా పూర్తి అయినదా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమములో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డిఆర్ఓ మంగీ లాల్, ఆర్‌డిఓ వాసు చంద్ర, తహసిల్దార్ లక్ష్మి నారాయణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హాలీ, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతి నిధులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## జాతీయ రహదారిని తాండూరు మీదుగా సేడం వరకు విస్తరించాలి

- రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతిపత్రం



**తాండూరు, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** సదాశివపేట్ జాతీయ రహదారిని తాండూరు మీదుగా కర్ణాటక రాష్ట్రం సేడం వరకు విస్తరించి జాతీయ రహదారిని మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, చేవెళ్ళ పార్లమెంట్ సభ్యుడు కొండ విశ్వేశ్వర రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఢిల్లీలో కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థ ఉన్న తాండూరు, సదాశివపేట్ రహదారిని జాతీయ రహదారిగా మారిస్తే ప్రయోజనం ఉంటుందని అన్నారు. ఈ రహదారి నిర్మాణం ద్వారా దక్షిణ భారతదేశం నుంచి ఉత్తర భారతదేశానికి రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని గుర్తుచేశారు. అదేవిధంగా ప్రజలకు కూడా సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. ఈ రహదారి ద్వారా రాజస్థాన్, కర్ణాటక, బీహార్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు అనేక అంతర్రాష్ట్ర రవాణా సౌకర్యం లభిస్తుందని తెలిపారు. వికారాబాద్ జిల్లా తాండూరు ప్రాంతంలోని సిమెంట్, నాపరాతి పరిశ్రమలు, రైతులు పండించే కంది, పత్తి వంటి పంటల రవాణాకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే సదాశివపేట్, మోమిన్‌పేట్, పెద్దేముల్, తాండూరు, కరణ్‌కోట్, నిడుగుండా, సేడం మీదుగా జాతీయ రహదారిని ప్రత్యేకంగా మంజూరు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రులతో పాటు పలువురు అధికారులు కూడా పాల్గొన్నారు.

## క్రీడలు ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయి



**వీపనగండ్ల, సెప్టెంబర్ 19 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 17, అండర్ 14 కబడ్డీ, కోకో, వాలీబాల్ క్రీడల పోటీలు నిర్వహించారు. ఈ క్రీడలకు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ముంత మల్లయ్య యాదవ్ సహకారం అందించారు. ఈ క్రీడలను స్థానిక ఎస్సై కే. రాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు చాలా అవసరమని అన్నారు. విద్యార్థులకు క్రీడలు ఆత్మస్థైర్యాన్ని, ధైర్యం ఇస్తాయని అన్నారు. క్రీడలు గెలుపు ఓటమిలో సమానంగా తీసుకోవాలని, ప్రతి ఓటమి గెలుపుకు నాంది అని విద్యార్థులకు సలహా ఇచ్చారు. ఈ క్రీడలలో మండల పరిధిలోని 9 ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి నరసింహ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాను ప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు ఆడడం వలన ఆరోగ్యవంతంగా, శారీరకంగా మానసికంగా ఆహ్లాదకరంగా ఉంటారని అన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా వ్యాయామం, క్రీడలు దినచర్యలో భాగం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడల నిర్వహకులు శ్రీకాంత్, రమేష్, శ్రీనివాసులు, పవన్, యాదయ్య, కిషోర్, శిరీష, ఎస్ జి ఎఫ్ ఐ కార్యదర్శి బొలెమోని కుమార్, తూముకుంట కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శ్రీనివాస్ రెడ్డి, బషీర్, మహమ్మద్,రఘు, ఆనంద్, మహేష్, సి.అర్.పి వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కబడ్డీ క్రీడలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వీపనగండ్ల విద్యార్థులు ప్రథమ స్థానంలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్వరాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. స్థానిక ఎస్సై కే రాజు విద్యార్థులతో కాసేపు కబడ్డి ఆడుతూ విద్యార్థులను ఉత్సాహపరిచారు.

## యాసంగి బియ్యం తక్షణమే మిల్లర్లు అందజేయాలి

- బియ్యం నిల్వలకు అనుగుణంగా గోడౌన్‌లో ఏర్పాటు చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** యాసంగి 2024-25 సీజన్‌కు సంబంధించి బకాయిలో ఉన్న కస్టమ్ మిల్లింగ్ బియ్యంను మిల్లర్లు తక్షణమే పూర్తిగా అందజేయాలని, అలాగే ఖరీఫ్ మరియు రబీ సీజన్లకు సంబంధించిన బియ్యం డెలివరీలను వేగవంతం చేయాలని రెవిన్యూ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. గురు వారం తన చాంబర్‌లో నిర్వహించిన రైస్ మిల్లర్ల జిల్లా సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లర్లు తమ మిల్లు సామర్థ్యం మేరకు బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సమయానికి అందజేయాలని కోరారు. అలాగే మిల్లర్లు తమకు అప్పగించిన ధాన్యం పరిమాణానికి తగినట్టుగా బియ్యం సరఫరా చేసుకోవాలని, తమ బాధ్యతగా భావించాలని ఆయన మిల్లర్లకు సూచించారు. బ్యాంకు గ్యారంటీ లేకుండా ప్యాడి ఇవ్వడానికి వీలు లేదని, తప్పనిసరిగా బ్యాంక్ గ్యారంటీ ఉండాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా, గ్యాప్ ఎక్కడ కూడా లేకుండా చూడాలన్నారు.
ఎఫ్‌సీఐ అధికారులు డెలివరీలకు అనుగుణంగా తగిన సంఖ్యలో గోదాములను ఏర్పాటు చేసి, జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని పేర్కొన్నారు. గోదాముల్లో సరైన తరలింపు కోసం తగినంత మంది హమాలీలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆయన కోరారు. జిల్లాలో స్థల కొరత ఉండకుండా గోదామును ప్రత్యామ్నాయంగా వినియోగించేందుకు ఎఫ్‌సీఐ చర్యలు తీసుకోవాలని, అలాగే బియ్యం నిల్వ మరియు రవాణా సులభతరం చేసేందుకు రైల్వే వ్యాగన్ ల కేటాయింపు పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో ,జిల్లా పౌర సరఫరాల మేనేజర్ మోహన్ కృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి సుదర్శన్ ,శ్రీనివాస్ గుప్తా, శ్రీధర్ రెడ్డి, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆమడదూరంలో వికారాబాద్

- పాలకులకు పట్టని పట్టణ అభివృద్ధి
- వికారాబాద్ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాన్ రెడ్డి



**వికారాబాద్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** దాదాపు రెండు సంవత్సరాల కాలం నుండి వికారాబాద్ పట్టణ అభివృద్ధి కుంటుపడి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని వికారాబాద్ బిఆర్ఎస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు గడిచిన రెండు సంవత్సరాల కాలంలో వికారాబాద్ పట్టణం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని వికారాబాద్ ఒక జిల్లా కేంద్రం అనే విషయాన్నీ మర్చిపోయారని, ఒక పక్క అమలు కానీ అబద్దపు హామీలు మరోపక్క ఆచరణలో లేని అభివృద్ధి ప్రగల్బాల ప్రకటనలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు, మున్సిపల్ లో కనీసం వీధి దీపాలు, సెంట్రల్ లైటింగ్ మరమతులు, రోడ్లు, డ్రైనేజీ, మెరుగుపరుచడంలో వికారాబాద్ ప్రజాప్రతినిధులు విఫలం అయ్యారని, బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణ అభివృద్ధి పై పోరాట కార్యాచరణ రూపొందించి రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో చెంపపెట్టు సమాధానం చెప్తామన్నారు.

# నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

- డిఎస్పీ ఎన్ లింగయ్య



**నారాయణపేట బ్యూరో, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** నేరాల నియంత్రణపై పోలీసు అధికారులు దృష్టి పెట్టానని నారాయణపేట డిఎస్పీ ఎన్.లింగయ్య అన్నారు. గురువారం నారాయణపేట, కోస్గి సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులకు డిఎస్పీ ఎన్ లింగయ్య గా డీఎస్పీ కార్యాలయంలో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరిగే నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాను గ్రేవ్ కేసుల గురించి సిఐ, ఎస్ఐలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతు గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి ఏ ఏ అంశాలు క్రోడికరించాలి తదితర అంశాల గురించి వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి, కేసులు ఛేదించాలి. కేసుల్లో శిక్షల శాతం పెంచాలి. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలి. పూర్తి పారదర్శకంగా కేసులో ఇన్వెస్టిగేషన్ చేయాలి. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్నికూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలి. అక్రమ ఇసుక రవాణా, గంజాయి, గుట్కా, పేకాట పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సమూలంగా నిర్మూలించాలి. ఫోక్సో, ఎస్సీ ఎస్టీ, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి, 60 రోజుల్లో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలి. ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని, ప్రతిరోజు కేసులను ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. కేసులను అన్ని కోణాలలో ఇన్వెస్టిగేషన్ చేసి కేసు ఫైనల్ చేయాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా చేదించాలి, కేసుల చేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలి, పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి చాలెంజిగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ సమావేశంలో సిఐ సైదులు, బాలరాజు, విజయ్ కుమార్, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

# వర్షం వల్ల ఇబ్బందులు కాకుండా చూడాలి



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** వర్షం వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఈఆర్‌టీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. ఎండీ మాట్లాడుతూ.. రానున్న 2రోజుల్లో ప్రతి రోజు ఉదయం 6 నుంచి 9 గంటలవరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముంపు ప్రాంతాల్లో వరద నీరు తొలగింపు, సివర్ జెట్టింగ్ యంత్రాల ఆపరేషన్లను ఆయా డీజీఎంలు తనిఖీ చేయాలన్నారు. వర్షం కారణంగా రహదారులపై ఉన్న మ్యాన్ హోళ్ల వద్ద సీవరేజీ ఓవర్ ఫ్లో పై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు. అంతేకాకుండా ప్రజల ఇంటి వద్ద చోక్ అయినా సమస్య పరిష్కరించడానికి ప్రాధాన్యమివ్వాలని జీఎంలను ఆదేశించారు. లోతైన మ్యాన్ హోళ్లు, మురుగు ఉప్పొంగే ప్రాంతాలను సందర్శించి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా తాగునీరు సరఫరా అయ్యే సమయంలో కచ్చితంగా మంచినీటి నాణ్యతను పరీక్షించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బస్తీలు, లోతట్టు ప్రాంతాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈడీ మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో పనిచేసే కార్మికులు పని జరిగే ప్రదేశాల్లో తప్పనిసరిగా హెల్మెట్లు, గ్లౌజులు, గమ్ బూట్స్ ధరించడంతో పాటు ఇతర రక్షణ చర్యలు పాటించేలా చూడాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో క్లోరిన్ మాత్రల్ని పంపిణీ చేయాలని సూచించారు. వీటిని క్వాలిటీ వింగ్ జనరల్ మేనేజర్ ఇతర అధికారుల సమన్వయంతో పంపిణీ చేయాలన్నారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులు చేయాలని తెలిపారు. నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్ మూతలను తెరవకూడదని సూచించారు. ఇతర వివరాలకు జలమండలి కస్టమేర్ కేర్ 155313కి కాల్ చేయాలని వారు కోరారు.

# విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టండి

- విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై శిక్షణ అందించాలి
- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.
- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూరిబా పాఠశాలల తనిఖీ
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** విద్యార్థుల ఆరోగ్య పట్ల ప్రత్యేక ద్రుష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్. పి. ప్రావీణ్య సూచించారు. గురువారం మండల కేంద్రమైన కొండాపూర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ తరగతి గదులు, రిజిస్టర్లు, వంటశాల, సామాగ్రి భద్రపరచు గది, పరిసరాలను కలెక్టర్ పి. ప్రావిణ్య పరిశీలించారు. ఈ సందర్భముగా ఆమె మాట్లాడుతూ ... ప్రభుత్వ పాఠశాలలను సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా మధ్యాహ్నం భోజనంలో మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని సూచించారు.



విద్యార్థుల ఆరోగ్యం పట్ల పర్యవేక్షిస్తూ ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యమైన నిత్యవసర సరుకులు, తాజా కూరగాయలను వినియోగించాలని, వంట సిబ్బంది పరిశుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాల పరిసరాలలో పారిశుద్ధ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండలకేంద్రంలోని పిహెచ్సి ఆరోగ్య కేద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భముగా పిహెచ్సీను కలెక్టర్ తనిఖీ చేసి, ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జనరల్ వార్డ్ ను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. వర్షాలు పడుతున్నందున సిజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా గ్రామాలలో జ్వర సర్వే లాంటి కార్యక్రమాలు నిర్వహించడం రీజనల్ వ్యాధులు వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన కలిగించడం, మురుగునీరు గ్రామాల్లో నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కలెక్టర్ ఆదేశించారు. ఆస్పత్రికి అవసరమైన రిక్వైర్మెంట్‌లు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. పిహెచ్సి కాంపౌండ్ వాల్‌కు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి వేణు గోపాల్, తహసిల్దార్ అశోక్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన మహారాష్ట్ర అధికారుల బృందం



**సంగారెడ్డి, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని చేర్యాల గ్రామపంచాయతీని మహారాష్ట్ర సోలాపూర్ జిల్లా నుండి అధికారులు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులు, గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణం, స్మశాన వాటిక నిర్మాణం, స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణం, కిచెన్ షెడ్ నిర్మాణం, బాయ్స్, గర్ల్స్ మూత్ర శాలల నిర్మాణాన్ని పరిశీలించారు. బృహత్‌పల్లె ప్రకృతి వనం కూడా పరిశీలించి చాలా సంతృప్తి వ్యక్తం చేశారు. 11 మంది అధికారుల బృందం పాల్గొని పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పిడి పూజ , జిల్లా ప్లాంటేషన్ మేనేజర్,, డిప్యూటీ ఎడ్యుకేట్ ఇంజనీర్ పంచాయత్ రాజ్, ఏఈ, ఎంపీడీవో, ఎంపీ ఓ, ఏపీవో, ఈసీ, టి ఏ లు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు వెంటనే మంజూరు

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్లకు బిల్లుల చెల్లింపు లో జప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. కొండాపూర్ మండలంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను గురువారం కలెక్టర్ పి. ప్రావీణ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు మంజూరు చేయడం జరిగింది. అందులో ఎన్ని నిర్మాణాలలో ఉన్నాయో, ఎన్ని స్లాబ్ లెవల్‌లో ఉన్నాయి. ఎన్ని బేస్మెంట్ లెవల్ ఉన్నాయ అని ఎంపీడీఓ వేణుగోపాల్ ను అడిగి తెలుసుకున్నారు. బేస్మెంట్ లెవల్, లెంటల్ లెవల్ వరకు పూర్తి అయిన వారికి లబ్ధిదారుల అకౌంట్ లలో డబ్బులు జమ అయ్యాయా అని తెలుసుకున్నారు. ఇంకా ఫోటో కాప్చర్ చేయనవి ఉంటే ఆలస్యం చేయకుండా వెంటనే చేయాలని హౌసింగ్ ఏఈలను ఆదేశించారు. గ్రామంలో ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయి , అవి ఏ ఏ దశల్లో వున్నాయి అని పరిశీలించారు. కార్యక్రమంలో కొండాపూర్ ఎంపీడీవో కె. వేణుగోపాల్, తహసిల్దార్ అశోక్, ఆత్మ కమిటీ చైర్మన్ వై. ప్రభు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి ప్రభుత్వమని, అలాంటి ప్రజా ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ప్రజల బాలు పలికే కేటీఆర్ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ విషయంలో బహిరంగ చర్చకు రావాలని వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి సవాలు విసిరారు. గురువారం క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, సీఎం ఆర్ ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. నేటికీ 12 విడతలలో దాదాపు, రూ. 60,62,79,058 విలువ గల సి.ఎం.ఆర్.ఎఫ్, కల్యాణ లక్ష్మి, షాది ముబారక్, తో పాటు ఎల్. ఓ.సి లను 10,073 మంది లబ్ధిదారులకు అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ స్వలాభం కోసం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం లో కేవలం పేపర్ల పై పనులు చూపించేరే తప్ప నిధులు ఎక్కడ మంజూరు చేయాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదప్రజల అభివృద్దే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కేవలం 22 నెలల పాలనలో వనపర్తి నియోజకవర్గానికి సుమారు 33860 మంది రైతులకు దాదాపు రూ. 253 కోట్లు రుణ మాఫీ చేశామనీ పేర్కొన్నారు. విద్యారంగఅభివృద్ధి కోసం రూ. 50కోట్లు, రూ. 60 కోట్ల నిధులతో సిసి రోడ్లు, డ్రైన్లు నిర్మించుకుంటున్నామని వివరించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టిన, స్థానిక ఎన్నికలలో మళ్ళీ ప్రజలముందుకు వస్తున్నా బీఆర్ఎస్‌ను నమ్మవద్దని, వారిని గెలిపిస్తే కాళ్లకు అడ్డుకర్రలు పెడతారని, ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, నిర్మాణం, వనపర్తి నియోజకవర్గం అభివృద్ధి, విషయంలో బీఆర్ఎస్ పార్టీ గత తొమ్మిదిన్నర పాలన, 22 నెలల కాంగ్రెస్ పాలపై అవాస్తవాలు, ప్రచారం చేయడం మానుకోవాలని, దమ్ముంటే, బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పటిన గ్రూప్ వన్ నియామకాలపై నిరాధారమైన ఆరోపణలు చేసిన ఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై కేసు నమోదు చేసేలా జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయాలనీ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి



వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షులు శ్రీలత,, మాజీ జిల్లా అధ్యక్షులు పిసిసి సభ్యులు శంకర్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణం, వనపర్తి మండలం పెద్దమందడి, ఖిల్లా గణపురం, పెబ్బేరు, శ్రీరంగాపురం, రేవల్లి, గోపాల్ పేట, ఏదుల, మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలి



**శివ్వంపేట, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అన్ని గ్రామాల్లో చెందిన పంచాయతీ పారిశుధ్య కార్మికులు గురువారం మండల కేంద్రం శివంపేట ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి మహేందర్ రెడ్డి మద్దతు ప్రకటించి, మాట్లాడారు. మండల వ్యాప్తంగా వందమందికిపైగా గ్రామపంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారని వీరిలో అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ వారే ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన పండుగ దసరా అని వేతనాలు పెండింగ్లో ఉండడం వలన దసరా పండుగను జరుపుకోలేని పరిస్థితిలో గ్రామపంచాయతీ కార్మికులు ఉన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప కనీసం గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించలేని దుస్థితి లో ఉందని ఆయన అన్నారు. వెంటనే పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో అన్ని గ్రామాలలో విధులను బహిష్కరిస్తామని ఆయన హెచ్చరించారు. ధర్నానంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ మండల కార్యదర్శి శంకర్, బాలకృష్ణ, స్వామి, భిక్షపతి, నర్సింలు, పద్మ, శ్రీకాంత్, ఆగమయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## వీరన్నపేటలో జోరుగా అక్రమ మట్టి దందా..

- చెలరేగిపోతున్న మట్టి మాఫియా పట్టించుకోని అధికారులు

**చేర్యాల, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** చేర్యాల మండలం వీరన్నపేటలో గత కొన్ని సంవత్సరాలుగా అక్రమ మట్టి దందా సజావుగా సాగుతుంది. ఎంతో పురాతనమైన ఏనేలు(గుట్టలు) సొలమైల్ గ్రామం నుండి వీరన్నపేట మీదుగా చుంచకోట గ్రామం వరకు భారీగా మోహరించిన ఉన్నాయి. ఈ మధ్యనే పురాతన శాస్త్రవేత్తలు ఈ ఏనేగుట్టలను పరిశీలించి వీటిపై అనేక పూర్వికుల, ఆది మానవుల ఆనవాళ్లు ఆన్నట్టు గుర్తించారు. వీరన్నపేటలో కొందరు వారి స్వార్థం కోసం ఏనేల గుట్ట కింది భాగంలో దాదాపు ఒక కిలోమీటరు మేరకు మట్టిని తొడటం జరిగింది. వీరిపై గతంలో పై అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆగిన మట్టి దందా ఈ మధ్య ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడంతో మళ్ళీ మొదలైంది. ఈ మట్టి దందా వలన ఏనే రాళ్ళు కింద పడే అవకాశంతోపాటు, పురాతనమైన గుర్తులు చెదిరిపోనున్నాయి. ఏలాంటి కాలంలోనైనా పచ్చటి చెట్లతో కనిపించే అందమైన పకృతిని కొందరి స్వార్థ ప్రయోజనాలకు, డబ్బు ఆశకు బలవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి దందాను అరికట్టలని గ్రామస్తులు కోరుతున్నారు.



## పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

- స్టేట్ సెక్రటరీ జనరల్ చంద్రశేఖర్



**జోగిపేట, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని విశ్రాంత ఉద్యోగుల సంఘం స్టేట్ సెక్రటరీ చంద్రశేఖర్ అన్నారు. జోగిపేట పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనం ఆవరణలో గురువారం నాడు జోగిపేట అందోల్ మండల్ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమావేశం జరిగింది. ఈ లిసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం దష్టికి వెళ్లేలా సంఘటితంగా ఉద్యమిస్తామని తెలిపారు పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు ముఖ్యంగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం పింఛన్ రివిజన్లకు సంబంధించి పెండింగ్ కేసులు హెల్త్ కార్డుల సరైన అమలు లేకపోవడం డీఏ పెండింగ్ చెల్లింపులు, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు తక్షణమే కుటుంబ పెన్షన్ మంజూరు చేయాలన్న డిమాండ్లు ప్రాధాన్యతగా ఉన్నాయని వివరించారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా యం బసవేశ్వర్, పరిశీలకులుగా బి. మురళీధర్ వ్యవహరించారు 2025-2028 నకు నూతనంగా అధ్యక్షులుగా బి. ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా యం మనోహర్ ప్రసాద్ , కోశాధికారిగా యం శంకరప్ప, అసోసియట్ అధ్యక్షులుగా పి. రాధాకృష్ణ గౌడ్, ఉపాధ్యక్షులుగా టి రాజయ్య, మహిళా ఉపాధ్యక్షురాలుగా జి. గాయత్రి, సహాయ కార్యదర్శిగా కె. సదశివ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి. హీరాలాల్, పబ్లిసిటీ సెక్రటరీగా సిహెచ్. వీరేశం, జిల్లా ఆర్గనైజర్లుగా టి. పాండురంగం, ఏ. అంజయ్య, నామినేటెడ్ సహాయ కార్యదర్శిగా బి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా యం శంకర్ సలహాదారులుగా వై. దుర్గారాం, పి శ్రీరాములు, యం, వెంకటేశం, డి. భూమయ్య, బి. సత్యనారాయణ, బి. నాగారత్నం, టి. నర్సింహా గౌడ్, బి. మనోహర్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, జి. శ్రీరాములు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కొత్తగా ఎంపికైన కార్యవర్గసభ్యులు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారించడంతో పాటు వారి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో జోగిపేట అందోల్ మండల్ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువత యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా పని చేయాలి

- డ్రగ్స్ రహిత జిల్లాను నిర్మిద్దాం
- ఎస్పీ, ఎమ్మెల్యే పిలుపు

**నారాయణపేట బ్యూరో, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** నేటి యువత గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వాడకాన్ని పూర్తిగా నిర్మూలించి భావితరాలకు బంగారు బాటలు వేసేందుకు యాంటీ డ్రగ్స్ సోల్జర్స్‌గా పనిచేయాలని, నారాయణపేట జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి లు పిలుపు నిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం విద్యార్థి సేన ఆర్గనైజే షన్ ఆధ్వర్యంలో విద్యార్థు లతో విద్యార్థి మహా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల బారిన పడితే మీ భవిష్యత్తు అంధకారం అవు తుందని, ఈ అలవాటు వ్యక్తి గత ఆరోగ్యం మాత్రమే కాదు కుటుంబం, సమాజం మొత్తా న్ని దెబ్బతీస్తుందని అన్నా రు. యువత భవిష్యత్తు



కోసం అందరం కలిసికట్టుగా పోరా డాలని పోలీస్ విభాగం మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టడంలో కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. తల్లి దండ్రుల తమ పిల్లల ప్రవర్త నను గమనిస్తూ వారిలో అవగాహన కల్పించాలని పిలుపు నిచ్చారు. ఎవరైనా డ్రగ్స్ బారి న పడిన, రవాణా చేస్తున్న, అమ్మిన అట్టి వ్యక్తుల సమా చారం లోకల్ పోలీసులకు లేదా డయల్ 100కి లేదా 1908 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. డ్రగ్స్ గంజాయి వంటి వాటికి దూరంగా ఉండి నారాయణ పేట జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ఎస్పీ కోరారు. ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ పై కఠినంగా పనిచేస్తుందని, చట్టపరమైన చర్యలతో పాటు ప్రజల్లో చైతన్యం కలిగించ డమే ముఖ్య లక్ష్యం అని అన్నారు. ఇలాంటి విద్యార్థి ర్యాలీలు సమాజంలో మార్పు తీసుకొస్తాయని పేర్కొన్నారు. గంజాయి డ్రగ్స్ వంటి మాద కద్రవ్యాలకు దూరంగా ఉండా లని, ఇది కేవలం ఆరోగ్యాన్ని మాత్రమే కాదు మీ కుటుంబా న్ని మీ కలలను కూడా నాశ నం చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మాదకద్ర వ్యాలకు దూరంగా ఉండి డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కొరకు అందరు పాటుపడాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ డ్రగ్స్ ఫ్రీ అవగాహన కోసం విద్యార్థులు డ్రగ్స్ మానుకోవడంపై రూపొందించిన పోస్టర్లు ప్లకార్డులు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ శివ శంకర్, ఎక్సైజ్ సీఐ అనంత య్య, ఎస్ఐ రాముడు, ఎక్సైజ్ ఎస్ఐలు స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థి సేన ఆర్గనైజేషన్ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సామర్థ్యాన్ని వెలికితీయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** విద్యార్థుల సామర్థ్యాన్ని వెలికి తీయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మెదక్ మండలంలోని మంబోజి పల్లి లో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో ఉన్న పరిసరాలను, వంటశాలను, వాటర్ సౌకర్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్న అనేక రకాల శక్తి సామర్థ్యాలను వెలికి తీసి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు అంతా విద్యార్థుల చేతుల్లో ఉందని వారిని సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అని అన్నారు. విద్యార్థులతో సరదాగా ముచ్చటించి పలు ప్రశ్నలను అడిగారు వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ మోడల్ హౌజ్‌ను నాణ్యతతో పూర్తిచేయాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఇందిరమ్మ మోడల్ హౌస్‌ని పరిశీలించిన కలెక్టర్



**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** ఇందిరమ్మ మోడల్ హౌస్ ను నిబంధనల మేరకు నాణ్యతతో త్వరితంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. గురువారం వరంగల్ జిల్లా దుగ్గొండి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ మోడల్ హౌస్ ఎంత విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు, సెట్ బ్యాక్ ఎంత పెట్టారు, ఉపయోగించే మెటీరియల్, క్యూరింగ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే నిధులతో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు ఏ విధంగా ఉంటుందో మోడల్ హౌస్ ఉండేలా నిర్మాణం పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని ఎనిమిది మండల కేంద్రాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ మాడల్ హౌస్ పురోగ దశలో ఉన్నాయని, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

అనంతరం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని తహసిల్దార్ ఎంపీడీవో కార్యాలయాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాల్లో సిబ్బంది హాజరు, ఇతర రికార్డులు, రిజిస్టర్ లను పరిశీలించారు. ఉద్యోగుల హాజరు బయోమెట్రిక్ ప్రకారం తప్పకుండా జరగాలన్నారు. బయోమెట్రిక్ హాజరు ప్రకారం విధులకు ఆలస్యంగా హాజరైన డిప్యూటీ తహసీల్దార్, ఆపరేటర్లకు షో కాజ్ నోటీసులు జారీ చేయాలని తహసిల్దారును ఆదేశించారు. కార్యక్రమాల్లో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ అధికారి గణపతి, తహసిల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీవో అరుంధతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కక్షలు కాదు.. అభివృద్ధి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి..
- నిధులు మళ్లించడంపై ధర్నా..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** కక్షపూరిత మైన పాలన కాకుండా, కొత్తగా నిధులు మంజూరు చేయించి భూపాలపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కక్ష పూరితంగా నిధులను మళ్లించాడని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీ బస్ స్టాండ్ సమీప సెంటర్లో నిరసన, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి హాజరై మాట్లాడుతూ గత బిఆర్ఎస్ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు భూపాలపల్లి పట్టణ అభివృద్ధి కోసం అంబేద్కర్ చౌరస్తా నుండి 2 ఇంక్లైన్, ఓపెన్ కాస్ట్ వరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులకు గాను టియుఎఫ్ ఐడిసి నిధుల నుండి రూ.6 కోట్లు, సిఎస్ఆర్ నిధుల నుండి రూ.4 కోట్ల రూపాయలు మంజూరు చేయించి, శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఆ పనులను యధావిధిగా చేయించి, అభివృద్ధికి పాటు పడాల్సిన ప్రస్తుత అధికార, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే సిఎస్ఆర్ నిధులు రూ.4 కోట్లను తన సొంత మండలాలకి తరలించడం జరిగిందన్నారు. కక్ష పూరితంగా పట్టణ అభివృద్ధిని అడ్డుకుని ప్రజావ్యతిరేక పాలన చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే తీరుకు నిరసనగా ధర్నా కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. వచ్చే పదిహేను రోజుల్లో మళ్లించిన నిధులను తిరిగి పట్టణ అభివృద్ధికి మళ్లించాలని, లేనట్లయితే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ లీడర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని వదిలేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ లీడర్లు కటకం జనార్ధన్, సెగ్గం సిద్ధు, మాడ హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే డ్యాన్స్

- లంబాడ సంప్రదాయాలకు ప్రతీక తీజ్ అంటూ కితాబు..
- పెద్దకుంటపల్లిలో ఘనంగా తీజ్ వేడుకలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు డ్యాన్స్ చేసి, అందరిలో ఉత్సాహం నింపారు. లంబాడీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ అని ఆయన కితాబిచ్చారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పెద్దకుంటపల్లి(11వ వార్డు)లో గురువారం తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డిజే పాటలతో లంబాడ మహిళలు, యువతులు డ్యాన్సులు చేస్తూ అలరించారు. ఈ లంబాడీల తీజ్ వేడుకలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు, పెళ్లికాని యువతులు సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. అనంతరం డీజే పాటలకు యువతులతో కలిసి ఎమ్మెల్యే స్టెప్పులేసి సందడి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ తీజ్ పండుగలో పెళ్లికాని యువతులు ఆట పాటలతో ఆనందంగా పాల్గొనడం మన ఆచారాలు, విలువలను భావితరాలకు తీసుకువెళ్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం లంబాడీ కులస్తుల అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, లంబాడీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. తీజ్ వంటి పండుగలు సామాజిక ఐక్యతకు, సాంస్కృతిక పరిరక్షణకు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లంబాడ కుల పెద్దలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# కేజీబీవీ అక్రమ బియ్యం రవాణాపై అధికారుల విచారణ

- ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షిస్తాం
- డిసిడిఓ విజయ కుమారి, ఎంఈఓ రవికుమార్



**గూడూరు, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** అక్రమంగా కేజీబీవీ పాఠశాల బియ్యాన్ని ఇంట్లో నిలువచేసిన సంఘటన గూడూరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో గురువారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బ్రాహ్మణపల్లి శివారు ఉప్పల్ తండా కు గురువారం కొత్తగూడ గౌడన్ నుండి 70 బస్తాల బియ్యం ట్రాక్టర్లో పాఠశాలకు రాగా అందులో కేవలం 60 బస్తాలను పాఠశాలలో దింపి మిగతా పది బస్తాలను దగ్గరలో ఉన్న ఓ ఇంటిలో నిలువ చేశారు.అయితే పక్క సమాచారంతో పోలీసులు,రెవెన్యూ అధికారులు పట్టుకొని పది బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా దీనిపై ఉన్న అధికారులు వివరణ కోరగా కేజీబీవీపీ పాఠశాలను సందర్శించి డిసిడిఓ విజయ్ కుమారి,ఎంఈఓ రవికుమార్ విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా ప్రతి ఒక్కరి స్టేట్మెంట్ తీసుకొని సదర్ రిపోర్టు అధికారులకు అందజేస్తామని అన్నారు.ఈ ఘటనలో బాతులైన వారు ఎవరైనా సరే కఠినంగా శిక్షిస్తామని రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీ పాఠశాలలకు అదేవిధంగా రేషన్ షాపుల నుండి వచ్చి బియ్యాన్ని ఎక్కడైనా అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. అదేవిధంగా జిల్లా సివిల్ సప్లై రెవెన్యూ విద్యాశాఖ అధికారులు గురువారం బ్రాహ్మణపల్లి కేజీబీవీలో అక్రమ బియ్యం సరఫరా పై విచారణ చేపట్టారు.

# ఫారెస్ట్ చెక్ పోస్టు పక్కనే అక్రమ కలప పట్టివేత

- 84 వేల విలువైన అక్రమ టేకు కలప పట్టుకున్న అటవీ శాఖ అధికారులు



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** అది జిల్లా కేంద్రానికి అతి దగ్గరలో కేవలం కొన్ని కిలో మీటర్ల దూరంలో ఉన్న అటవీ శాఖ చెక్ పోస్టు. ఆ ప్రాంతంలో నిత్యం అటవీ శాఖ అధికారులు తమ విధుల్ని పర్య వేక్షిస్తూ ఉంటారు. అటువంటిది ఎవరికీ భయపడకుండా చెక్ పోస్టుకు అతి సమీపంలో ఓ వ్యక్తి విలువైన టేకు కలప సైజులను ఓ ఇంటి నిర్మాణం కోసం పనులు చేయిస్తుండగా సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే అక్కడికి వెళ్లి ఆ దుంగలను స్వాదీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే తలమడుగు మండలంలోని దేవాపూర్ గ్రామ శివారు దారిలో ఉన్న యం యస్ గార్డెన్ లో అక్రమంగా టేకు కలప దుంగలు ఉన్నట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది.వెంటనే టాస్క్ పోర్స్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అక్కడికి వెళ్లి సిబ్బంది తనిఖీ చేయగా సుమారు 84 వేల వెలువైన టేకు కలపను స్వాదీనం చేసుకున్నారు. వాటిని జప్తు చేసుకుని మొహమ్మద్ మూసా, లక్షణ్ పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు అదికారులు తెలిపారు.తనిఖీ చేసిన వారిలో ఎఫ్ఆర్‌వో గులాబ్ సింగ్, డిప్యూటీ ఆర్వో కవిత, అమర్ సింగ్, ఎఫ్ఎస్‌వో గులాబ్, అహ్మద్, బీట్ అధికారులు క్రిష్ణ నాయక్, సజన్ లాల్, శ్యాంసుందర్, అర్జున్ నాయక్, రాధిక ఇతర సిబ్బంది పాల్గొన్నారని ఎఫ్ఆర్వో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# బాలల సంరక్షణ కేంద్రాలు కనీస ప్రమాణాలు పాటించాలి

- అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి
- 20 నుంచి బాలల సంరక్షణ కేంద్రాల తనిఖీ



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :** జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలు (చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్) కనీస ప్రమాణాలు పాటించాలనీ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఏ వెంకట రెడ్డి అన్నారు, గురువారం రోజున కలెక్టరెట్ మినీకాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఇన్స్పెక్షన్ కమిటీ, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులతో సమన్వయ,సమీక్షా సమావేశం జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి అధ్యక్షత జరిగింది, ఈ సందర్భంగా హాజరైన అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు ఆశ్రయం పొందుచున్న బాల బాలికలకు వసతి, భోజనం, విద్యా, వైద్యంతో పాటు సరైన వసతులు కల్పించాలని, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోబోయే చర్యల గురించి వివిధ శాఖల టోల్ ఫ్రీ నంబర్లను డిస్ప్లే చేయాలని సూచించారు. సెప్టెంబర్ 20 నుండి 26 వరకు వరకు జిల్లాలోని ప్రభుత్వ మరియు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను అదనపు కలెక్టర్ తో పాటు మరో ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో తనిఖీ చేయనున్నట్లు తెలియచేసారు.ఈ లోగా ఆయా సంస్థలు, కొత్తగా ఏర్పాటు చేయబోయే సంస్థలకు వారి కనీస ప్రమాణాలు సంతృప్తికరంగా ఉండాలని, లేనిచో ఇన్స్పెక్షన్ కమిటీ ఇచ్చే నివేదిక ప్రాతిపదికపై తదుపరి చర్యలు ఉంటాయని అన్నారు. సంస్థలకు సంబంధించిన భవనాల ఫిట్నెస్,వాటర్ ప్యూరిఫికేశన్,శానిటేషన్ సర్టిఫికెట్స్ సంబంధిత శాఖల నుండి తీసుకొనుటకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు, జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి మాట్లాడుతూ సీజన్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని హెల్త్ ప్రొఫైల్స్ కు సంబంధించిన ఫార్మాట్ ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో రూపొందించిన అన్ని సంస్థలు ఒకే విధంగా హెల్త్ ప్రొఫైల్స్ నిర్వహించుటకు సులువుగా ఉండే విధంగా తగు చర్యలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖల సూచనలతో రూపొందిం చుకోవాలని అందుబాటులో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంబంధిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి బాలల సంరక్షణ కోసం చర్యలు తీసుకావాలని అన్నారు. అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ మదన్ మోహన్ రావు మాట్లాడుతూ స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల అధికారులకు సమాచారం అందించి బాలల సంరక్షణ కేంద్రాల బాల బాలికలకు హెల్త్ ప్రొఫైల్ నిర్వహించుటకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సీహెచ్ అవంతి, జిల్లా బాలల పరిరక్షణ ఇన్చార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్, డాక్టర్ పరికి సుధాకర్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం మౌనిక, బాల సదనం సూపరింటెండెంట్ కళ్యాణి, శిశు గృహ ఇన్చార్జి మేనేజర్ ఏ మాధవి, జిల్లా ఇన్స్పెక్షన్ కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, సంగి చైతన్య విజయ్ కుమార్, సుజాత, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# రైతులతో ఆదివాసీ నవనిర్మాణ సేన రాస్తారోకో

- రైతులు చనిపోతే కేటీఆర్ కు కన్నీళ్లు ఎందుకు రాలేదు : ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి
- కలెక్టర్ జోలికి వస్తే బీఆర్ఎస్‌ను ఏజెన్సీ లో రెడ్ బుక్ లో పెడతామని హెచ్చరిక
- కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం.. కలెక్టర్ చిత్ర పటానికి పాలాభిషేకం..



**నూగూర్ వెంకటాపురం సెప్టెంబర్ 18(జనం సాక్షి):** బహుళ జాతి మొక్కజొన్న విత్తన కంపెనీల చేత మోస పోయి నష్టపోయిన రైతులకు ఐదు కోట్ల రూపాయలు నష్టపరిహారం ఇప్పిస్తే కలెక్టర్ ని పింక్ బుక్ లో పెడతావా అని కేటీఆర్ పైన ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసారు. ఏజెన్సీ ఆదివాసీ రైతులకు, ప్రజలకు న్యాయం చేసే అధికారుల పైన ఇలాంటి దుర్మార్గపు పనులకు ఒడి కడతారా.. అధికారం పోయినా మార్పు రాలేదా అని కొర్స నర్సింహా మూర్తి విమర్శించారు. కలెక్టర్ పైన అనుషిత వ్యాఖ్యలు చేసిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కల్వకుంట్ల కే టి ఆర్, గుదవర్తి నర్సింహా మూర్తి కి వ్యతిరేకం గా గురువారం ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో వెంకటాపురం మండల కేంద్రంలో రైతులు, ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించి, గంట సేపు రోడ్డు పై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. రాజకీయ విమర్శలు అధికార ప్రతిపక్ష పార్టీల పైన చేసుకోండి మాకేం ఇబ్బంది లేదన్నారు. కానీ చేసే దివాకరా టి ఎస్ లాంటి అధికారుల పైన కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సూచించారు. ప్రజలు అధికారం ఇస్తే అధికారుల పైన కక్ష కట్టడం దిక్కుమాలిన చర్య అన్నారు. బహుళ జాతి విత్తనోత్పత్తి కంపెనీలను అడ్డ పెట్టుకొని ఏజెన్సీ రైతులను ఆర్థికంగా దోపిడి చేస్తూ కోట్ల రూపాయలు సంపాదించి రైతుల ఆత్మహత్యలకు కారణం అయిన దళారీ మాటలు మీకు కన్నీళ్లు తెప్పించాయా అని బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కే టి ఆర్ పైన కొర్స నర్సింహా మూర్తి మండిపడ్డారు. బహుళజాతి కంపెనీల మోసాలకు గురై ఆత్మహత్యలకు పాల్పడ్డ ఆదివాసీ రైతుల విషయం లో మీకు ఎందుకు కన్నీళ్లు రాలేదని ఆయన బిఆర్ పార్టీని, కే టి ఆర్ ని నిలదీశారు. గుదవర్తి నర్సిం మూర్తి ఏజెన్సీ రైతులను కోట్ల రూపాయలకు ముంచినందుకు కే టి ఆర్ అతని ముందు శిరస్సు వంచి నమస్కరించారా ప్రశ్నించారు. బాధ్యతా యుతమైన ప్రతిపక్ష పార్టీ హోదాలో ఉండి ప్రజల పక్షాన నిజాయితీగా పని చేసిన ములుగు జిల్లా కలెక్టర్ దివాకరా టి ఎస్ పై ఇలాంటి దుర్మార్గమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన హితువు పలికారు. జిల్లా కలెక్టర్ ప్రజల పక్షాన నిలబడే వ్యక్తి అని తెలియజేసారు. ఆదివాసీ గూడెల్లో పాఠశాలలు, వైద్య సదుపాయం లేకపోతె కంటైనర్ పాఠశాలలు, కంటైనర్ హెల్త్ సెంటర్స్ ఏర్పాటు చేసి విద్యా వైద్య సదుపాయాలు అందిస్తున్న కలెక్టర్ ని ఏదైనా చేయాలనీ చుస్తే ప్రజలు మరోసారి స్థానిక ఎన్నికల్లో బుద్ది చెప్తారని అన్నారు. ప్రజలు ఓడించినా ఇంకా మీకు బుద్ధి రాలేదా అని ఏద్దేవా చేసారు.

# స్టూడెంట్స్ కు సౌకర్యాల కల్పనపై అధికారులు బాధ్యతగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** స్టూడెంట్స్ కు విద్య, తగిన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ రాహుల్ శర్మ చెప్పారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలలో మంచినీరు, విద్యుత్తు, మరుగుదొడ్ల మరమ్మతులు వంటి మౌలిక సదుపాయాల ఏర్పాటుపై పంచాయతీరాజ్, విద్యా, మహిళా సంక్షేమ, డిఆర్డీఓ, గిరిజన, టిజి డబ్ల్యూఐడిసి ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు సమయానికి సమర్పిస్తే నిధులు మంజూరు సులభమవుతుందని తెలిపారు. అందరికీ విద్య అందాలంటే పాఠశాలల్లో మంచి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. విద్యార్థులకు అనువైన వాతావరణం కల్పించడంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలకు ప్రాధాన్యతనిస్తూ మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన ప్రతిపాదనలు సమయానికి సమర్పించాలన్నారు. పాఠశాలలు, అంగన్ వాడి కేంద్రాల్లో నూరు శాతం విద్యుత్తు, మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, మహిళా సంక్షేమ అధికారి మల్లీశ్వరి, డిఆర్డీఓ బాలకృష్ణ, డిపిఓ శ్రీలత, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ రామకృష్ణ, పీఆర్ డిఈ లు సాయిలు, రవికుమార్, టిజి డబ్ల్యూ ఐడిఓసి డిఈ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో డాక్టర్ చంద్రమోహన్



**నడికూడ, సెప్టెంబర్ 18 (జనం సాక్షి):** హనుమకొండ జిల్లా నడికూడ మండలం కౌకొండ గ్రామానికి చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ మేకల చంద్రమోహన్ కు అరుదైన గౌరవం దక్కింది. హృదయ ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జేబీ ఫార్మా ఆధ్వర్యంలో నిర్వహించిన విశేష కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నుండి సర్టిఫికెట్ ఆఫ్ పార్టిసిపేషన్ లభించింది.ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వందలాది మంది వైద్యులు పాల్గొన్నారు. 'మాక్సిమం నెంబర్ ఆఫ్ డాక్టర్స్ టేకింగ్ @ ప్లేడ్జ్ ఫర్ గుడ్ హెల్త్ విభాగంలో రికార్డు సృష్టించడానికి డాక్టర్ చంద్రమోహన్ తన సేవలతో సహకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హృదయ ఆరోగ్య రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. సక్రమమైన ఆహారం, వ్యాయామం, ఒత్తిడి నియంత్రణతోపాటు క్రమం తప్పని వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా గుండె సంబంధిత వ్యాధులను నివారించవచ్చు" అని తెలిపారు. స్థానికంగా ప్రజల ఆరోగ్యంపై కృషి చేస్తూ, వైద్య సేవలను అందిస్తున్న డాక్టర్ చంద్రమోహన్ ఈ అవార్డు అందుకోవడంతో గ్రామస్తులు, సహచరులు ఆనందం వ్యక్తం చేశారు. ఆయనను పలువురు ప్రజా ప్రతినిధులు, వైద్యులు, విద్యార్థులు అభినందించారు. ఈ గౌరవం కౌకొండ గ్రామానికి ప్రతిష్టను తీసుకురావడమే కాకుండా, యువ వైద్యులకు ప్రేరణగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. డాక్టర్ మేకల చంద్రమోహన్ కేవలం వైద్య సేవలకే పరిమితం కాకుండా, హెల్త్ అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాల ద్వారా సమాజానికి చేయూతనిస్తున్నారు. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు ఆయన కృషికి వచ్చిన గౌరవమని చెప్పవచ్చు.



# గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

- ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు

**నల్లబెల్లి, సెప్టెంబర్ 19 (జనంసాక్షి):** మండలంలోని నందిగామ, రేలకుంట గ్రామాలలోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్, స్థానిక పోలీసులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 45 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని, 1900 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేశారు. ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వరంగల్ రూరల్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్డెంట్ మురళీధర్ తెలిపారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా డిప్యూటీ కమిషనర్ అంజన్న రావు ఆదేశాల మేరకు నాటు సారా నియంత్రణకై స్పెషల్ డ్రైవ్ లో భాగంగా దాడులు నిర్వహించినట్లు చెప్పారు. గుడుంబా తయారుచేసిన, విక్రయించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడులలో వరంగల్ జిల్లా ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్డెంట్ శ్రీనివాస్ రెడ్డి, నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేష్ రెడ్డి, వరంగల్ రూరల్ టాస్క్ ఫోర్స్ సీఐ రమేష్ చందర్, ఎన్ఫోర్స్మెంట్ సీఐ నాగయ్య, ఎస్సైలు రమ, శిరీష, నల్లబెల్లి ఎస్సై గోవర్ధన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్కింగ్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలి



మునుగోడు, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా బుధవారం రోజున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి, ఆధ్వర్యములో రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్ రెడ్డి, నూతనంగా ఎన్నికైన పిఆర్టియు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ లు కలిసి వర్కింగ్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలని,సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు వెంటనే సిపీఎస్ ను రద్దు చేసే ఉత్తర్వులు ఇవ్వాలని సెక్రటేరియట్ లో రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ సుమారు 14 సంవత్సరాలు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి ప్రత్యేక జిల్లా వరకు జిల్లా అధ్యక్షుడుగా పని చేసి ఉపాధ్యాయుల కోసం ఎన్నో ఉద్యమాలు నడిపి,వేలాది మంది హృదయాలలో చెరగని ముద్ర వేసుకొని మొన్న జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి సుంకరి బిక్షం గౌడనీ,అదే విధంగా తను పని చేస్తున్న పాఠశాల మునుగోడు లో సుమారు 90 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 210 వరకు విద్యార్థులను పెంచి ప్రశంసలు పొందిన వ్యక్తి అని,రాష్ట్ర పిఆర్టియు ప్రధాన కార్యదర్శిగా గా ఏకగ్రీవంగా ఎన్నిక అయినందుకు మునుగోడు లోని పిఆర్టియు అధ్యక్ష కార్యదర్శులు యూసఫ్ పాషా,మేకల అన్నేపు రెడ్డి,జిల్లా రాష్ట్ర బాధ్యులతో పాటు ప్రతి ఉపాధ్యాయుడు హర్షం వ్యక్తం చేశారని అన్నారు.

# చిన్నమండవలో జోరుగా అక్రమ ఇసుక రవాణా..

- ఇసుకాసురుడు రోజుకు 4 నుండి 5 లక్షల వసూళ్లు
- మూడు ట్రాక్టర్లు ఆరు ఇసుక లోడ్‌లుగా
- కొనసాగుతున్న ఇసుకాసురుడు దందా
- అధికారుల నిర్లక్ష్యం, అక్రమార్కులకు వరం

చింతకాని, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) : ఖమ్మం జిల్లా ప్రధాన కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న చింతకాని మండలం చిన్నమండవ గ్రామం ఇసుక అక్రమ రవాణాకు అడ్డాగా మారింది. మున్నేరు పరీవాహక ప్రాంతంలో ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఈ దందా మూడు ట్రాక్టర్లు ఆరు ఇసుక లోడ్లుగా కొనసాగుతోంది. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ, రోజుకు లక్షల్లో సంపాదిస్తున్న అక్రమార్కులను అడ్డుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

### దొంగ సర్వే నంబర్లతో దందా..

పదిహేను మందితో కూడిన ఒక ముఠా, దొంగ సర్వే నంబర్లను సృష్టించి ఈ దందాను నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టా భూముల పేరుతో ఏర్పాటు చేసిన ర్యాంపుల నుంచి రోజుకు వందలాది ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఈ అక్రమ రవాణా వల్ల ప్రభుత్వానికి భారీగా ఆదాయం కోల్పోవడమే కాకుండా, ఇసుక తవ్వకాల్లో ఎలాంటి నియమ నిబంధనలు పాటించకపోవడం వల్ల పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతోంది.

### అధికారుల సహకారంపై ఆరోపణలు..

ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాల్సిన అధికారులే ఇసుక మాఫియాకు సహకరిస్తున్నారని, వారి కనుసన్నల్లోనే ఈ అక్రమ వ్యాపారం జరుగుతోందని పుకార్లు షికారు చేస్తున్నాయి. ఈ దందా ఆపాల్సిన అధికారులకు భారీగా ముడుపులు అందుతుండటం వల్ల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందని ప్రజలు పేర్కొంటున్నారు. కొంతమంది చిన్న నాయకులు, బినామీల పేరు మీద ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ప్రశ్నించిన వారికి బెదిరింపులు, దాడులు..

ఈ అక్రమ రవాణాను ప్రశ్నించిన వారికి బెదిరింపులు, దాడులు జరుగుతున్నాయని, దీనివల్ల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

### పాస్‌బుక్‌ల మిస్టరీ

ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఇసుక ర్యాంప్ వద్ద ఉన్న పాస్‌బుక్‌లు ఎక్కడి నుంచి వచ్చాయన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. పట్టా భూమిలో ఇసుక ఉన్నదన్న నిబంధనల ఆధారంగా మాత్రమే అనుమతులు ఇవ్వవలసి ఉండగా, ఇక్కడ ఎలాంటి ప్రభుత్వ ఆమోదం లేకుండానే ఇసుక తరలింపు జరుగుతోంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కూపన్స్ ఇచ్చిన లంకాధిపతికి పైసలు ఇస్తేనే అనుమతి రోజుకు 100ల ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తుండగా, ఒక్కో ట్రాక్టర్ నుంచి 1,000



రూపాయల వసూళ్లు అవుతున్నట్లు సమాచారం. ఈ విధంగా రోజుకు రూ.4లక్షల నుంచి రూ.5లక్షల వరకు దందా సాగుతోందని, నెలకు కోట్లు వసూలవుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు.

### ఉన్నతాధికారుల జోక్యం కోసం ప్రజల విజ్ఞప్తి

ప్రభుత్వానికి ఆదాయానికి గండి కొడుతున్నవారిపై అధికారులు నామమాత్రపు దాడులు చేస్తున్నారని, దీనివల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని, ఇసుక అక్రమ రవాణాకు కొరడా ఝుళిపించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ర్యాంప్ వద్ద ఉన్న పాస్‌బుక్‌లను ఆమోదించిన అధికారులను గుర్తించి, విచారణ జరిపి, సరైన ఆధారాలు లేకపోతే ఆ సర్వే నంబర్లను రద్దు చేసి చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# కేటీఆర్ ముందు నీ ఇంటిని, పార్టీని చక్కబెట్టుకో..!

- కేటీఆర్‌పై మంత్రి పొంగులేటి ఫైర్
- జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో దమ్ముంటే సత్తా చూపించు అని సవాల్

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) : విజన్ ఉందా? నీ నాన్నకు ఉందా తెలుసుకో కేటీఆర్ ... ముందు నీ ఇంటిని, నీ పార్టీని చక్కబెట్టుకో... మూడున్నరేళ్ల తర్వాత వచ్చే ఎన్నికల్లో నువ్వు అమెరికాలో ఉంటావా... ఇండియాలో ఉంటావా అన్నది కూడా రాష్ట్ర ప్రజలకు సందేహమే. దమ్ముంటే రానున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మీ పార్టీ సత్తా చూపించండి" అంటూ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేటీఆర్ కు సవాల్ విసిరారు. గురువారం వరంగల్ క్రాస్ రోడ్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన 80కుటుంబాలకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరగా వారికి మంత్రి స్వయంగా కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు ఎప్పటికీ మరవలేనివని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాటు ప్రజల కలలను ఛిద్రము చేసిందని మండిపడ్డారు. వారి హయంలో "ఒకే ఒక లక్ష ఇళ్లు ప్రతి సంవత్సరం కట్టివుంటే, పది లక్షల పేద కుటుంబాలకు గృహాలు అందేవి. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం లాంటి ప్రాజెక్టుల కమీషన్లలో మునిగిపోయింది. పాము కోరల్లో విషం పెట్టుకున్నట్టే, వీరంతా ఒళ్ళంతా విషం నింపుకుని తిరుగుతున్నారని" ఘాటుగా విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు బీఆర్ఎస్‌కు గట్టి బుద్ధి చెప్తారని, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లోనే ప్రజలు వారిని పక్కన పెట్టేశారని మంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పేదలకు ఇళ్లు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కాంగ్రెస్ పార్టీ వచ్చాక జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీపీసీసీ ప్రధాన



కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, టీపీసీసీ నాయకులు ధరావత్ రామ్మూర్తి నాయక్, బొర్రా రాజశేఖర్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, కళ్ళెం వెంకట్ రెడ్డి, మద్ది మల్లారెడ్డి, బండి జగదీష్, ప్రతాపనేని రఘు, భూక్యా సురేష్ నాయక్, వెంపటి రవి, భుజంగ రెడ్డి, వీరా రెడ్డి, భాస్కర్ నాయక్, ప్రద్యుమ్న చారి, సంగయ్య, వెంకటనారాయణ, తోట వీరభద్రం, కర్లపూడి భద్రకాళి, బానోత్ దివ్య, బానోత్ హరి, తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి జన్మదినం

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం మాజీ ఎంపీ డా.గడ్డం రంజిత్ రెడ్డి పుట్టిన రోజు వేడుక ఘనంగా జరిగింది. గురువారం ఆయన నివాసంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిజెఎంసి మాజీ కార్పొరేటర్ చంద్రశేఖర్ ,16వ వార్డు ఇంచార్జి టింకు రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంతోష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు రాజి రెడ్డి, పి. వెంకట్ రెడ్డి, సంజీవ్ రెడ్డి, లక్ష్మా రెడ్డి, వెంకట్ రెడ్డి, దశరథ్, గౌస్, శివ, అనంతరాజు, గంగన్న, నర్సింహ, నరేష్, అభిషేక్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## రైతు సంక్షేమ నిధికి రూ.2 కోట్ల విరాళం

- అందించిన మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి
- కుటుంబసభ్యులతో కలిసి సీఎం రేవంత్‌కు అందజేత



మిర్యాలగూడ, సెప్టెంబర్ 18 (జనం సాక్షి) : తెలంగాణలోని ప్రతి రైతు ఆనందంగా ఉండాలని అందుకు అనుగుణంగా రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి తన కుమారుడి వివాహ రిసెప్షన్ రద్దు చేసుకొనీ మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రతి రైతుకు ఒక బస్తా యూరియాను ఉచితంగా ఇచ్చేందుకు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రూ.2 కోట్ల చెక్ ను అందజేసారు. రిసెప్షన్ అంగరంగ వైభవంగా చేయాలని దానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ముఖ్యఅతిథిగా తీసుకురావాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అనుకున్నప్పటికీ, తన కుటుంబ సభ్యుల ఆలోచనలతో రిసెప్షన్ రద్దు చేసుకొని ఆ వేడుకకు ఖర్చు అయ్యే రూ. 2 కోట్ల రూపాయలను మిర్యాలగూడ రైతుల సంక్షేమం కోసం వినియోగించాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదులో సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. విస్తృతమైన సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజా ఆదరణ పొంది గెలుపొందిన ఎమ్మెల్యే బిఎల్ఆర్ తన సేవా కార్యక్రమాలను మాత్రం మరువలేదు. ప్రస్తుతం రైతులు యూరియా కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి వారి ఇబ్బందులను తొలగించేందుకు నియోజకవర్గంలోని ప్రతి రైతుకు ఒక యూరియా బస్తా ఉచితంగా అందజేసేందుకు సంకల్పించారు. ఎమ్మెల్యే ఆలోచన విధానాలను పుణికిపుచ్చుకున్న కుమారుడు సాయి ప్రసన్న, కోడలు వెన్నెలలు తమ రిసెప్షన్ ఆడంబరంగా వద్దంటూ, రైతు సంక్షేమం కోసం వినియోగించాలంటూ తెలియజేయడంతో కుటుంబ సభ్యులంతా వారి గొప్ప ఆలోచనకు మద్దతుగా నిలిచారు. ఆ డబ్బును రైతు సంక్షేమం కోసం ఖర్చు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఎమ్మెల్యే బిఎల్ ఆర్ కుటుంబ సభ్యుల ఔదార్యాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, బిఎల్అర్ సతీమణి మాధవి, కుమారుడు బత్తుల సాయి ఈశ్వర్ రెడ్డి లు ఉన్నారు.

# వన సంపదనను ప్రతి ఒక్కరూ కాపాడాలి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

కల్లూరు(సత్తుపల్లి), సెప్టెంబర్ 18 (జనం సాక్షి) : సత్తుపల్లి సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.గురువారం సత్తుపల్లి పట్టణంలోని నీలాద్రి అర్బన్ పార్క్ లో నూతనంగా ఏర్పాటు చేసిన చైన్ లింక్ ఫెన్సింగ్, ఎకోఫ్రెండ్లీ సఫారీ వెహికల్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, సిసిఎఫ్ భీమా నాయక్, జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాటరీ అపరేటెడ్ వెహికల్‌లో కలెక్టర్‌ను ప్రక్కన కూర్చోపెట్టుకొని మంత్రి డైవింగ్ చేస్తూ పార్క్ మొత్తం వీక్షించారు. అనంతరం సత్తుపల్లి ఖమ్మం హైవేప్రధాన రహదారి సమీపాన అటవీశాఖ డివిజన్ కార్యాలయం నందు అటవీ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించి మొక్కను నాటారు. పరేడ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన పోడియంను ప్రారంభించారు. అటవీశాఖ సత్తుపల్లి కార్యాలయంలో నూతనంగా నిర్మించిన మీటింగ్ హాల్ ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. అడవుల సంరక్షణ పర్యవేక్షణ కోసం అటవీ సిబ్బందికి రక్షణ పరికరాలు, మొబైల్ ఫోన్ లను మంత్రి అందజేశారు.

ఈ సందర్భంగా జరిగిన సభలోమంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ సత్తుపల్లి పట్టణ సుందరీకరణ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రజల హృదయాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు చిరస్థాయిలో నిలిచిపోతారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఆయిల్ పామ్ పంట సాగు విస్తరిస్తున్న నేపథ్యంలో కల్లూరు గూడెంలో మరో ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తున్నామని అన్నారు. ఆయిల్ పామ్ పంట ఉత్పత్తి పెరిగేందుకు తెనే టీగలను పెంచాలని అన్నారు. చిన్నపిల్లలు ఆకర్షితులయ్యే విధంగా జంతువులు, ఇతర వసతులను పార్కులో ఏర్పాటు చేయాలని, దీనికి అవసరమైన పూర్తి సహాయ, సహకారం ప్రభుత్వం తరపున అందిస్తామని అన్నారు. మొక్కల పెంపకం ప్రణాళిక ప్రకారం చేయాలని, రోడ్ల విస్తరణ ప్రణాళికలు ఉన్న ప్రదేశాలలో రోడ్లకు కొంత దూరంలో మొక్కలు పెట్టాలని, కరెంట్ తీగలు క్రింద ఎటువంటి మొక్కలు పెట్టాలో ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సత్తుపల్లి ప్రాంతంలో ఓపెన్ కాస్ట్ మైనింగ్ ద్వారా వచ్చే దుష్పరిణామా లను తగ్గించేందుకు వీలుగా అర్బన్ పార్క్ ను వీలైనంత మేరకు ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని, మంత్రివర్యులతో కలిసి నీలాద్రి అర్బన్ పార్క్ లో అభివృద్ధి పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రతి నెలా అటవీ సంరక్షణ కోసం ఎఫ్.పి.సి. కమిటీ సమావేశాలు



నిర్వహించి క్షేత్ర స్థాయిలో ఉత్పన్నమయ్యే చిన్న, చిన్న సమస్యలు ఏర్పాటుకు పరిష్కరించుకోవాలని అన్నారు. అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు ఏసిపి అని శెట్టి రఘు, ఎస్ఎఫ్ఎస్ మంజుల, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు కల్లూరు మార్కెట్ కమిటి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, సత్తుపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోట సుజలా రాణి, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చందర్రావు, సీనియర్ నాయకులు కొత్తూరు ప్రభాకర్ రావు, చల్లగుండ్ల నరసింహారావు, షేక్ కమల్ పాషా, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులే..

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

రామన్నపేట, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) : భూమి, భుక్తి, విముక్తి కోసం వెట్టి చాకిరికి వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులు మాత్రమే అని దీనిని మత ఘర్షణగా సృష్టించే బిజెపి విధానాన్ని ఎండగట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల జిల్లా వ్యాప్త యాత్ర సందర్భంగా మునిపంపుల గ్రామంలో జరిగిన ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధం లేని బీజేపీ తెలంగాణ విమోచన పేరుతో ప్రజల్ని మోసం చేస్తూ హిందూ ముస్లింల గొడవగా సృష్టిస్తూ తప్పుదారి పట్టిస్తూ చరిత్రను వక్రీకరిస్తుందని విమర్శించారు. పటేల్ సైన్యాలు తెలంగాణలో గ్రామాలలో విముక్తి చేశాయని చెబుతున్న బిజెపి నాయకులు నాడు పోరాటంలో 4వేల మంది ప్రాణాలర్పించి, 3000 గ్రామాలను విముక్తి చేసి, 10 లక్షల ఎకరాల భూమిని పంచిన కమ్యూనిస్టుల పోరాటాన్ని ఎందుకు చెప్పడం లేదని అన్నారు. రజాకార్ సైన్యాల చేతిలో 1500 మంది చనిపోతే, పటేల్ సైన్యాల చేతిలో 2500 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు మరణించారని అన్నారు. విష్ణు రామచంద్రారెడ్డి లాంటి దొరలు భూస్వాములు జాగీర్దారులు



నిజాం ప్రభువుకు పెద్ద బంట్లుగా వ్యవహరించే వారని అన్నారు. అరాచక నిజం రాజుని శిక్షించకుండా రాజ్ ప్రముక్‌గా గౌరవించి 1951 సంవత్సరం వరకు పదవిలో కొనసాగించారని అన్నారు.దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, స్వరాజ్యం, షాయబుల్లాఖాన్, బందగీ వంటి యోధులంతా కమ్యూనిస్టులే అని అన్నారు. వారి జీవిత చరిత్రలే తెలంగాణా పోరాటానికి నెత్తుటి సాక్ష్యాలని అన్నారు. సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించే బీజేపీ ని చరిత్ర క్షమించదని అన్నారు. వీరోచిత తెలంగాణా సాయుధ పోరాట స్ఫూర్తితో పాలకులు అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలపై సంఘటితంగా ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు.కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజల్ని మోసం చేస్తున్నాయన్నారు.గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి కనీసం తాత్కాలిక మరమ్మత్తులు కూడా చేసే పరిస్థితి లేక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత రెండు సంవత్సరాల నుండి పంచాయతి ఎన్నికలు జరపక పోవడంతో పారిశుధ్యం, గ్రామ పాలన అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సభ అనంతరం ప్రజానాట్యమండలి కళాకారుల ఆట-పాట ప్రజలను ఆకట్టుకున్నాయి. రాళ్లపల్లి జితేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం,జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి నాగేష్,జంపాల అండాలు, కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు తొలుపునూరి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మేకల కృష్ణయ్య, ప్రజానాట్యమండల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంటెపాక శివకుమార్,ఈర్లపల్లి ముత్యాలు, గ్రామ శాఖ నాయకులు జోగుల శ్రీనివాస్,తొలుపునూరి చంద్రశేఖర్, నోముల రమేష్, బూడిద బిక్షం, జంపాల ఉమాపతి, మేడి భాషయ్య, జోగుల ధనలక్ష్మి, పులిపలుపుల నాగార్జున,ఉంద్రాతి నర్సింహా,గునుగుంట్ల సత్యనారాయణ,అప్పం సురేందర్, శిరీషల యాదగిరి,యాదాసు శారద, హేమలత,బత్తిని సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీవో భవనానికి వెంటనే ప్రతిపాదనలు పంపండి

- నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



తిరుమలగిరి (సాగర్), సెప్టెంబర్ 18 (జనంసాక్షి) : తిరుమలగిరి సాగర్ ఎంపీడీవో భవన నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు పంపాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి , ఇన్చార్జి ఎంపీడీవో భిక్షం రాజును ఆదేశించారు. గురువారం ఆమె మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అన్ని గదులను పరిశీలించిన ఆమె భవనం శిథిలావస్థలో ఉండి ,కార్యకలాపాలు నిర్వహించేందుకు ఏమాత్రం అనువుగా లేదని గుర్తించారు. నూతన మండలం ఏర్పడిన నాటి నుండి ప్యాక్ పాత భవనాన్ని మరమ్మత్తులు చేసి అందులో మండల పరిషత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దీనితోపాటు మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రైవేటు అద్దె భవనాలలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. కార్యాలయాల కోసం ప్రభుత్వాన్ని స్థలం కేటాయించమని నాయకులు, ప్రజలు, అధికారులు పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు. దీనితోపాటు మిగిలిన కార్యాలయాలకు కూడా స్థలాన్ని కేటాయించి నూతన భవనాలను మంజూరు చేయాలని ఈ ప్రాంత ప్రజలు, అధికారులు కోరుతున్నారు.




# ఏథర్ గుడ్‌న్యూస్

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**దేశంలోని ప్రముఖ ఎలక్ట్రిక్ టూ వీలర్ సంస్థ ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ తమ కస్టమర్లకు మంచి కబురు చెప్పింది. దేశవ్యాప్తంగా 500 ఎక్స్ పీరియన్స్ సెంటర్ (ఈసీ)లను అధిగమించింది.ఇది దాని రిటైల్ విస్తరణలో ఒక ప్రధాన మైలురాయిని సూచిస్తుంది. గత మూడు నెలల్లో (జూన్–ఆగస్టు 2025), ఏథర్ 101 కొత్త ఈసీలను జోడించింది."మా వృద్ధి భారతదేశం అంతటా ఎలక్ట్రిక్ మొబిలిటీకి పెరుగుతున్న డిమాండ్‌ను ప్రతిబింబిస్తుంది" అని ఏథర్ ఎనర్జీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రవ్నీత్ సింగ్ ఫోకెలా అన్నారు. "దక్షిణ భారతదేశం మా కంచుకోటగా నిలిచినప్పటికీ, రిజ్టా విజయం టైర్–2, 3 నగరాల్లో మా విస్తరణను వేగవంతం చేసింది" అన్నారు.ఆగ్రా, జబల్పూర్, బిలాస్పూర్, వడోదర, సుందర్గఢ్ వంటి నగరాల్లో ఏథర్ ఇప్పుడు ఈసీలను కలిగి ఉంది. అలాగే కాలికట్, గుంటూరు, హల్ద్వానీ, కోటా వంటి పట్టణాల్లోకి చొచ్చుకుపోయింది. మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఒక్కో చోట 50కి పైగా ఈసీలు ఉన్నాయి. బెంగళూరులో ఏకంగా 18 కేంద్రాలు ఉన్నాయి.దేశవ్యాప్తంగా ఏథర్ మార్కెట్ వాటా 2026 తొలి త్రైమాసికంలో 14.3 శాతానికి పెరిగింది. గత సంవత్సరం ఇది 7.6% ఉండగా రెట్టింపు అయింది. మధ్య భారతదేశంలో వాటా 10.7 శాతానికి పెరిగగా, దక్షిణ భారతదేశంలో 22.8 శాతంతో ఆధిపత్యాన్ని చాటింది.ఏథర్ పోర్ట్ ఫోలియోలో పనితీరు–ఆధారిత 450 సిరీస్, ఫ్యామిలీ–ఫోకస్డ్ రిజ్టా ఉన్నాయి. అథెర్ కమ్యూనిటీ డే 2025లో ఇది తన నెక్స్ట్–జెన్ ఈఎల్ ప్లాట్ ఫామ్, ఏథర్ స్టాక్ 7.0, ఇన్ఫినిట్ క్రూయిజ్, పోథోల్ అలర్ట్స్ వంటి కొత్త ఫీచర్లను ఆవిష్కరించింది.తమిళనాడులోని హొసూర్ లో ఏథర్ రెండు ప్లాంట్ లను నిర్వహిస్తోంది. మహారాష్ట్రలోని బిడ్కిన్ లో మూడవ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తోంది. ఇది మొత్తం సామర్థ్యాన్ని సంవత్సరానికి 1.42 మిలియన్ యూనిట్లకు పెంచుతుంది. భారతదేశం అంతటా ఎలక్ట్రిక్ మొబిలిటీని మరింత అందుబాటులోకి తీసుకురావడం ద్వారా 2026 ఆర్థిక సంవత్సరం నాటికి ఈసీలను 700లకు పైగా పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.



# 25,400 ఎగువకు నిఫ్టీ

- మూడో రోజూ లాభాల్లోనే సూచీలు



**న్యూఢిల్లీ:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడోరోజూ లాభాల్లో ముగిశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించడంతో సూచీలు రాణించాయి.దీనికితోడు ఇటీవల చేపట్టిన జీఎస్టీ సంస్కరణలు, అమెరికా– భారత్ మధ్య వాణిజ్య చర్చలు మదుపర్ల సెంటిమెంట్‌కు కారణమయ్యాయి. ముఖ్యంగా ఫార్మా, హెల్త్‌కేర్ స్టాక్స్‌తో పాటు బ్యాంకింగ్, ఐటీ, ఆటో, ఎఫ్‌ఎంసీజీ షేర్లు రాణించడం సూచీలకు కలిసొచ్చింది. ఈ క్రమం లోనే నిఫ్టీ 25,400 స్థాయిని దాటింది.ఈ ఉదయం 83,108.92 వద్ద (క్రితం ముగింపు 82, 693.71) సెన్సెక్స్ లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,704.92– 83,141 .21 మధ్య కదలాడిన సూచీ.. చివరకు 320. 25 పాయింట్లు లాభంతో 83, 013.96 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 74.90 పాయింట్లు పెరిగి 25,405.15 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 28 పైసలు తగ్గి 88.13 వద్ద ఉంది.ఎటెర్నల్, సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, హెచ్‌డఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లాభపడ్డాయి. టాటా మోటార్స్, ట్రెంట్, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 67.46 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3665.49 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## ఫోన్‌పే, పేటీఎంలో ఇక రెంటు కట్టడం కష్టం!

**- ఆర్బీఐ కొత్త నిబంధనలు**

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**ఫోన్ పే, పేటీఎం లేదా క్రెడ్ వంటి మొబైల్ యాప్‌లలో క్రెడిట్ కార్డు ద్వారా ప్రతి నెలా రెంటు చెల్లించేవారికి ఇకపై కష్టతరం కానుంది. అనేక ఫిన్ టెక్ ప్లాట్‌ఫామ్ లు ఇప్పుడు తమ రెంటు పేమెంట్ సేవలను నిలిపివేశాయి.ఇటీవలి కాలంలో క్రెడిట్ కార్డు ద్వారా అద్దె చెల్లించడం ఒక ప్రసిద్ధ ధోరణిగా మారింది. ఎందుకంటే ఈ చెల్లింపులపై వినియోగదారులకు రివార్డ్ పాయింట్లతోపాటు వడ్డీ లేని క్రెడిట్ వ్యవధిని ఆస్వాదించే అవకాశం కలిగేది. అయితే ఆర్బీఐ తాజా నిబంధనలను అనుసరించి ఈ సౌలభ్యం ఇప్పుడు కనుమరుగవుతోంది.చెల్లింపు సేవలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సెప్టెంబర్ 15న ఒక సర్క్యులర్ జారీ చేసింది. ఈ చర్య ముఖ్యంగా క్రెడిట్ కార్డ్ రివార్డులను సంపాదించడానికి లేదా వారి ఆర్థిక వ్యవహారాలను నిర్వహించడానికి రెంటు చెల్లింపులపై ఆధారపడిన వ్యక్తులను ప్రభావితం చేస్తుంది. వారు ఇప్పుడు ప్రత్యక్ష బ్యాంకు బదిలీలు లేదా చెక్కు చెల్లింపులు వంటి సాంప్రదాయ పద్ధతులకు తిరిగి రావాల్సి ఉంటుంది.సవరించిన మార్గదర్శకాల ప్రకారం.. తమతో ప్రత్యక్ష ఒప్పందాలను కలిగి ఉన్న, పూర్తి కేవైసీ ప్రక్రియను పూర్తి చేసిన వ్యాపారుల లావాదేవీలను మాత్రమే ప్రాసెస్ చేయడానికి పేమెంట్ అగ్రిగేటర్లు , పేమెంట్ గేట్ వేలకు అనుమతి ఉంటుంది. తత్ఫలితంగా, ఈ యాప్‌లు ఇకపై తమ ప్లాట్ ఫామ్ లలో అధికారిక వ్యాపారులుగా నమోదు కాని భూస్వాములకు అద్దె చెల్లింపులను సులభతరం చేయలేవు.ఆర్బీఐ ఇటీవలి చర్యకు ముందే బ్యాంకులు ఇలాంటి లావాదేవీలను పరిమితం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాయి. ఉదాహరణకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, జూన్ 2024 నాటికే క్రెడిట్ కార్డు ద్వారా చేసే అద్దె చెల్లింపులపై 1% వరకు రుసుమును ప్రవేశపెట్టింది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.47 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,01,900 (22 క్యారెట్లు) | ₹ 1,11,170 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,41,000

## 393 బైకులు వెనక్కి!.. డుకాటి కీలక ప్రకటన

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**డ్యూకాటీ తన పానిగేల్ వీ4, స్ట్రీట్‌ఫైటర్ వీ4 బైకులకు రీకాల్ ప్రకటించింది. వెనుక చక్రాల ఇరుసులో లోపం ఉన్నందున డుకాటి ఇండియా ఈ నిర్ణయం తీసుకుంది.ఈ సమస్య భారతదేశంలోని 393 యూనిట్లను ప్రభావితం చేస్తుంది. దీనిని పరిష్కరించడానికి సంస్థ సిద్ధమైంది.భారతదేశంలో 2018 నుంచి 2024 మధ్య తయారైన పానిగేల్ వీ4, 2018 నుంచి 2025 మధ్య తయారైన స్ట్రీట్‌ఫైటర్ వీ4 ఈ రీకాల్ ద్వారా ప్రభావితమయ్యాయి.

## ఒక్కసారే రీఛార్జ్.. ఏడాదంతా ఫ్రీ!

- బెస్ట్ యాన్యువల్ ప్లాన్స్ ఇవే..

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**చాలామంది యూజర్లు మంత్లీ ప్లాన్స్ (28 రోజులు) రీఛార్జ్ చేసుకుంటారు. ఈ ప్యాక్ ధరలు, యాన్యువల్ ప్లాన్‌తో పోలిస్తే కొంత ఎక్కువగా ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని కొంతమంది ఏడాది ప్లాన్స్ రీఛార్జ్ చేసుకుంటున్నారు.ఈ కథనంలో బెస్ట్ యాన్యువల్ రీఛార్జ్ ప్లాన్స్ గురించి తెలుసుకుందాం.

ఎయిర్‌టెల్ తన యూజర్ల కోసం రూ.3599, రూ.2249 ప్లాన్స్ అందిస్తోంది. రూ.3599 రీఛార్జ్ చేసుకుంటే.. రోజుకు 2 జీబీ డేటా, అపరిమిత కాల్స్ వంటివాటితో పాటు.. ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ సబ్‌స్క్రిప్షన్ వంటివి లభిస్తాయి. కాగా రూ.2249 ప్లాన్ ద్వారా 365 రోజుల అపరిమిత కాలింగ్స్.. 30 జీబీ డేటా మాత్రమే లభిస్తుంది. ఇందులో డైలీ డేటా.. ఇతర సబ్‌స్క్రిప్షన్ ఉండవు.




**రిలయన్స్ జియో:**జియో యూజర్లకు రూ.3599, రూ.999, రూ.234, రూ.895 ప్లాన్స్ అందుబాటులో ఉన్నాయి. రూ. 3599 రీఛార్జ్ ప్లాన్ ద్వారా యూజర్లు అపరిమిత కాలింగ్స్ పొందటమే కాకుండా.. రోజుకి 2.5 జీబీ డేటాను వినియోగించుకోవచ్చు. పైగా జియో టీవీ, హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ లభిస్తుంది. రూ.3999 ప్లాన్ ద్వారా అదనంగా జియో ప్యాక్ కోడ్ సబ్‌స్క్రిప్షన్ పొందవచ్చు. అయితే రూ.1234 ద్వారా రీఛార్జ్ చేసుకుంటే.. 336 రోజుల వ్యాలిడిటీతో రోజుకి 0.5 జీబీ డేటా లభిస్తుంది. జియో ఫోన్ ప్రైమా యూజర్లు 336 రోజుల వాలిడిటీ కోసం రూ.895 రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో ప్రతి 28 రోజులకు 2 జీబీ డేటా లభిస్తుంది.

**వోడాఫోన్ ఐడియా:**వోడాఫోన్ ఐడియా విషయానికి వస్తే.. ఇది తన యూజర్ల కోసం రూ. 3599తో రీఛార్జ్ ప్లాన్ అందిస్తుంది. దీని వ్యాలిడిటీ 365 రోజులు. రోజుకి 2జీబీ డేటా లభిస్తుంది. అపరిమిత వాయిస్ కాల్స్ పొందవచ్చు. అంతే కాకుండా ఈ ప్యాక్ రీఛార్జ్ చేసుకుంటే.. రాత్రి 12 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఫ్రీ డేటా పొందవచ్చు. రూ.3799తో రీఛార్జ్ చేస్తే.. అదనంగా ఆమెజాన్ ప్రైమ్ లైట్ సబ్‌స్క్రిప్షన్ కూడా లభిస్తుంది. రోజుకి 1.5 జీబీ చాలనుకుంటే.. రూ.3499తో రీఛార్జ్ చేసుకుంటే సరిపోతుంది. డైలీ డేటా వద్దనుకుంటే.. రూ.1999తో రీఛార్జ్ చేసుకోవచ్చు. ఇందులో ప్యాక్ మొత్తానికి 24 జీబీ డేటా లభిస్తుంది.

**బీఎస్ఎన్ఎల్:**బీఎస్ఎన్ఎల్ విషయానికి.. రూ.2399, రూ.1999, రూ. 1515 అనే ప్లాన్స్ అందుబాటులో ఉన్నాయి. రూ.2399 ప్లాన్ రీఛార్జ్ చేసుకుంటే.. 600 రోజులు అపరిమిత కాల్స్, రోజుకి 2 జీబీ డేటా వంటివి లభిస్తాయి. రూ.1999 ప్లాన్ రీఛార్జ్ చేసుకుంటే.. 365 రోజులు 600 జీబీ డేటా, అపరిమిత వాయిస్ కాల్స్ లభిస్తాయి. అయితే రూ.1515 ప్లాన్ ద్వారా 365 రోజుల వ్యాలిడిటీతో అపరిమిత కాల్స్, రోజుకి 2 జీబీ డేటా లభిస్తుంది.

# ఎన్నాళ్లీ వేలంవెర్రి?

**కరడు గట్టిన జాతీయవాదీ చార్లీ కిర్క్ హత్యోదంతంతో ఉలిక్కిపడ్డ ప్రపంచం**




వాషింగ్టన్:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌కు సన్నిహితుడూ, కరడు గట్టిన జాతీయవాదీ అయిన చార్లీ కిర్క్ హత్యోదంతంతో ప్రపంచం ఉలిక్కిపడింది. అమెరికాలో యూటా వ్యాలీ యూనివర్సిటీలో విద్యార్థులతో మాట్లాడుతుండగా, ఈ నెల 10న ఓ ముష్కరుడు జరిపిన ఆ కాల్పులతో అమెరికాలోని తుపాకీల సంస్కృతిపై మరో మారు చర్చ రేగింది. అలనాటి అబ్రహామ్ లింకన్ నుంచి నేటి కిర్క్ దాకా అనేక హత్యా ఘటనలు, స్కూళ్లలో కాల్పులు, రాజకీయ ప్రేరేపిత దాడులు జరుగుతూనే ఉన్నాయి. తుపాకీ లపై వ్యామోహం, వినియోగాన్ని నియంత్రిస్తూ కట్టుదిట్టమైన చట్టం తీసుకువచ్చేందుకు గతంలో పలు అమెరికన్ ప్రభుత్వాలు ప్రయత్నించినా అడ్డంకులు ఎదురయ్యాయి

**ఇప్పుడేం జరిగింది?**

అమెరికాలో తుపాకీల పిచ్చి ఎంతంటే... ఆ దేశ జనాభా కన్నా తుపాకీల సంఖ్యే ఎక్కువ. ప్రపంచ జనాభాలో అక్కడున్నది 5 శాతం కన్నా తక్కువే. కానీ, భూమిపై సామాన్యుల దగ్గరున్న గన్స్‌లో 45 శాతం పైగా అక్కడే ఉన్నాయి. తుపాకీ లైసెన్సును దేవుడిచ్చిన హక్కుగా సంబోధిస్తూ, ఆ సంస్కృతిని సమర్థిస్తూ వచ్చిన 31 ఏళ్ళ వీర జాతీయవాది చార్లీ కిర్క్. ఆయన తన 18వ ఏటనే టర్నింగ్ పాయింట్ అనే సంస్థను నెలకొల్పి, తన ప్రసంగాలతో ఆకర్షిస్తూ వచ్చారు. ఉదారవాద అమెరికన్ కాలేజీల్లో జాతీయ వాద ఆదర్శాలను విస్తరింపజేసేందుకు ప్రయత్నించారు. గన్స్ నియంత్రణను వ్యతిరేకించిన ఆయన చివరకు ఓ స్నైపర్ దూరం నుంచి గురిచూసి కాల్చిన తూటా మెడకు తగిలి, ప్రాణాలు కోల్పోయారు.

**నేపథ్యం ఏమిటి?**

అమెరికా రాజ్యాంగ రెండో సవరణ ప్రకారం గన్స్ హక్కు పౌరులకుంది. అదే ఆ దేశ సంస్కృతినీ తీర్చి దిద్దింది. సాక్షాత్తూ నలుగురు దేశాధ్యక్షుల నుంచి సామాన్యుల దాకా ఎందరో బలయ్యారు. అమెరికన్ రాజకీయాలనూ, నిత్యజీవితాన్నీ ప్రభావితం చేసిన ఈ తుపాకీల సంస్కృతి నియంత్రణకు సంబంధించి ఏళ్ళుగా చర్చ సాగుతూనే ఉంది. అయితే, ఈ అంశం కేవలం విధానపరమైనదే కాదు. రాజ్యాంగంలోని వివిధ అంశాల వ్యాఖ్యానం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, వ్యక్తిగత భద్రతలతోనూ ముడిపడిన విషయం. నియంత్రణ సమర్థకులు, వ్యతిరేకులుగా అమెరికన్ సమాజం నిట్టనిలువునా చీలిపోయింది. కిర్క్ హత్యా ఘటన చర్చను మరోసారి తెరపైకి తెచ్చింది.

**గత చరిత్ర**

అమెరికాలో మొదట వేట, స్వీయ రక్షణ కోసం గన్స్ వచ్చాయి. 1791లో తెచ్చిన 'బిల్ ఆఫ్ రైట్స్'లో ఆయుధాలను కలిగివుండే రాజ్యాంగ రెండో సవరణ కూడా చోటుచేసుకుంది. క్రమంగా తుపాకీలను స్వేచ్ఛకు ప్రతీక అనుకోవడం మొదలైంది. అయితే, గన్స్ వినియోగం దోవ తప్పి నేరాలకు దారితీసింది. 1934లో ప్రధానమైన తొలి ఫెడరల్ ఆయుధ చట్టం తెచ్చారు. దశాబ్దాల అనంతరం జాన్ ఎఫ్ కెనడీ, రాబర్ట్ కెనడీ, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌ల హత్యల తర్వాత అమెరికన్ కాంగ్రెస్ తుపాకీ నియంత్రణ చట్టం 1968 చేసింది. అయినా దుర్వినియోగం ఆగలేదు. తర్వాతా సంస్కరణలు తేవాలని పలు వురు అమెరికన్ అధ్యక్షులు యత్నించి, విఫలమయ్యారు. ఒబామా అలాంటి చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని 17 సార్లు ప్రయత్నించారు.

**వర్తమానం... భవిష్యత్తు...**

అమెరికాలో ప్రతి 10 మందిలో నలుగురి ఇంటి వద్ద తుపాకీలు ఉన్నాయట. యుద్ధ పీడిత యెమెన్‌తో పోలిస్తే ఇక్కడే రెట్టింపు కన్నా ఎక్కువగా తలసరి 1.2 గన్నులున్నాయి. సగటున రోజూ 128 గన్ డెత్స్ సంభవిస్తున్నాయి. అంటే, సగటున ప్రతి 11 నిమిషా లకూ ఒకరు ప్రాణాలు వదులుతున్నారు. ఇంత జరుగుతున్నా గన్ రైట్స్‌పై అమెరికా ఒక్క తాటి మీద లేదు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ లాంటి బలమైన లాబీలూ దీని వెనుక పనిచేస్తున్నాయి. మునుపు 1980, 90లలో ఆస్ట్రేలియాలో ఇలానే తుపాకీలు రాజ్యమేలుతుంటే, కఠినమైన నియంత్రణతోఅదుపు చేశారు. అమెరికాలోనేమో అలాంటిది కనుచూపు మేరలో కనిపించడం లేదు.



## భారీగా పెరిగిన బంగారం అమ్మకాలు

**న్యూఢిల్లీ,జనంసాక్షి:** జీవిత కాల గరిష్ట స్థాయిల వద్ద పసిడి అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నది. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.1,800 పెరిగి మంగళవారం కొత్త గరిష్ట స్థాయి రూ.1 ,15,100 స్థాయికి చేరుకోగా..బుధవారం రూ.1,300 నష్టపోయి రూ.1,13,800కు పరిమితమైంది. ధరలు తగ్గుముఖం పట్టడంతో.. సేల్స్ పెరిగాయి."యూఎస్ ఫెడ్ పాలసీ సమావేశానికి ముందు లాభాల స్వీకరణకు ఇన్వెస్టర్లు మెగ్గు చూపించడంతో బంగారం బలహీనంగా ట్రేడయ్యింది. కీలకమైన సమావేశానికి ముందు ఇన్వెస్టర్లు రిస్క్ తగ్గించుకున్నారు. కేవలం ఫెడ్ రేట్ల కోతపైనే కాకుండా, తదుపరి రేట్ల సవరణ దిశగా ప్రకటించే అంచనాల కోసం మార్కెట్లు వేచి చూస్తున్నాయి.తటస్థ విధానం లేదా తదుపరి రేట్ల కోతకు సంబంధించి స్పష్టమైన కార్యాచరణ లోపిస్తే బంగారం ధరలు ఇక్కడి నుంచి కొంత శాతం తగ్గొచ్చు"అని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ సీనియర్ అనలిస్ట్ జతిన్ త్రివేది తెలిపారు. వెండి సైతం అమ్మకాల ఒత్తిడితో కిలోకి రూ.1,670 నష్టపోయి రూ.1,31,200 స్థాయికి దిగొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు ఒక శాతం తగ్గి 3,665 డాలర్ల వద్ద, కామెక్స్ ఫ్యూచర్స్‌లో పావు శాతం తగ్గి 3,717 డాలర్ల వద్ద ట్రేడయ్యింది.

## డొనాల్డ్ ట్రంప్ బంగారం విగ్రహం!



**వాషింగ్టన్:**అమెరికా కాపిటల్ వెలుపల అధ్యక్షుడు 'డొనాల్డ్ ట్రంప్' బిట్‌కాయిన్ పట్టుకుని ఉన్న 12 అడుగుల బంగారు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గింపు నేపథ్యంలో క్రిప్టోకరెన్సీ పెట్టుబడిదారుల నిధులతో..ఈ విగ్రహం ఏర్పాటు చేసినట్లు సమాచారం. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.డొనాల్డ్ ట్రంప్ బిట్‌కాయిన్ చేతపట్టుకున్న విగ్రహం.. డిజిటల్ కరెన్సీ, మనీటరీ పాలసీ, ప్రభుత్వ వ్యవహారాలలో వడ్డీ పాత్ర వంటి విషయాల మీద ప్రజలలో చర్చ మొదలవ్వాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇది ట్రంప్, క్రిప్టో మద్దతుదారుల మధ్య సంబంధాలను ప్రతీక అని చెబుతున్నారు. ఈ విగ్రహంపై తీవ్రమైన విమర్శలు కూడా కురిపిస్తున్నారు. అయితే ఈ విగ్రహాన్ని బంగారంతో చేసారా? లేక బంగారం పూత పూశారా?.. లేదా ఇతర మెటల్స్ ఉపయోగించి రూపొందించారా? అనేది తెలియాల్సి ఉంది.యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ రెండు రోజుల పాలసీ సమీక్షలో వడ్డీ రేటును పావు శాతం తగ్గిస్తున్నట్లు నిర్ణయించింది. ఫెడ్ చైర్మన్ జెరోమీ పావెల్ అధ్యక్షతన రెండు రోజులపాటు జరిగిన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ) వడ్డీ రేటులో 0.25 శాతం తగ్గింపుకే సుముఖత చూపింది. గత ఐదు పాలసీ సమీక్షలలో వడ్డీ రేటును యథాతథ ఉంచడానికి మొగ్గుచూపారు. అయితే 9 నెలల తరువాత వడ్డీ రేటు తగ్గించడానికి నిర్ణయం తీసుకున్నారు.

## సుంకాలపై ట్రంప్ యూటర్న్?!



మనదేశం నుంచి ఎగుమతయ్యే పలు ఉత్పత్తులపై 25శాతం ప్రతీకార సుంకం చెల్లించడంతో పాటు పెనాల్టీ కింద మరో 25శాతం.. మొత్తంగా 50శాతం టారిఫ్ చెల్లించేందుకు సిద్ధపడ్డాం. కానీ ఇకపై మనకు ఆ అవసరం ఉండదని నేను భావిస్తున్నాను.25 శాతం పెనాల్టీ సుంకానికి భౌగోళిక రాజకీయ పరిస్థితులు కారణం. కానీ గత రెండు వారాలలో జరిగిన పరిణామాలను పరిగణనలోకి తీసుకుంటే నవంబర్ 30 తర్వాత 25శాతం జరిమానా సుంకం ఉండదని నేను నమ్ముతున్నాను. రాబోయే రెండు నెలల్లో ప్రతీకార సుంకంతో పాటు జరిమానా పరస్పర సుంకాలపై పరిష్కారం లభిస్తోందన్నారు. ఈ వ్యాఖ్యలతో భారత్‌పై టారిఫ్‌ల విషయంలో ట్రంప్ యూటర్న్ తీసుకునే అవకాశం ఉందంటూ ఆర్థిక నిపుణుల అంచనా. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 1977లో రూపొందించిన ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్స్ పవర్ యాక్ట్ (ఐఈఈపీఏ) చట్టాన్ని ప్రస్తావిస్తూ, విదేశీ అత్యవసర పరిస్థితుల సమయంలో ఆర్థిక నియంత్రణలు, శిక్షలు విధించేందుకు ఈ చట్టాన్ని ఉపయోగించారు. ఈ చట్టం ఆధారంగా మనదేశంపై మొదట 25శాతం టారిఫ్‌లు విధించగా, ఇప్పుడు వాటిని 50శాతానికి పెంచారు.

## అబ్బాస్ ఎవరు?

**వాద్‌నగర్‌లో మోదీతో పాటు ఎందుకున్నారు?**

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ 75వ పుట్టినరోజు వేడుకలను భారతీయ జనతా పార్టీ 15 రోజుల పాటు నిర్వహిస్తోంది. ఈ పక్షం రోజుల్లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది.ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ జీవితంలోని పలు ఆసక్తికర విషయాలు తెరపైకి వస్తున్నాయి. అటువంటి వాటిలో ఒకటే ప్రధాని మోదీ బాల్య స్నేహితుడు అబ్బాస్ రామ్‌సదా వృత్తాంతం. అతను చిన్నతనంలో మోదీ కుటుంబంతో కలిసి వాద్‌నగర్‌లో ఉన్నారు.2022లో ప్రధాని నరేంద్ర మోదీ తన తల్లి హీరా బెన్ పుట్టినరోజు సందర్భంగా గుజరాత్‌లోని వాద్‌నగర్‌లోని తన ఇంటికి వెళ్లారు. అ?ప్పుడు ప్రధాని మోదీ బ్లాగ్‌లో తన తల్లి హీరాబెన్ పోరాట కథను చెప్పారు. ఈ బ్లాగ్‌లో అబ్బాస్ అనే ముస్లిం స్నేహితుని గురించి ప్రస్తావించారు. తన తండ్రి స్నేహితుడొకరు చనిపోవడంతో అతని కుమారుడు అబ్బాస్‌ను ఇంటికి తీసుకొచ్చారని మోదీ గుర్తు చేసుకున్నారు. అతను తమ దగ్గరే ఉంటూ చదువు పూర్తి చేశాడని, అన్నదమ్ములందరినీ అమ్మ ఎలా చూసుకునేదో అబ్బాస్ ని కూడా అలాగే చూసుకునేదన్నారు. ప్రతి సంవత్సరం ఈద్ రోజున అబ్బాస్ కోసం అతనికి ఇష్టమైన ప్రత్యేక వంటకాలు వండేవారని తెలిపారు.అబ్బాస్.. మోదీ కుటుంబంలోనే ఉంటూ మోదీ సోదరుడు పంకజ్ మోడీతో కలిసి ఒకే తరగతిలో చదువుకున్నారు. 1973–74లో అబ్బాస్ తన మెట్రిక్యులేషన్ పరీక్షలలో అద్భుతమైన గ్రేడ్ సాధించారని ది టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక పేర్కొంది. అయితే అబ్బాస్ తన మెట్రిక్యులేషన్ పరీక్షకు హాజరయ్యే సమయానికి, మోదీ.. వాద్‌నగర్ నుండి అహ్మదాబాద్‌కు ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా వెళ్లిపోయారు. ప్రధాని సోదరుడు పంకజ్ మోదీ , అబ్బాస్ ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. ప్రధాని సోదరుడు పంకజ్ మోదీ , అబ్బాస్ ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు.ప్రధాని మోదీ సోదరులలో మరొకరైన ప్రహ్లాద్ మోదీ ఒకసారి అబ్బాస్ తమ ఇంట్లో ఉన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు.2022లో అబ్బాస్ ప్రభుత్వ ఉద్యోగం నుండి పదవీ విరమణ చేసి, తన చిన్న కుమారునితో పాటు ఆస్ట్రేలియాలోని సిడ్నీకి వెళ్లారు. అబ్బాస్ పెద్ద కుమారుడు ఇప్పటికీ గుజరాత్‌లోని మెహ్సానాలో నివసిస్తున్నారు. ప్రధాని మోదీపై అబ్బాస్ రాసిన పుస్తకంలో.. తనకు మోదీ కుటుంబం నుంచి లభించిన మద్దతు, ఆప్యాయత మరువలేనిదన్నారు. ముఖ్యంగా హీరాబెన్ ఎంతో ప్రేమ చూపేవారన్నారు. ఆమె తన సొంత పిల్లల కంటే తనను ఎక్కువగా చూసుకున్నారని ఆయన పేర్కొన్నారు.

# సరైన పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18 (జనం సాక్షి) :**
సరైన పోషకాహారం తీసుకోవడం వలన శారీరకంగా మరియు మానసికంగా దృఢంగా తయారవుతారని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ లింగంపేట మండలం పోతాయిపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ లో నిర్వహించిన స్వచ్ఛతా హే సేవా-2025, పోషక్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని స్వచ్ఛత పై విద్యార్థులచే ఏర్పాటుచేసిన మానవహారం కార్యక్రమం ద్వారా విద్యార్థులతో కలిసి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోషక్ అభియాన్ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్వాడి కేంద్రాలలో పోషక మాసం కార్యక్రమాన్ని నిర్వహించి పౌష్టికాహారం విలువను తెలియజేయడం జరుగుతుందని శారీరక మానసిక ఎదుగుదలకు ప్రతి ఒక్కరు కచ్చితంగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కౌమార బాలికలు ఐరన్ టాబ్లెట్లను వేసుకోవడం ద్వారా ఎనీమియా వ్యాధి బారిన పడకుండా రక్షించుకోగలుగుతారని అన్నారు. ముఖ్యంగా చిన్నారులు, బాలింతలు, గర్భిణీ స్త్రీలు, కౌమార బాలికలు పౌష్టికాహారం తప్పకుండా తీసుకునేలా అవగాహన కల్పించడంతో పాటు అంగన్వాడి కేంద్రాల ద్వారా గుడ్డు, పాలు, తాజా ఆకుకూరలు, కూరగాయలతో ఆహారం అందించాలని సూచించారు. స్వచ్ఛతా హే సేవ 2025 కార్యక్రమం ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలలో ప్రజల భాగస్వామ్యంతో గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా శ్రమదానం నిర్వహించి ఇతర స్వచ్ఛత కార్యక్రమాల ప్రాధాన్యత తెలియ జేయాలని అన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు సంస్థలను శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించడం, ప్లాస్టిక్ వ్యర్థాలతో ఆకర్షణీయ వస్తువులను తయారు చేయడం ఇలాంటి పనులను ప్రణాళిక వద్దంగా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఈనెల 17వ తేదీ నుండి అక్టోబర్ 2 వ తేదీ వరకు గ్రామాలలో నిర్వహించాలని అన్నారు.

చిన్ననాటి నుండే స్వచ్ఛత పర్యావరణ పరిరక్షణ పై అవగాహన పెంచుకొని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని విద్యార్థుల కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి,డిఆర్డిఓ సురేందర్, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, జిల్లా బాలల సంరక్షణ అధికారి స్రవంతి, ఎంపీడీవో, తాసిల్దార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల మండల,గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నీరు జీవకోటి మనుగడకు ఆధారం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :**
ప్రపంచ నీటి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం వేములవాడలోని న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను క్షేత్ర పర్యటనకు తీసుకువెళ్ళి వేములవాడ చెరువు, పరిసర కాలువలను,వాగులను సందర్శించి నీటి లభ్యత, నీటి సంరక్షణ,పర్యవేక్షణ, వినియోగాన్ని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విశ్వంలోని అన్ని రకాల జీవరాశులకు నీరే ఆధారమన్నారు. ప్రపంచవ్యాప్తంగా నీటి పర్యవేక్షణ, నీటి వనరులను రక్షించడంలో ప్రజల ప్రమేయం ప్రోత్సహించడానికి 2003 నుండి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 18 ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. నీరు పరిశుభ్రంగా ఉంచుకుంటూ , ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలన్నారు. 2025 ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవం థీమ్ హిమానీనదాలు సంరక్షణ, ఈ థీమ్ జీవితానికి, నీటి చక్రానికి హిమానీనదాలు పోషించే కీలక పాత్రను నొక్కి చెబుతుందన్నారు. హిమానీనదాలు కరగడం వల్ల ఏర్పడే సవాళ్లపై అవగాహన పెంచడం మరియు ఈ విలువైన నీటి వనరులను రక్షించడానికి చర్యలు తీసుకోవాలని ప్రపంచాన్ని కోరడం దీని లక్ష్యం అన్నారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు రెండు బిలియన్ల ప్రజలకు హిమానీనదాలు కరిగిపోవడం వల్ల వచ్చే నీరు తాగడానికి,వ్యవసాయానికి, పరిశ్రమలకు అవసరమని, హిమానీనదాలు ఆరోగ్యకరమైన పర్యావరణ



వ్యవస్థలకు చాలా కీలకమైనవన్నారు. హిమానీనదాలను రక్షించడం ద్వారా మనం మన నీటి వనరులను, భవిష్యత్ తరాలకు అందించగలమన్నారు. ప్రపంచంలోని మంచు గడ్డలు, హిమానీనదాలు వాతావరణ వ్యవస్థలో పోషించే కీలకపాత్ర గురించి అవగాహన పెంచాలని, హిమానీనదాలు కరగడాన్ని ఆపడానికి మరియు వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడానికి ప్రజలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

# సుడా అభివృద్ధి పనులు.. ఇతర కార్యకలాపాలపై సమీక్ష

- నగరంలో మిగిలిపోయిన సుందరీకరణ పనులు ఇతర అత్యవసర పనులు చేపట్టాలని నిర్ణయం
- నూతన లేఅవుట్లకు ప్రతిపాదనలు... అన్ని విభాగాలపై సమీక్ష
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి, వైస్ చైర్మన్ ప్రఫుల్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్18 (జనంసాక్షి):**
శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యకలాపాలపై సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సుడా వైస్ ఛైర్మన్, మున్సిపల్ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ సమీక్ష నిర్వహించారు. సుడా కార్యాలయంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా కరీంనగర్ నియోజకవర్గంతో పాటు చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాలలో పలు అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు, నగరంలో మిగిలిపోయిన పలు కూడళ్ల సుందరీకరణ, సుడా పరిధిలో చేపట్టబోయే నూతన లేఅవుట్లు తదితర అంశాలపై చర్చించినట్టు నరేందర్ రెడ్డి తెలిపారు. సుడా కమర్షియల్ బిల్డింగ్, ఐడీఎస్ఎంటి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సుడా పరిధిలో నూతన లేఅవుట్లు ఏర్పాటు చేయాలని అందుకు గతంలో గుర్తించిన ప్రాంతాలపై రెవెన్యూ, ల్యాండ్ సర్వే, సంబంధిత అధికారులతో కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి నివేదిక తయారు చేసి లేఅవుట్లు చేయాలని నిర్ణయించినట్టు నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. వన్ టౌన్ పోలీస్టేషన్ ఎదురుగా చొక్కారావు ఐల్యాండ్ పక్కన ఉన్న ఐల్యాండ్ సుందరీకరణ చేయాలని నగరలోని ప్రధాన రోడ్లలో గల నాలాల బ్రిడ్జిలపై ఇరువైపులా హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో బ్రిడ్జి మాదిరిగా ప్లాంట్స్ తో సుందరీకరణ చేయాలని నిర్ణయించామని నరేందర్ రెడ్డి తెలిపారు. చొప్పదండి నియోజకవర్గంలోని కొక్కెరకుంట కోనాయపల్లి రోడ్డుకు నిధులు కేటాయించడం జరిగిందని ఇంకా పలు అభివృద్ధి పనులు, సుడాకు అభివృద్ధి చార్జీలు కట్టని పెట్రోల్ బంకులకు నోటీసులివ్వాలని కమర్షియల్ గా నడుపుతూ సుడా అభివృద్ధి పన్నులు చెల్లించని ఫామ్‌లకు నోటీసులివ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో సీపీవో ఆంజనేయులు, ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ రొడ్డ యాదగిరి, డిఈఈ రాజేంద్ర ప్రసాద్, టీపీవో శ్రీధర్ ప్రసాద్, టీపీఎస్ సంధ్య, అజ్మల్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల వేతన బకాయిలను చెల్లించేందుకు అంగీకారం

- ఎమ్మెల్యే ఆదేశాలతోనే కార్మికులకు న్యాయం
- బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ



**బోధన్, సెప్టెంబర్ 18 ( జనంసాక్షి ) :** తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) ఆధ్వర్యంలో గురువారం నాడు బోధన్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జాదవ్ కృష్ణ గారిని కలిసి బోధన్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు/ఔట్సోర్సింగ్ కార్మికులకు రావలసిన పి ఆర్ సి వేతన బకాయిల గురించి, చనిపోయిన కార్మికుల స్థానంలో పనిచేస్తున్న కార్మికులకు రావలసిన వేతనాల గురించి, చనిపోయిన మరియు రిటైర్మెంట్ అయినటువంటి కార్మికులకు రావలసిన పీ.ఎఫ్, పెన్షన్, ఇతర బెనిఫిట్స్ కొరకు అప్లికేషన్ ఫారాలను నింపి ఇవ్వడం గురించి, పీఎఫ్, ఈఎస్ఐ లను రెగ్యులర్ కార్మికుల ఎకౌంట్లో జమ చేయుట గురించి, చనిపోయిన కార్మికుల స్థానంలో వారి వారసులను నియమించుట గురించి తదితర సమస్యల పరిష్కారం కోసం చర్చించడం జరిగింది. దానితో ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ మాట్లాడుతూ, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఇప్పటికే కార్మికుల సంక్షేమ కోసం ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, వారికి ఎట్టి పరిస్థితుల్లో ఎలాంటి అవాంతరాలు జరగకుండా చూడాలని చెప్పడం జరిగిందన్నారు. ఆయన ఆదేశాల మేరకు కార్మికుల అన్ని సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ స్పష్టం చేశారు. కార్మికులకు రావలసిన పిఆర్సి వేతన బకాయిలు వాటికి చెల్లించాల్సినటువంటి పీఎఫ్, ఈఎస్ఐలకు గాను రూ.50 లక్షలను రిలీజ్ చేస్తున్నామని చెప్పారు, అదేవిధంగా దసరా పండుగకు ఒక నెల కార్మికుల వేతనాలను కూడా ఇవ్వటానికి అంగీకరించారు. చనిపోయి మరియు రిటైర్మెంట్ అయినటువంటి కార్మికుల స్థానంలో పనిచేస్తున్నటువంటి వారి వారసులైనటువంటి తొమ్మిది మంది కార్మికుల వేతనాలను కూడా చెల్లిస్తున్నట్లు తెలిపారు. చనిపోయిన కార్మికుల పీఎఫ్, పెన్షన్, ఇన్సూరెన్స్ లకు సంబంధించిన అప్లికేషన్ ఫారాలను వెంటనే నింపి ఇవ్వాలని ఆదేశించారు. చనిపోయిన కార్మికుల స్థానంలో వారి వారసులను నియమించుటకు గాను డీఎంవో ఆఫీసుకు రాశి పంపామని పై నుండి ఆదేశాలు రాగానే పనులలోకి తీసుకుంటామనితెలిపారు. ఈ చర్చలలో తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్( టియుసిఐ ) రాష్ట్ర నాయకులు బి. మల్లేష్, బోధన్ పట్టణ నాయకులు బి.నాగేశ్వర్, మున్సిపల్ జవాన్ బి. రాజు, కే. సాయిలు తదితరులు పాల్గొన్నారు.




## పారమిత వరల్డ్ స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబురాలు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
అల్గునూరులోని పారమిత వరల్డ్ స్కూల్ ప్రాంగణం బుధవారం బతుకమ్మ పూలతో కళకళలాడింది. ముందస్తుగా నిర్వహించిన బతుకమ్మ సంబురాలలో విద్యార్థులు సంతోషంగా పాల్గొన్నారు. పాఠశాలలోని వివిధ హౌసెస్ విద్యార్థులు తమ సృజనాత్మకతతో ప్రత్యేకమైన బతుకమ్మలను తయారు చేసి ప్రదర్శించారు. పూలతో అలంకరించిన ఆ బతుకమ్మలు అందరి దృష్టిని ఆకర్షించాయి. విద్యార్థులు బతుకమ్మ పాటలు పాడుతూ, సాంప్రదాయ నృత్యాలతో ఉత్సవాన్ని మరింత అందంగా తీర్చిదిద్దారు. విద్యార్థులు తయారుచేసిన బతుకమ్మల చుట్టూ అందరూ కలసి ఆడిపాడి సంబరాలను ఆస్వాదించారు. బతుకమ్మ పూల వలె మనందరి జీవితాలు సౌందర్యంతో, ఆనందంతో కళకళలాడాలని కోరుకుంటున్నాను. సాంప్రదాయాలను సజీవంగా ఉంచి, వాటి విలువలను తరతరాలకు పంచడంలో విద్యార్థులు ముందుండాలని ఆయన సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా పారమిత పాఠశాల చైర్మన్ డా.ఇ. ప్రసాదరావు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ ఇ. ప్రసూన, వి.యూ.ఏం ప్రసాద్, ప్రిన్సిపాల్ శ్రీకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్‌లో ప్రతిభ కనబరిచిన శ్రీ భాషిత విద్యార్థి



**ఆర్మూర్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
ఆర్మూర్ పట్టణంలోని శ్రీ భాషిత పాఠశాలకు చెందిన ఎం శసున్ (ఎనిమిదో తరగతి) విద్యార్థి ఆగస్టులో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ 50 బాల్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో,50 బాల్స్ క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అనుబంధంగా, ఇంటర్నేషనల్ మాన్ కౌన్సిల్, ఫెడరేషన్ ఆఫ్ ఆసియా గుర్తింపు పొందిన తిరుపతి తుంగగిరి సమీపంలోని వై.ఎస్.ఆర్. క్రికెట్ గ్రౌండ్ లో జాతీయ స్థాయి పోటీలో పాల్గొన్నారు. జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ క్రీడాస్ఫూర్తి,క్రమశిక్షణ,ప్రతిభను ప్రదర్శించిన ఏం.శసున్ ను కరస్పాండెంట్ పోలపల్లి సుందర్,ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడానికి ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని, భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

## రాజన్న ఆలయంలోని దర్గా వద్ద పోలీసు బందోబస్తు

### ఇంటలిజెన్స్ వర్గాలతో అప్రమత్తమైన పోలీసులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభమైన విషయం తెలిసిందే. రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా ఆలయంలోని హిందూ దేవతమూర్తులను తొలగించి మరోచోట ప్రతిష్ఠంచనున్నారు. కొద్దిరోజుల క్రితం ఆలయ అభివృద్ధిపై పవర్ ప్రజెంటేషన్ నిర్వహించిన క్రమంలో హిందూ సంఘాలు దర్గా విషయంపై నిలదీసినప్పటికీ అధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించలేదు. ఇటీవల భాజపా రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ ఆలయంలోని దర్గాను తొలగించకుండా హిందూ దేవతమూర్తులను తొలగిస్తే ఆందోళన చేపడుతామని ప్రకటించారు. రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా దసరా తర్వాత ఆలయం మూసివేస్తానే సమాచారం ప్రజల్లోకి వెళ్ళింది. హిందూ దేవత మూర్తులు తొలగిస్తే దర్గాను తొలగించాకే హిందూ దేవత మూర్తులు తొలగించాలని హిందూ సంఘాలు ప్రకటించడంతో ఇంటలిజెన్స్ వర్గాల సూచనల మేరకు పోలీసులు దర్గా వద్ద తుపాకులతో పహారా కాస్తున్నారని భక్తులు,ప్రజలు చర్చించుకుంటున్నారు.

# అల్ఫోర్స్ మహిళా కళాశాలలో నెలసరి ఆరోగ్య పరిశుభ్రత అవగాహన కార్యక్రమం

- ముఖ్య అతిథిగా హాజరైన "రెనే హాస్పిటల్ ఎం.డి. డాక్టర్. బంగారి రజిని ప్రియదర్శిని", అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి






**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):**
కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ, పీజీ కాలేజ్ లో ఉమెన్స్ ఎంపవర్మెంట్ క్లబ్ ఆర్గనైజర్ల ఆధ్వర్యంలో "మాసిక శుద్ధి, పిసిఒఎస్"పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ వి. రవీందర్ రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరైన 'రెనే పర్టిలిటి హాస్పిటల్ ఎం.డి. డాక్టర్ బంగారి రజిని ప్రియదర్శిని' తో జ్యోతి ప్రజ్వలన చేసి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ ఉమెన్స్ కాలేజ్ చైర్మన్ వి.రవిందర్ రెడ్డి తమ విద్యార్థులు వారి నెలసరి పరిశుభ్రత ఆరోగ్య విధివిధానాలను తెలుసుకోవాలన్న సదుద్దేశంతో డా. బంగారి రజినీ ప్రియదర్శిని ని ఆహ్వానించి, అవగాహన ను నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా డాక్టర్ బంగారి రజని ప్రియదర్శిని (ఎం.ఎస్.ఒబిజి) ఎఆర్టి, స్పెషలిస్ట్ క్లీవ్‌ల్యాండ్ అక్రిడిటేషన్, యుఎస్ఎ, వ్యవస్థాపకురాలు రజని ఫెర్టిలిటీ సెంటర్, సీనియర్ కన్సల్టెంట్ ఒబిజి వైఎన్ మేనేజింగ్ డైరెక్టర్ రెనే హాస్పిటల్స్, హాజరై విద్యార్థినులకు విలువైన సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా "రెనే హాస్పిటల్ ఎం.డి. డాక్టర్. బంగారి రజిని ప్రియదర్శిని" మాట్లాడుతూ... వ్యక్తిగత పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ముఖ్యంగా అనియమిత, రుతుక్రమం ఉన్నవారు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. నాణ్యమైన ఉత్పత్తులు వాడడం, ప్రతి 4 నుండి 6 గంటలకు ఒకసారి ప్యాడ్ మార్చడం అలవాటు చేసుకోవాలని, వాడిన ప్యాడ్స్‌ను ఫ్లష్ చేయరాదని తెలిపారు. అలాగే కఠినమైన సబ్బులు ఉపయోగించకుండా మైల్డ్ సోప్ వాడాలని, ప్రతిరోజు తగినంత నీరు తాగుతూ, సరైన ఆహారపు అలవాట్లు పాటించాలని సూచిం చారు. అదనంగా, కాటన్ శానిటరీ ప్యాడ్స్తో పాటు కాటన్ లోదుస్తులు ధరించడం ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగకరమని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ వి. రవీందర్ రెడ్డి ముఖ్య వక్త బంగారి రజినీ ప్రదర్శన తోపాటు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉమెన్స్ ఎంపవర్మెంట్ క్లబ్ ఆర్గనైజర్స్, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

**జోష్ నింపిన అల్ఫోర్స్ టైనీ టాట్స్ బతుకమ్మ సంబరాలు**

పండుగల ద్వారా సుఖ సంతోషాలతో పాటు అష్టైశ్వర్యాలు కలుగుతాయని, పండుగ వాతావరణం సమాజంలో నూతన ఉత్సాహాన్ని నింపుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో తెలంగాణ కళావైభవాన్ని చాటి చెప్పే విధంగా ఆకర్షణీయంగా ఏర్పాటు చేసినటువంటి బతుకమ్మ ఉత్సవ్ కు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి దుర్గ మాత చిత్రపటానికి పూజా కార్యక్రమాన్ని నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...బతుకమ్మ ఉత్సవాలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్తుందని సమాజంలో ఆనంద ఉత్సవాలకు బీజం వేస్తుందని తెలిపారు. ఈ పండుగకు తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకత ఉన్నదని ఈ పండుగ దేశ విదేశాల్లో రెట్టింపు ఉత్సాహంతో నిర్వహించుకోవడం చాలా హర్షించదగ్గ విషయమని, ఈ పండగ పల్లె వాతావరణం కళ్లకు కట్టే విధంగా కళకు నిదర్శనమని అభివర్ణించారు. నేటి కాలంలో సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పటికీ బతుకమ్మ ఉత్సవాలు వైభవం తరగకపోవడం పండుగ గొప్పతనమని ఇంటి ఆడబిడ్డగా కొలిచే బతుకమ్మను వాడవాడలా, పల్లెల్లో, పట్టణాల్లో, నగరాల్లో, మహానగరాల్లో మహిళలందరూ చాలా చక్కగా సమూహంగా ఏర్పడి దేదిప్యమానంగా బతుకమ్మ దీవెనలు వెల్లివిరిసే విధంగా అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆశయంతో బతుకమ్మ ఉత్సవాలను చాలా వైభోపేతంగా నిర్వహించడం జరుగుతుందని వారు చెప్పారు. వేడుకలలో భాగంగా చిన్నారులు ఆడిన బతుకమ్మ విధానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా వివిధ రూపాలలో బతుకమ్మలను తయారు చేసి ఆహుతులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అమ్మేస్తారు

- గ్యాంగ్‌స్టర్ నయీం ఆస్తుల లెక్కపై విచారణ జరపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- కెసిఆర్ కుటుంబంపై పిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం తీవ్ర విమర్శలు
- కాళేశ్వరం అవినీతిపై కవిత, హరీష్ రావు సమాధానంలో కేసీఆర్ సూత్రధారిగా వెల్లడి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
స్వయాన కెసిఆర్ కూతురు కవిత, నాటి ఇరిగేషన్ మంత్రి హరీష్‌రావు ద్వారా కాళేశ్వరంలో అవినీతి జరిగిందని... దోచుకున్న ది వాస్తవమే అని చెపుతున్నదని పిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం గురువారం ఆర్‌బి గెస్ట్ హౌస్ లో విలేఖర్ల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా పిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం మాట్లాడుతూ... మరో పక్క కేసీఆర్, కేటీఆర్ లక్ష కోట్లు కాళేశ్వరం సొమ్ము కాజేశారని కమీషన్ ముందు హరీష్ రావు ఒప్పుకున్నారని ఈ విధంగా ఆ కుటుంబం బయట పెట్టిన విషయాలపై ప్రభుత్వం విచారణ చేస్తుందన్నారు.

కేసీఆర్ పాలనలో అన్ని శాఖల్లో అవినీతి, దోపిడీ జరిగిందని హైదరాబాదులో చుట్టూ 30వేల ఎకరాల భూమి, రాష్ట్ర వ్యాప్తంగా 5లక్షల ఎకరాల ప్రభుత్వ భూమి ఆంధ్ర బడా బాబులకు బినామీల పేరుపై రాసిచ్చారన్నారు. ఈ పరిస్థితుల్లో బిఆర్ఎస్ పార్టీ ఉంటుందా ఆ పార్టీ నేతలు ఆలోచించుకోవాలని, నయీం ను కేసీఆర్ ఎన్కౌంటర్ చేయించిన తరువాత అతని దగ్గర ఉన్న 2 వేల ఎకరాల భూమి ఏమైందో , 2 వేల కోట్ల రూపాయలు ఎక్కడికి పోయాయో లెక్క చెప్పలేదని దీనిపై విచారణ జరిపించాలని మేము ముఖ్యమంత్రి ని కోరుతామన్నారు. నయీం ఆస్తులను కేసీఆర్ ఖాజానాలో జమ చేశారని, స్వాధీనం చేసుకున్న సొమ్ము జాడ లేకుండా పోయిందని, దీనిపై నాడు కేసీఆర్, కేటీఆర్ ఎందుకు ప్రజలకు పత్రికా ముఖంగా చెప్పలేదన్నారు. దీనిపై హైదరాబాద్ లో మీడియా ముందు చెబుతామని కొత్త సచివాలయం నిర్మాణంలో భాగంగా, పాత సచివాలయం కూల్చినప్పుడు మీడియాను లోపలికి అనుమతించలేదని, బీహార్, ఉత్తర ప్రదేశ్ ప్రాంతాల నుండి కూలీలను తీసుకు వచ్చి తవ్వ కాలు జరిపినప్పుడు, నవాబుల కాలంలో సమత బ్లాక్ వెనుక ఉన్న స్వర్గంలో దాచిపెట్టిన వజ్రాలు, బంగారం నాణాలు బయట పడ్డాయని పోలీస్ అధికారి రాధా కిషన్ రావు, డా.వెంకన్న సమక్షంలో వాటిని పకడ్బందీగా అసెంబ్లీ దగ్గర్లో సిసిఎస్ లో ఒక రూమ్ నెంబర్‌లో ఆ నాణేలను పరీక్ష చేయించారన్నారు. వాటిని ప్రభుత్వ ఖజానాకు కాకుండా కెసిఆర్ ఫాం హౌస్‌కు, అక్కడి నుండి ఇతర రాష్ట్రాలకు తరలించారని, ఈ తవ్వకాలు జరిపిన వారిని సాక్షాలు లేకుండా చంపేసి ఎక్కడ పెట్టినారో కేటీఆర్ కు తెలుసన్నది వాస్తవం కాదా.. వీటిపై కూడా విచారణ జరుగుతుందన్నారు.

**కేటీఆర్‌కు జీవితం కాలమంతా తీహార్ జైలులో చిప్ప కూడు తినిపిస్తాం..**

ఈ బంగారం పంపకాలలో తేడా రావడంతోనే కవిత బయటికి వచ్చి వాస్తవాలు వెలుగులోకి తెచ్చిందని, బిఆర్ఎస్ మూడో సారి అధికారంలోకి వస్తె ఈ రాష్ట్రాన్ని అమ్మేసే వాళ్ళుని, ఉత్తర ప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్ రాష్ట్రాలకు ఎన్నికల ఖర్చుల కోసం కెసిఆర్ పంపిన సొమ్ము తెలంగాణ ప్రజలది కాదా.. ఆ హక్కు వారికి ఎవరు ఇచ్చారు. ఇంకా ఏ ముఖం పెట్టుకొని మళ్ళీ అధికారంలోకి వస్తారని కేటీఆర్ అంటున్నారని, త్వరలోనే కేసీఆర్ కుటుంబాన్ని ఈ రాష్ట్ర ప్రజలు తన్ని తరిమేస్తారని పిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం మండిపడ్డారు. ఈ సమావేశంలో నాయకులు ఎర్ర శ్రీనివాస్, క్యాదాషి ప్రభాకర్, సముద్రాల అజయ్, గజ్జెల ఆనందరావు, నీరుకుళ్ళ అనిల్, గడ్డం నాగరాజు, గుంటుకు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరగాలి

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ రూరల్,సెప్టెంబర్ 18 (జనం సాక్షి)**
పత్తి కొనుగోళ్లు సాఫీగా జరిగేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, మార్కెటింగ్, ప్రణాళిక శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలో పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా అవసరమైనా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు మద్దతు ధర (ఎం ఎస్ పి)కింద తగిన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని,రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అలాగే పత్తి మార్కెటింగ్ సీజన్ 2025-26లో జిల్లా సగటు దిగుబడి అంచనాకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కమిటీ మండలాల వారీగా పత్తి సాగు విస్తీర్ణం, అంచనా ఉత్పత్తి వివరాలు సేకరించి వాస్తవికంగా సగటు దిగుబడిని లెక్కించనుందని తెలిపారు. రాష్ట్ర సగటు కంటే 10శాతం మించితే ప్రత్యేక ధ్రువీకరణతో మాత్రమే ఆమోదం ఉంటుందని స్పష్టం చేశారు. రైతులు సహకరించి కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. అనంతరం సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)పై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.



## సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

**గంగాధర సెప్టెంబర్ 18 ( జనంసాక్షి ) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు.చొప్పదండి మండలంలోని ఆర్నకొండ నుండి మల్యాల మండల కేంద్రము వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 50 కోట్లు మంజూరు చేసిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.గురువారం మండలంలోని భూరుగుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు సాగి అజయ్ రావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి.ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేసి మాట్లాడుతూ ఆర్నకొండ నుండి మల్యాల వరకు వెళ్లే రోడ్డుపై గుంతలు పడి ప్రయాణికులకు తరచుగా ప్రమాదాలు జరిగి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నియోజకవర్గంలోని రోడ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆర్నకొండ నుండి మల్యాల వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు.రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి.ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు.మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్.బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య,రామిడి రాజిరెడ్డి. భూరుగు గంగన్న.రోమాల రమేష్,దోర్నాల శ్రీనివాస్ రెడ్డి.భాస్కర్.మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గరిగంటి కరుణాకర్.మల్లేశం.పడితపల్లి కిషన్. గునుకొండ బాబు.అట్ల శేఖర్ రెడ్డి,గుజ్జుల బాపు రెడ్డి,అశోక్. బెజ్జంకి కళ్యాణ్, వినోద్, తిరుపతి గౌడ్, శ్రీనివాస్,అంజయ్య,జాని, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలో చదివే పదవ తరగతి

## విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

**గంభీరావుపేట సెప్టెంబర్ 18 (జనం సాక్షి):** సిఎస్ఆర్ నిధులతో మోడీ గిఫ్ట్ కానుకగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ బడిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా 20,000 సైకిళ్లు పంపిణీ లో భాగంగా గురువారం రోజు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని దమ్మన్నపేట ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 18 మంది విద్యార్థినీ విద్యార్థులకు బిజెపి మండల అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ రావు, అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి సైకిళ్లు పంపిణీ చేశారు, కోడె రమేష్ మాట్లాడుతూ , బండి సంజయ్ కుమార్ విద్యార్థులందరూ మంచి ఉత్తీర్ణతను సాధించి రిటర్న్ గిఫ్ట్ గా ఇయ్యాలని కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు బిజెపి నాయకులు గంట అశోక్ రాజేందర్ రెడ్డి మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు వజిత్ హుస్సేన్ ప్రధాన కార్యదర్శులు మలేష్ యాదవ్ విగ్నేష్ గౌడ్ ఉపాధ్యక్షులు నర్సింలు మోహన్ డాక్టర్ సత్యనారాయణ సర్వోత్తమ్ చంద్రం యాదవ్ పూల్య నాయక్ మహేష్ యాదవ్ దేవరాజు దేవేందర్ నాయక్ భాస్కర్ సత్యం దేవా గౌడ్ నవీన్ రాజేష్ పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో స్వీప్ కార్యకలాపాలు

### ఓటరుగా నమోదు, ఓటింగ్ శాతం పెంచేలా విస్తృత ప్రచారం




**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):** ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదేనని జిహెచ్ఎంసి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, స్వీప్ సహాయ నోడల్ అధికారి డా. వివేకానంద్ అన్నారు. జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల త్వరలో జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ మార్గదర్శనంలో జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో స్వీప్ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. యువతను ఓటరుగా నమోదు చేయించడంతో పాటు ఓటింగ్ శాతాన్ని మరింత పెంచేలా స్వీప్ కార్యక్రమాలను విస్తృతం చేశారు. ఈ క్రమంలో గురువారం ఎర్రగడ్డలోని డాన్ బాస్కో డిగ్రీ కళాశాలలో స్వీప్ అవగాహన కార్యక్రమంలో డా. వివేకానంద్ మాట్లాడారు. ఎన్నికలలో ప్రజల చురుకైన భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యం బలపడుతుందని చెప్పారు. నియోజకవర్గంలో జులై 1, 2025 నాటికి 18 ఏండ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో ఎన్నికల్లో పాల్గొంటే రాజకీయ వ్యవస్థలో స్వచ్ఛత, పారదర్శకత పెరుగుతుందనీ జిహెచ్ఎంసి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, స్వీప్ సహాయ నోడల్ అధికారి డా. వివేకానంద్ చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజశేఖర్, సి.ఓ వెంకటయ్య, శోభారాణి, రిసోర్స్ పర్సన్ లు రామలక్ష్మి , మహమ్మద్ గౌస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## వడ్డాపల్లి రహదారిలో విద్యుత్ అధికారుల పొలం బాట

**ఎడపల్లి, సెప్టెంబర్ 18 ( జనంసాక్షి ) :**
ఎడపల్లి మండలం వడ్డేపల్లి రహదారిలో గురువారం ట్రాన్స్ కో ఏడీఈ ప్రభాకర్ ఆధ్వర్యంలో పొలంబాటను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ ప్రభాకర్ రైతులకు విద్యుత్ జాగ్రత్తలను వివరించడంతో పాటు నియంత్రికల వద్ద చేపట్టాల్సిన అంశాలను వివరించారు. పొలంలో వినియోగించే బోరు మోటర్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. అలాగే బోరు మోటర్లకు కెపాసిటర్లను బిగించుకోవాలని తద్వారా విద్యుత్ వినియోగం తగ్గుతుందని ఈ విషయాన్ని రైతులు గ్రహించాలని ఏడీఈ ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ పొలం బాట కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, లైన్ మెన్లు పవన్, సాయిబాబా, గణేష్, లాలుతో పాటు రైతులు పాల్గొన్నారు.




## మీడియాపై అణచివేత ధోరణి మానుకోవాలి

- టీ న్యూస్ సాంబశివరావు సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌పై కేసులు ఉపసంహరించుకోవాలి
- ముక్తకంఠంతో ఖండించిన అఖిలపక్షం



**ఖమ్మం సెప్టెంబర్ 18, (జనం సాక్షి) :** యూరియా కొరతతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యను కవరేజ్ కోసం వెళ్ళిన ఖమ్మం జిల్లా టీ న్యూస్ బ్యూరో సాంబశివరావు,సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి లపై కేసు నమోదు చేయడాన్ని అఖిలపక్ష పార్టీలు ముక్తకంఠంతో ఖండించాయి. తక్షణమే టీ న్యూస్ బృందంపై సాక్షి ఎడిటర్ పై కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో టియుడబ్ల్యూజే టీజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులపై అక్రమ కేసుల అంశంపై టీజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి సమన్వయకర్తగా రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, సిపిఐ, కాంగ్రెస్, సిపిఎం, బిఆర్ఎస్, టీయూడబ్ల్యూజే ఐసియు , న్యూడెమోక్రసీ ఇతర ప్రజా సంఘాలను నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లేందుకు వార్త కవరేజ్ కి వెళ్లిన వారి జర్నలిస్టులపై ప్రభుత్వం నిర్బంధాలు కొనసాగించడం తగదన్నారు. టీవీ ఛానల్ ను పత్రికలను భజన మీడియాగా మార్చుకున్నందుకు పాలకవర్గం ఇలాంటి నిర్బంధాలు ప్రయోగిస్తుందని విమర్శలు చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక జర్నలిస్టులపై రచయిత లపై దాడులు మరింత పెరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యను వాస్తవమైన విషయాన్ని వార్తా కథనాలుగా రాస్తే తప్పేంటి అని వారు ప్రశ్నించారు? పాలకవర్గాలు మారిన జర్నలిస్టులపై నిర్బంధాలు యధావిధిగా కొనసాగుతున్నాయని భవిష్యత్తులో జర్నలిస్టులపై కేసు నమోదు చేయాలంటే భయపడేలా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సాంబ, నాగరాజు రాజేష్, సాక్షి ఎడిటర్ ధనుంజయ్ లపై కేసులు ఉపసంహరించుకోకపోతే మరోసారి ప్రత్యక్ష ఆందోళనకు నిర్వహించాలని తీర్మానించారు. వార్త కవరేజీ విషయంలో ఏకపక్షంగా ఆలోచిస్తూ జర్నలిస్టులపై కేసులను నమోదు చేయడం సరైనది కాదని దీని పర్యావసనాలు రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుందని హెచ్చరించారు. అఖిలపక్ష రాజకీయ నాయకులు పోటు రంగారావు, భాగం హేమంతరావు, పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పగడాల నాగరాజు, కళ్యాణం వెంకటేశ్వరరావు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కే రామనారాయణ, ఏనుగు వెంకటేశ్వరరావు, సాక్షి బ్యూరో బొల్లం శ్రీనివాస్, కనకం సైదులు, మైస పాపారావు, మాటేటి వేణుగోపాల్, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకుల నరేందర్, పిడిఎస్ యు జిల్లా కార్యదర్శి వెంకటేష్ జర్నలిస్టులకు మద్దతుగా మాట్లాడారు.



### ఘనంగా చేవెళ్ల మాజీ ఎంపీ

## రంజిత్ రెడ్డి జన్మదినం

**రాజేంద్రనగర్, సెప్టెంబర్18(జనం సాక్షి) :** చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం మాజీ ఎంపీ డా.గడ్డం రంజిత్ రెడ్డి పుట్టిన రోజు వేడుక ఘనంగా జరిగింది. గురువారం ఆయన నివాసంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిజెఎంసి మాజీ కార్పొరేటర్ చంద్రశేఖర్,16వ వార్డు ఇంచార్జి టింకు రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంతోష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు రాజి రెడ్డి, పి. వెంకట్ రెడ్డి, సంజీవ్ రెడ్డి, లక్ష్మా రెడ్డి, వెంకట్ రెడ్డి, దశరథ్, గౌస్, శివ, అనంతరాజు, గంగన్న, నర్సింహ, నరేష్, అభిషేక్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత చేప పిల్లలను పంపిణి చేయాలి

### మంత్రి శ్రీధర్ బాబుకు మంత్రికి వినతి పత్రం అందజేసిన జిల్లా డైరెక్టర్ పోతరవేని క్రాంతి

**మంథని, (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారుల కోసం అందించే ఉచిత చేప పిల్లల పంపిణీ ఆలస్యం అవుతున్నందున మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారని త్వరగా చేప పిల్లల పంపిణీ జరిగేలా చూడాలని, లేనిపక్షంలో నగదు బదిలీ చేపించాలని, అలాగే మత్స్యకారులకు నూతన పథకాలు పెట్టి ఆర్థికంగా ప్రోత్సహించాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ను పెద్దపల్లి జిల్లా మత్స్యపరిశ్రామిక సంఘం డైరెక్టర్, మంథని మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షులు పోతార వేణి క్రాంతి కుమార్ కలిసి వినతి పత్రం అందజేశారు.

## ముప్పు లేకుండా హైడ్రా యాక్షన్ ప్లాన్

### నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్

### శాశ్వత పరిష్కారం చూపాలంటూ ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబర్, 18 (జనం సాక్షి):**
నగరంలో నీట మునిగిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం పరిశీలించారు. అమీర్‌పేటలోని గాయత్రి కాలనీ, మాధాపూర్ లోని అమర్ సొసైటీ, బాగ్‌లింగంపల్లిలోని శ్రీరాంనగర్‌లలో హైడ్రా కమిషనర్ పర్యటించారు. అమీర్‌పేట వద్ద కాలువల్లో పూడిక తీయడంతో సాఫీగా వరద సాగుతోందని ఇదే మాదిరి నగరంలోని అన్నిచోట్ల నీటి మునకకు మూలాలను తెలుసుకుని సమస్య పరిష్కరించాలని హైడ్రా కమిషనర్ సూచించారు. పైనుంచి భారీ మొత్తంలో వస్తున్న వరద నీరు మైత్రి వనం వెనుక ఉన్న గాయత్రినగర్‌ను ముంచెత్తుతోందని, ఇక్కడ కూడా కాలువలలో సిల్ట్ తొలగించి వరద ముప్పు సమస్యతను తొలగించాలని అక్కడి నివాసితులు కమిషనర్‌ను కోరారు. పై నుంచి నాలాల్లో పూడిక తీసుకుని వస్తున్నామని, ఇక్కడ కూడా పరిష్కార చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.

**దుర్గం చెరువులో నీటిమట్టం తగ్గించాలి**
దుర్గం చెరువులో నీటి మట్టం పెరగడంతో పై భాగంలో ఉన్న అమర్ సొసైటీతో పాటు అనేక కాలనీలుకు వరదనీరు పోటెత్తుతోందని స్థానికులు కమిషనర్ రంగనాథ్ కి తెలిపారు. చెరువు నీటి మట్టం తగ్గిస్తే కొంతవరకు సమస్య పరిష్కారమౌతుందని సూచించారు. ఈ విషయమై ఇరిగేషన్, జీ హెచ్ ఎంసీ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. క్లౌడ్ బర్స్ట్‌తో అనూహ్యంగా గంట వ్యవధిలోనే 15 సెంటీమీటర్లకు పైగా వర్షం పడడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని.. ఆ పరిస్థితులను తట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కమిషనర్ సూచించారు.



**శ్రీరాంనగర్ సమస్యకు రెండు రోజుల్లో పరిష్కారం**
బాగ్‌లింగంపల్లిలోని శ్రీరాంనగర్లో వరద నీరు పోయేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ సూచించారు. శ్రీరాంనగర్ నుంచి హుస్సేన్‌సాగర్ వదర కాలువలో కలిసేలా ప్రత్యేక నాలాను నిర్మించాలన్నారు. నేరుగా హుస్సేన్ సాగర్ వరద కాలువలో కలపకుండా.. కొంతదూరం కొనసాగించి నాలాను కలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు రోజుల్లో ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో ఉన్న నాలాను బంద్ చేసి.. అక్కడ ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది కబ్జా చేస్తున్నారని.. ఆ నాలాను పునరుద్ధరిస్తే వెంటనే సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు కమిషనర్‌కు తెలిపారు. శ్రీరాంనగర్‌లో వందలాది గృహాలకు దారి లేకుండా పోయిందని నడుం లోతు నీటిలో ఇళ్లకు ఎలా వెళ్లేదని స్థానికులు కమిషనర్ ముందు వాపోయారు. మోటార్లు పెట్టి తోడుతున్నా సమస్య పరిష్కారం కావడంలేదని.. ఇక్కడ ఉన్న ఖాళీ స్థలంలోంచి నాలాను తీసుకెళ్లి హుస్సేన్‌సాగర్ వరద కాలువలోకలిపాలని కోరారు.



## హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**గోదావరిఖని, జనంసాక్షి :** టియుఎఫ్ఐడిసి నిధులు రూ. 1.25 కోట్లతో ఏర్పాటు చేసిన హై మాస్ట్ లైట్లను రామగుండం ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్ గురువారం సాయంత్రం ప్రారంభించారు. రమేష్ నగర్, తిలక్ నగర్, ఫైవ్ ఇంక్ లైన్ చౌరస్తా, సింగరేణి స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన హై మాస్ట్ లైట్లను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు),రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణశ్రీ తో కలిసి ప్రారంభించారు. నగరంలో 25ముఖ్య కూడళ్లలో ఈ హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## సెప్టెంబర్ 19న చలో ఇందిరా పార్క్

- బంజారా, లంబాడిల బహిరంగ సభను జయప్రదం చేయండి.
- పోచారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్



**ఘట్కేసర్, సెప్టెంబర్, 18 (జనం సాక్షి):**
లంబాడీల ఆత్మగౌరవ సభకు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇస్లావత్ రామ్ చంద్రనాయక్ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మూడవ రాంపాల్ నాయక్ పిలుపు..!, భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటి నుండే ఆర్టికల్ 342 ప్రకారం సుగాలి, బంజారా, లంబాడీలు ఎస్టీలుగా గుర్తించబడ్డారు. సెప్టెంబర్ 19న హైదరాబాదులోని ఇందిరా పార్కులో లంబాడీల ఆత్మగౌరవ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే లంబాడీల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు విశ్లావత్ రామ్ చంద్రనాయక్ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ రాంబాబు నాయక్ పిలుపునిచ్చారు. ఇందిరాపార్క్ లో నిర్వహించే లంబాడీల ఆత్మగౌరవ సభకు వేలాదిగా లంబాడా బిడ్డలు తరలి రావాలని, పార్టీలకతీతంగా విద్యార్థులు, యువకులు, మేధావులు, ఉద్యోగార్డులు(నిరుద్యోగులు), ఉద్యోగులు పాల్గొనాలని ఆల్ ఇండియా బంజారా సంఘం అసోసియేషన్ అధ్యక్షులు మోహన్ సింగ్ రాథోడ్, విష్ణు నాయక్, ఆల్ ఇండియా ప్రజా సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కిషన్ నాయక్ తదితర షెడ్యూల్ తెగల(లంబాడీల) నాయకులు పిలుపునిచ్చారు.

## ప్రజా సేవలో నిస్వార్థం, నిబద్ధతతో పనిచేయాలి





- గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం
- రోడ్లపై మద్యపానంపై కఠిన జరిమానాలు
- పశువుల నియంత్రణకు వ్యాక్సినేషన్ తప్పనిసరి : కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ప్రజల సమస్యల పరిష్కారంలో నిబద్ధత

**పెద్దపల్లి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18 (జనంసాక్షి):**
గ్రామ పరిపాలన అధికారులు నిస్వార్థంగా, నిజాయితీతో పనిచేసి ప్రజలకు విశిష్ట సేవలు అందించాలని, రోడ్లపై మద్యపానం నిషేధించడంతో పాటు పశువుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నూతన గ్రామ పరిపాలన అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో, మద్యపాన నియంత్రణ, పశువుల నియంత్రణపై సమీక్షలలో ఆయన మాట్లాడారు.
రెవెన్యూ వ్యవస్థను గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రభుత్వం గ్రామ పరిపాలన అధికారులను నియమించిందని కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గ్రామాల్లో చేసే ప్రతి పనిని ప్రజలు క్షుణ్ణంగా గమనిస్తారని, అన్ని రిపోర్టులు ఆన్‌లైన్‌లో నమోదవుతాయని, కాబట్టి అవకతవకలకు, నిర్లక్ష్యానికి ఆస్కారం లేదని స్పష్టం చేశారు. గ్రామ పాలన అధికారులు కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలని, భూ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరని, ఫోన్ ద్వారా రిపోర్టులు ఇవ్వడానికి వీల్లేదని ఆదేశించారు. నూతన రెవెన్యూ చట్టం భూ భారతిని పటిష్ఠంగా అమలు చేయాలని, ప్రజల భూ సమస్యలను నిజాయితీ, నిబద్ధతతో పరిష్కరించి, ప్రభుత్వ భూముల సంరక్షణ, పట్టా భూముల నిర్వహణ, సర్టిఫికెట్ల జారీ వంటి బాధ్యతలను సకాలంలో నిర్వర్తించాలని సూచించారు. సిటిజన్ చార్ట్ ప్రకారం సేవలు అందేలా, క్షేత్రస్థాయిలో అధికారులను నిరంతరం పర్యవేక్షిస్తామని, నియామక పత్రాలు పొందిన అభ్యర్థులు వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.
జిల్లాలో వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్ల ముందు రోడ్లపై మద్యపానం సేవించడం నిషేధమని, ఇది పరిశుభ్రత సమస్యలు, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తుందని కలెక్టర్ హెచ్చరించారు. పర్మిట్ రూమ్ ఉన్న వైన్ షాపుల్లో మాత్రమే మద్యం సేవించాలని, లేనిపక్షంలో ఇంటివద్ద సేవించాలని, బహిరంగంగా రోడ్లపై మద్యపానం చేస్తే మున్సిపల్ చట్టం-2019 ప్రకారం 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయల వరకు జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. వైన్ షాపుల సమీపంలో చెత్త వేసినా ఇదే చట్టం కింద చర్యలు తీసుకుంటామని ఆదేశించారు.
రోడ్లపై పశువుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కుక్కలు, ఆవులు, కోతులు, పందులు సంచరించకుండా చూడాలని కలెక్టర్ సూచించారు.
పశువులను సమాంత గోశాలకు తరలించాలని, వాటి ద్వారా ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అన్ని పశువులకు వ్యాక్సినేషన్ తప్పనిసరని, యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) నిబంధనలను పాటించాలని ఆదేశించారు. కుక్కలు వీధుల్లో దాడులు చేయకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్‌డీఓలు గంగయ్య, సురేష్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, అబ్కారీ అధికారి మహిపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, వెంకన్న, రమేష్, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ భాస్కర్, మండల పంచాయతీ అధికారులు, వెటర్నరీ వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలలో భాగంగా శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయం ఆవరణలో సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని ప్రజా పరిపా లన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోరడే కార్యాలయం ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించినప్పటికీ నిజాం సంస్థానం దేశంలో విలీనం కాలేదని, హైదరాబాదు ను అప్పటికేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రోత్సలంతో దేశంలో విలీనం చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎన్నో దుస్సంఘటనలు, దారుణాలు చోటు చేసుకున్నప్పటికీ హైదరాబాద్ రాష్ట్రం దేశంలో విలీనమైన తర్వాత దినదిన ప్రవర్ధమానం చెంది నేడు ప్రపంచ నగరంగా బాసిల్లుతుంద నడంలో అతిశయోక్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయ వివిధ విభాగాల ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.



# మంథనిలో సీబీఐ విచారణ షురూ!

- న్యాయవాద దంపతుల హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన బృందం..
- వామన్ రావు తండ్రి నుంచి వివరాల సేకరణ

మంథని, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా మంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన న్యాయవాద గట్టు వామన్ రావు దంపతుల జంట హత్య దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించగా.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించిన విషయం అందరికీ తెలిసిందే. అడ్వకేట్ వామన్ రావు దంపతుల హత్య కేసులో సీబీఐ విచారణ ప్రారంభమైంది. గురువారం మంథని మండలం గుంజపడుగులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారులు విచారణ చేపట్టారు. హైకోర్టు న్యాయవాదులు గట్టు వామన్‌రావు దంపతుల హత్య కేసులో నిందితులు బెయిల్‌పై ఉన్నారు. వామన్‌రావు దంపతుల హత్య కేసులో అప్పటి అధికార బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతల హస్తం ఉందని వామన్ రావు తండ్రి కిషన్‌రావు ఆరోపణల నేపథ్యంలో సీబీఐ అధికారులు విచారణ ప్రారంభించారు. అనంతరం మంథని కోర్టు ప్రాంగణంలో వామన్ రావు తండ్రి కిషన్ రావు, వామన్ రావు తమ్ముడు చంద్రశేఖర్ నుంచి వివరాలను సీబీఐ అధికారులు సేకరించారు. హత్య జరిగిన ప్రదేశాన్ని సీబీఐ బృందం పరిశీలించింది. మంథనికి సీబీఐ ఎంట్రీ ఇవ్వడంతో ఏం జరుగుతుందోనని రాష్ట్ర, ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

# ఆల్మట్టి ఎత్తు పెంచుతున్నా పట్టించుకోరా?

- కృష్ణా జలాల వాటా వదలుకోబోమన్న సీఎం చేస్తున్నదేంటి?
- రేవంత్ తీరుపై మండిపడ్డ మాజీ ఎంపీ వినోద్



హైదరాబాద్, సెప్టెంబర్18 (జనంసాక్షి) : అల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తుంటే.. ఇప్పటికీ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించక పోవడంపై బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ అంశంపై తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు. కృష్ణా ట్రిబ్యునల్ 2013లో అల్మట్టి ప్రాజెక్టు ఎత్తుకు సంబంధించి తీర్పు ఇచ్చింది. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ తీర్పుపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఆందోళనల నేపథ్యంలో అప్పటి ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ వేస్తే ట్రిబ్యునల్ తీర్పుపై స్టే వచ్చింది. 2014లో తెలంగాణ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టు స్టే కొనసాగించేలా చర్యలు చేపట్టింది. సుప్రీం కోర్టు స్టే ఉండగానే కర్ణాటక ప్రభుత్వం అల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు ప్రయత్నిస్తోంది. నిన్న కర్ణాటక ప్రభుత్వం అల్మట్టి ప్రాజెక్టు విస్తరణ కోసం లక్షా 33 వేల ఎకరాల భూ సేకరణ చేయాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించింది. ఈ భూ సేకరణ కోసం రెండేళ్లలో రూ. 70 వేల కోట్లు ఖర్చు పెట్టాలని కర్ణాటక లక్ష్యంగా పెట్టుకుంది. కర్ణాటకలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే. కర్ణాటక అల్మట్టిపై నిర్ణయం తీసుకుని రెండు రోజులు అవుతున్నా సీఎం రేవంత్ రెడ్డి ఇంకా స్పందించలేదు. సుప్రీంకోర్టు స్టే పెండింగ్‌లో ఉండగానే కర్ణాటక అల్మట్టి ఎత్తు పెంచడానికి తీసుకున్న నిర్ణయంపై తక్షణమే మన రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. కృష్ణా నదిలో ఒక్క నీటి చుక్కను వదలుకోమని ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి ఓ సమీక్ష సమావేశంలో చెప్పారు. మరి కర్ణాటక అక్రమంగా అల్మట్టి ఎత్తు పెంచుతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ కర్ణాటక నిర్ణయంపై స్పందించారు. అల్మట్టి ఎత్తు పెంచితే తమ రాష్ట్రంలోని రెండు జిల్లాలు సాంగ్లీ, కొల్హాపూర్ జిల్లాల్లో ముంపు ఉంటుందని మహారాష్ట్ర సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. అల్మట్టి ఎత్తు పెంపును ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోమని అడ్డుకుని తీరుతామని ఫడ్నవీస్ హెచ్చరించారు అని వినోద్ కుమార్ గుర్తు చేశారు. కేసీఆర్‌పై ద్వేషమే తప్ప రేవంత్ రెడ్డికి కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయం చేయాలని లేదు. కేసీఆర్ పట్టు-దలతోనే సెక్షన్ 3 ప్రకారం కృష్ణా ట్రిబ్యునల్‌లో వాదనలు జరుగుతున్నాయి. కేసీఆర్ కృష్ణా ట్రిబ్యునల్ కోసం 33 లేఖలు కేంద్ర ప్రభుత్వానికి రాశారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తగ్గించారని కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి పదే పదే నిందలు వేస్తున్నారు. నిన్న కూడా సెప్టెంబర్ 17 వేడుకల ప్రసంగంలోనూ కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి విషం చిమ్మారు. తెలంగాణ ఏర్పడ్డ నెల రోజులకే కేసీఆర్ కేంద్ర ప్రభుత్వానికి కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటు- కోసం లేఖ రాశారు. కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటు-ను మహారాష్ట్ర, కర్ణాటక వ్యతిరేకించినా కేసీఆర్ మాటనే చివరకు నెగ్గింది. కేసీఆర్‌పై నిందలు మాని అల్మట్టిపై కర్ణాటక దూకుడును రేవంత్ రెడ్డి అడ్డుకోవాలి. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందుకే రేవంత్ రెడ్డి మౌనంగా ఉన్నారా..? రేవంత్ రెడ్డి ఇప్పటికైనా సుప్రీంకోర్టులో కర్ణాటకకు వ్యతిరేకంగా కంటెంప్ట్ పిటిషన్ వేయాలి. అల్మట్టి ఎత్తు పెరిగితే తెలంగాణకు భారీ నష్టం వాటిల్లుతుంది.. రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన స్పందించాలి అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.



## ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీ

- ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) : ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు మరణించారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలంలోని కొత్తమొల్గర సమీపంలో గురువారం మధ్యాహ్నం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపురం మండలానికి చెందిన ముగ్గురు ప్రయాణికులు ఆటోలో భూత్పూర్ వైపు వెళుతున్నారు. ఆటో డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ కొత్త మొల్గర సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో గట్టుకాడిపల్లి గ్రామానికి చెందిన సంపల్లి వంశీ (24), హైదరాబాద్‌కు చెందిన నర్సింహారెడ్డి (57) ఘటనా స్థలంలోనే మృతి చెందారు. దొంతికుంట తాండకు చెందిన పాత్లవత్ సక్రి (34) తీవ్రగాయాలపాలవ్వడంతో జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విమాన రెక్కల్లో ఇరుక్కుపోయిన పక్షి

- చాకచక్యంగా కిందకు దింపిన పైలట్

విశాఖపట్నం, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) : ఈ మధ్యకాలంలో పలు విమానాలు పెను ప్రమాదాల నుంచి తృటిలో తప్పించుకుంటున్నాయి. తాజాగా ఎయిరిండియాకు చెందిన ఎక్స్‌ప్రెస్ విమానం పెను ప్రమాదం నుంచి తప్పించుకుంది. విశాఖ నుంచి మధ్యాహ్నం 2.20 గంటలకు విమానం హైదరాబాద్‌కు బయలు దేరింది. టేకాఫ్ అయిన కొంత సమయానికే విమాన రెక్కలలో ఓ పక్షి ఇరుక్కుపోయింది. పక్షి ఇరుక్కోవడంతో విమాన ఇంజిన్ ఫ్యాన్ రెక్కలు దెబ్బ తిన్నాయి. ఇది గమనించిన పైలట్ చాకచక్యంగా విమానాన్ని వెనక్కి తీసుకొచ్చి ల్యాండ్ చేశారు. దీంతో విమానం పెను ప్రమాదం తప్పింది. ఘటన జరిగిన సమయంలో విమానంలో మొత్తం 103 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులకు ఎయిరిండియా యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి గమ్యస్థానానికి చేరుస్తుంది.

# తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష

- యూరియా సరఫరాలో నిర్లక్ష్యం
- కేంద్రమాజీమంత్రి వేణుగోపాలాచారి



ఆదిలాబాద్, సెప్టెంబర్18 (జనంసాక్షి) : యూరియా విషయంలో స్పష్టత లేని కేంద్రం, రాష్ట్రాల పట్ల నిర్లక్ష్యం వహించిందని మాజీకేంద్రమంత్రి, కాంగ్రెస్ నేత డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి అన్నారు. రాష్ట్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నా కేంద్రం ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రకటన చేయలేదన్నారు. దీనికితోడు రాష్ట్రంలోని బిజెపి ఎంపిలు, మంత్రులు అనవసరంగా నోరు పారేసుకోవడం సరికాదన్నారు. ఇకపోతే కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులపైన, హామీలపైన స్పష్టత ఇవ్వడంలో విఫలమైన కేంద్రంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. యూరియాపై ఎందుకు స్పష్టత ఇవ్వరని అన్నారు. ఇప్పుడు దేశంలో ఆహర కొరతకు, ధాన్యం రేట్లు పెరగడానికి కారణం ఎవరని అన్నారు. తెలంగాణ పండించిన ధాన్యాన్ని బేషరతుగా కొనివుంటే ఇవాళ ఇంతటి సంక్షోభం వచ్చి ఉండేది కాదన్నారు. ఇంతకాలం తాము సంయమనంతో వ్యవహరించామని అన్నారు. తమ ఎంపిలు పార్లమెంటులో పోరాడినా లాభం లేకుండా పోయిందన్నారు. కేంద్రం నీతి ఆయోగ్ ఏర్పాటు చేసినప్పుడు చేసిన ప్రకటనలకు తాజాగా అనుసరిస్తున్న విధానాలకు పొంతన లేకుండా ఉందన్నారు. నిధుల విడుదలలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందన్నారు. బిజెపి ఎంపిలు కూడా తప్పుదోవ పట్టించడం తగదన్నారు. తెలంగాణలో హుంకరిస్తున్న నేతలు ఈ నేలకు ఏంచేశారో చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని వారు గుర్తించాలన్నారు. అనేక విషయాల్లో కేంద్రం తెలంగాణపై చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. ఈ సమస్య తెలంగాణకు సంబంధించిందే కాదని.. దాదాపు చాలా రాష్ట్రాలకు సంబంధించిందన్నారు. ఆర్థిక సంఘం బకాయిలు, గ్రామీణాభివృద్ధి నిధులు తక్షణమే విడుదల చేయాలని కొత్త ప్రభాకర్ రెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని సూచించారు.

## డిపి స్కూళ్లో విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి

- నిర్లక్ష్యంగా వ్యవహరించిన నాచారం సిఐపై బదిలీవేటు

హైదరాబాద్, సెప్టెంబర్18 (జనంసాక్షి) : దిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థిపై దాడి ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై నాచారం సీఐపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. పుట్టిన రోజున.. బర్త్‌డే బంప్స్ పేరిట తోటి విద్యార్థులు చేసిన వికృత చేష్టలతో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. కొత్తపేటకు చెందిన విద్యార్థి(14) నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆగస్టు 29న పుట్టినరోజు కావడంతో.. తోటి విద్యార్థులు మధ్యాహ్నం విరామ సమయంలో సరదాగా చేసిన చేష్టలతో ఆ విద్యార్థి మర్మంగానికి గాయమై రక్తస్రావమైంది. పిడిగుద్దుల ధాటికి రక్తం కారుతున్నా.. తోటి విద్యార్థులు వదల్లేదు. విషయం తెలిసి ప్రిన్సిపల్ ఆ విద్యార్థిని ఆసుపత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు మెరుగైన వైద్యం కోసం బంజారాహిల్స్‌లోని ఆసుపత్రికి తరలించారు. విద్యార్థికి శస్త్ర చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఘటనపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినప్పటికీ బాధ్యులైన విద్యార్థులు, పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని నాచారం సీఐని బదిలీ చేస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

# పిల్లలకు విలువలను వారసత్వంగా ఇవ్వండి

- మహనీయుల చరిత్రలను తెలియచేయండి
- సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణలో ఈటెల



హైదరాబాద్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) : పిల్లలకు వారసత్వంగా ఆస్తులు కాకుండా విలువలు, సంప్రదాయాలు, దేశభక్తిని నేర్పించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. కన్నవారిని, కన్నపిల్లలను, జీవిత భాగస్వామిని చంపుకుంటున్న ఘటనలు కలచివేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మన విలువలే మనల్ని ఇలాంటి దురాగతాల నుంచి కాపాడతాయని హెచ్చరించారు. ఉప్పల్ నియోజకవర్గం కాప్రాలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆత్మగౌరవం, దేశభక్తి విలువలు గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తమ ఆత్మగౌరవం కోసం ఎమ్మెల్యే పదవిని గడ్డిపోచలా వదిలివేశామని ఈటల రాజేందర్ అన్నారు. ఆత్మగౌరవం కోల్పోయి వచ్చే ఏ పదవి అయినా విలువలేనిదని ఆయన స్పష్టం చేశారు. స్వయంపాలన కోసమే తాము 20 ఏళ్లలో ఆరుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచామని గుర్తు చేసుకున్నారు. . ఈ ఘటనలు ఎక్కడో జరుగుతున్నాయని అనుకోవద్దని, అవి మన ఇంటి గడపను కూడా తట్టే అవకాశం ఉందని హెచ్చరించారు. మహనీయుల విగ్రహాలను స్థాపించడం, జయంతులు, వర్ధంతులు చేసుకోవడం కేవలం దండ వేయడానికి మాత్రమే కాదని, వారి చరిత్రను భావితరాలకు అందించడం కోసమని ఈటల అన్నారు. తెలంగాణ ప్రజల రక్త తర్పణాన్ని గుర్తుచేస్తూ, భారత స్వాతంత్య్రం కోసం లక్షల మంది చేసిన పోరాటాలను, త్యాగాలను ఆయన కొనియాడారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ గురించి మాట్లాడుతూ, ఆయన గొప్ప మేధావి అని, తన ప్రాణం భారత జాతి విముక్తి కోసమేనని పోరాడారని ప్రశంసించారు. నేటి తరానికి స్వాతంత్ర్య వేడుకల ప్రాముఖ్యత తెలియడం లేదని, వారు పుస్తకాలు చదవక, చరిత్రను తెలుసుకోలేకపోతున్నారని ఈటల రాజేందర్ విచారం వ్యక్తం చేశారు.

## జీఎస్టీ సంస్కరణలకు ఏపీ తొలి మద్దతు : పవన్

అమరావతి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) : రాష్ట్ర ఆదాయాలకు ఇబ్బంది గా ఉన్నా జిఎస్టీ చారిత్రాత్మక సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం ఏపీనే అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. జీఎస్టీ పన్నుల నూతన విధానం ద్వారా ప్రజలకు మేలు చేసే విధానం మంచిదని.. దీనివల్ల దేశం స్థిరమైన వృద్ధి పెరుగుతోందని చెప్పుకొచ్చారు. జీఎస్టీ 2.0 సంస్కరణలపై ఏపీ శాసన సభలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీర్మానం చేశారు. 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జీఎస్టీ సంస్కరణలపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రకటనను స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు.

# ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ దాడులు

- ఏకకాలంలో 20 చోట్ల పెద్ద ఎత్తున తనిఖీలు
- సిట్ నివేదిక ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ

అమరావతి, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) : రూ.3,500 కోట్ల విలువైన ఏపీ లిక్కర్ స్కామ్ అంశంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీలో ఈడీ తనిఖీలు చేపట్టింది. మద్యం కుంభకోణం కేసులో నిందితుల సంస్థలు, కార్యాలయాల్లో అధికారులు సోదాలు చేశారు. 5 రాష్ట్రాల్లోని 20 ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. మరోవైపు ఏపీ మద్యం కుంభకోణం కేసులో సిట్ ఇప్పటివరకూ 29 మంది వ్యక్తులు, 19 సంస్థలను నిందితులుగా చేర్చింది. 12 మందిని అరెస్టు చేసింది. ధనుంజయరెడ్డి (ఏ-31), కృష్ణమోహన్‌రెడ్డి (ఏ-32), బాలాజీ గోవిందప్ప (ఏ-33), పైలా దిలీప్ (ఏ-30)లు బెయిల్‌పై బయటకు రాగా.. చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేశ్‌నాయుడు సహా మొత్తం 8 మంది ఇంకా జైల్లోనే ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఏకకాలంలో తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీలలోని 20 ప్రాంతాల్లో దాడులు జరిగాయి. మద్యం కుంభకోణం నిందితుల సంస్థలు, కార్యాలయాల్లో అధికారులు సోదాలు చేశారు. లిక్కర్ స్కాంలో ఉన్న నిందితుల ఇళ్లలోనూ ఈడీ సోదాలు జరిగాయి. నకిలీ ఇన్వాయిస్‌లు, పెంచిన మద్యం ధరల వెనుక భారీ స్కాం జరిగినట్లు ఈడీ గుర్తించింది. ఈ కేసులో సిట్ ఇప్పటివరకూ 29 మంది వ్యక్తులు, 19 సంస్థలను నిందితులుగా చేర్చి.. 12 మందిని అరెస్టు చేసింది.ఏపీ మద్యం కుంభకోణం మొత్తం విలువ రూ. 3,500 కోట్లుగా ఈడీ అంచనా వేసింది. నకిలీ ఇన్‌వాయిస్‌లు, పెంచిన బిల్లుల ఆధారంగా కిక్ బ్యాక్‌లు చెల్లింపులు జరిగాయని దర్యాప్తులో బయటపడింది. పలు కంపెనీలు, మద్య వ్యాపారాలకు సంబంధించిన కీలక వ్యక్తులు ఈ స్కాంలో ప్రమేయం ఉన్నట్లు- అనుమానం వ్యక్తం చేస్తోంది. ఫ్రంట్ కంపెనీలు ద్వారా డబ్బు లావాదేవీలు జరిగాయని ఈడీకి ఆధారాలు లభించాయి. కిక్ బ్యాక్‌ల కోసం తప్పుడు ఖర్చుల చూపులు, మేనిప్యులేటెడ్ బిల్లులు వాడారని ఆరోపణలు ఉన్నాయి. నిందితుల ఇళ్లు, ఆఫీసులు, గోదాములు, సంబంధిత అకౌంటింగ్ సంస్థల ప్రాంగణాల్లో శోధనలు జరుగుతున్నాయి.ఏపీ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ రిపోర్టులు, ఐటీ- శాఖ సమాచారం ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. కుంభకోణంలో రాజకీయ సంబంధాల కోణాన్ని కూడా పరిశీలిస్తోంది. ఈడీ దాడుల్లో పెద్ద మొత్తంలో డాక్యుమెంట్లు-, డిజిటల్ డేటా, లావాదేవీల రికార్డులు స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. హవాలా మార్గంలో సుమారు వందల కోట్ల సొమ్ము తరలింపులు జరిగాయని అనుమానం వ్యక్తం చేస్తోంది. ఈ దాడులు మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉన్నట్లు- సమాచారం. ఈ కేసుకు సంబంధించిన ఇప్పటికే పలువురు నిందితులు.. ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలు అరెస్ట అయి.. బెయిల్‌పై జైలు నుంచి విడుదలయ్యారు. ఇక ఇదే కేసులో అరెస్ట్ అయి.. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి సైతం బెయిల్ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాంటి వేళ.. ఈ మద్యం కుంభకోణంలో దర్యాప్తు చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. ఆ క్రమంలో చెన్నై, హైదరాబాద్, న్యూఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఈడీ అధికారులు గురువారం ముమ్మర దాడులు నిర్వహించారు. దాదాపు 10 బృందాలు ఈ దాడుల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి ఆస్తులపై ఈడీ దృష్టి సారించినట్లు- సమాచారం. మద్యం వ్యవహారంలో పొందిన ముడుపులను షెల్ కంపెనీలకు పంపిన తద్వారా నల్ల ధనాన్ని వైట్‌గా మార్చారంటూ ఇప్పటికే రాజ్ కసిరెడ్డిపై సిట్ నిగ్గు తేల్చింది. ఈ వ్యవహారానికి సంబంధించి.. సిట్ నుంచి ఈడీ సీనియర్ అధికారులు అందుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని మూడు రోజుల క్రితమే తీసుకున్నట్లు తెలుస్తోంది.



## కుమారుని పెళ్లి రిసిప్షన్ రద్దు చేసుకున్న ఎమ్మెల్యే

- రైతుల సంక్షేమం కోసం 2కోట్లు ఇవ్వాలని నిర్ణయం
- సిఎం రేవంత్‌ను కలిసి చెక్ అందజేసిన బత్తుల లక్ష్మారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (జనంసాక్షి) : మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఉదారత చాటుకున్నారు. రైతుల సంక్షేమం కోసం రెండుకోట్లు విరాళంగా ఇచ్చారు. దీనిని చెక్కు రూపంలో సిఎం రేవంత్ రెడ్డికి అందించారు. తన నియోజకవర్గంలోని రైతుల కోసం ఖర్చు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు విరాళం అందించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌ను లక్ష్మారెడ్డి కలిసి రూ. 2కోట్ల చెక్ అందజేశారు. లక్ష మంది రైతులకు ఒక్కో యూరియా బస్తా ఉచితంగా అందించాలని సీఎంను ఆయన కోరారు. ఇటీవల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుమారుడు సాయి ప్రసన్న వివాహం జరిగింది. మిర్యాలగూడలో భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భావించారు. కానీ రిసెప్షన్‌ను రద్దు చేసుకుని ఆ డబ్బును రైతుల కోసం ఖర్చు చేసేందుకు ఆయన ముందుకు వచ్చారు. దీంతో వెంటనే సిఎంకు చెక్కును అందించారు. లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను సీఎం అభినందించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370